ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 13.08.2025 | సంపుటి :12 సంచిక : 25 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370








జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం

## కీలక మలుపు

అభిశంసన తీర్మానం స్వీకరించిన స్పీకర్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇంట్లో నోట్ల కట్టలు లభించిన ఘటనలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ఆయన అభిశంసన కోసం

మిగతా 9లో..




'బీఆర్ఎస్ కదనభేరీ'

## మళ్లీ వాయిదా

**కరీంనగర్‌బ్యూరో(జనంసాక్షి):** కరీంనగర్ వేదికగా బిఆర్ఎస్ నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను వాయిదా వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం వెంటనే

మిగతా 12లో..

# హైదరాబాద్‌లో అతిభారీ వర్షసూచన

## అప్రమత్తంగా ఉండండి: సీఎం రేవంత్

- అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు
- పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలి
- విద్యుత్, వైద్యారోగ్య, విపత్తు నిర్వహణ సహా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి
- ప్రాణ నష్టం వాటిల్లకుండా జాగ్రత్త పడాలి
- ఐటీ, విద్యా శాఖల అధికారులు పరిస్థితికి తగినట్లు నిర్ణయం తీసుకోవాలి
- భారీ వర్ష సూచన ఉన్న జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలి
- భారీ వర్షాల నేపథ్యంలో సీఎం ఆదేశాలు



కమాండ్ కంట్రోల్ సెంటర్ లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్.. హాజరైన మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ఉన్నతాధికారులు

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎంతటి భారీ వర్షాలు వచ్చినా ప్రాణ నష్టం వాటిల్లకుండా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు కాజ్‌వేలు, ఉధృతంగా ప్రవహించే నదులు, వాగులు, వంకలపై వంతెనలపై నుంచి రాకపోకలు లేకుండా చూడాలని సీఎం సూచించారు. పశువులు, గొర్రెలు, మేకల కాపర్లు తరచూ వాగుల్లో చిక్కుకొనిపోతున్నారని.. ఈ విషయంలో ముందస్తుగా వారిని అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు. ఎక్కడైనా ప్రమాదవశాత్తూ చిక్కుకుంటే వారిని తక్షణమే బయటకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదే సమయంలో పశు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. రానున్న 72 గంటల్లో తెలంగాణవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మిగతా 2లో..

## ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలి

- అటవీ, రెవెన్యూ భూముల హద్దులు నిర్ధారించాలి
- అటవీ జంతువుల దాడి బాధితులకు తక్షణ పరిహారం
- అధికారుల ప్రమోషన్లు... అవార్డులకు ప్రతిపాదనలు పంపాలి..
- అటవీ నిఘా కెమెరాలు ఐసీసీసీతో అనుసంధానించాలి: సీఎం రేవంత్

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధి, కారులను ఆదేశించారు. సింగపూర్ వంటి దేశాల్లో 30 ఎకరాల్లోనే నైట్ సఫారీలు ఉన్నాయని... మన దగ్గర భారీ విస్తీర్ణాల్లో అటవీ ప్రాంతాలు.. అందులోనే నదులు, జలపాతాలు ఉన్నందున మనకు ఉన్న వనరులను సద్వినియోగం చేసే ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు.

మిగతా 2లో..

# అన్ని వివరాలతో సిద్ధంగా ఉండాలి

బీహార్ ఓటర్ల జాబితా సవరణపై ఈసీకి సుప్రీం ఆదేశం

ఆధార్‌ను పౌరసత్వంగా గుర్తించలేమన్న ధర్మాసనం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే సరైన వివరాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం సూచించింది. విచారణ క్రమంలో ఆర్జేడీ నేత మనోజ్ ఝా తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఓ నియోజకవర్గంలో 12 మంది

మిగతా 2లో..



### శిక్షాకాలం పూర్తైనా జైళ్లో ఉంచుతారా?

అటువంటి వారిని వెంటనే విడుదల చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం

సుఖ్‌దేవ్ పహిల్వాన్ కేసు విచారణలో కీలక వ్యాఖ్యలు

2లో..

### న్యాయవాద దంపతుల హత్య కేసు సీబీఐకి..

సుప్రీంకోర్టు కీలక తీర్పు

12లో..

ఓట్ల చోరీ ఎన్నికల కుంభకోణం మాత్రమే కాదు..

## ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ద్రోహం



- బీజేపీ,ఈసీ కుమ్మక్కయ్యాయి
- కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల్లోలాగే రేపు బీహార్‌లోనూ ఓట్ల చోరీకి కుట్ర
- ఇదంతా జాతీయ స్థాయిలో ఓ క్రమపద్ధతిలో జరుగుతోంది
- ఎలక్షన్ కమిషన్‌పై రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**గతేడాది ఏడాది జరిగిన కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల్లో భాజపా ఓటర్లను మోసం చేయడానికి ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కైందని..ఇప్పుడు బిహార్ ఎన్నికల్లో కూడా అదే వ్యూహాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. "ఒకటి, రెండు కాదు... చాలా సీట్లలో అవకతవకలు జరిగాయి. ఇదంతా జాతీయ స్థాయిలో... ఓ క్రమపద్ధతిలో జరుగుతోంది. ఎన్నికల కమిషన్‌కు కూడా ఈ విషయం

మిగతా 2లో..

# వరంగల్‌ను ముంచెత్తిన వర్షాలు



### తెలంగాణకు రెడ్‌అలర్ట్

- ఉరుములు,మెరుపులతో వానలు పడతాయ్
- ప్రజలు అసవరమైతే తప్ప బయటకు రావద్దు
- ప్రయాణాలు వాయిదా వేసుకోవాలన్న వాతావరణ శాఖ
- భారీగా నీటి చేరికతో సాగర్ 16 క్రస్ట్ గేట్లుఎత్తి నీటి విడుదల
- నీట మునిగిన వరంగల్ జంటనగరాలు
- మత్తడి పోస్తున్న పలు గ్రామాల చెరువులు
- ఉధృతంగా ఆకేరు వాగు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్, అరెంజ్ అలర్టులు జారీ చేసింది. అయితే మరోసారి వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఈ మేరకు ప్రజలందరూ.. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే ఛాన్స్ ఉందని ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని పేర్కొంది. వర్షం పడే సమయంలో చెట్ల కింద కూడా ఉండకూడదని హెచ్చరిస్తుంది. ప్రయాణాలు మానుకోవాలని, లేని పక్షంలో వాయిదా వేసుకోవాలని తెలుపుతుంది. భారీ వర్షాల కారణంగా రోడ్లు, బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్లు జలమయం అవుతున్నాయి. కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందస్తూ.. చర్యలు చేపడుతుంది. ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ.. అధికారులను ప్రజలతో సమన్వయం అయ్యేలా.. చూస్తుంది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. జిల్లా ప్రజలు

మిగతా 2లో..



## నా ప్రతిష్టకు భంగం కలిగించారు

బండికి కేటీఆర్ లీగల్ నోటీసులు

**హైదరాబాద్(జనంసాక్షి):** కేంద్ర మంత్రి బండికి కేటీఆర్ లీగల్‌నోటీ సులు పంపించారు. ఫోన్ ట్యా పింగ్‌కు సంబంధించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అ వాస్తవమని, నిరాధారమైన వని, అవి తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో చేసినవని నోటీసులో పేర్కొన్నారు. 8వ బండి సంజయ్ నిర్వహించిన పత్రికా సమావేశంలో చేసిన ఆరోపణలపై కేటీఆర్ ఈ నో టీసులను పంపించారు. బండి సంజయ్

మిగతా 2లో..

# ఆధునిక పరిజ్ఞానాన్ని అమలులోకి తేవాలి

నీటిపారుదల శాఖలో పూర్తి స్థాయిలో సంస్కరణలు చేపట్టాలి

- శాఖా సెంట్రల్ డిజైన్ విభాగం పటిష్ఠతకు చర్యలు చేపట్టాలి
- త్వరితగతిన ఖాళీల భర్తీ చేయాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**నీటిపారుదల శాఖా సెంట్రల్ డిజైన్ విభాగం పటిష్ఠతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికా రులను ఆదేశించారు.మెడిగడ్డ ఉదంతంలో జాతీయ భద్రత సంస్థ తో పాటు జస్టిస్ ఘోష్ కమిషన్ చేసిన వ్యాఖ్యలతో సి.డి.ఓ ప్రతిష్ట దెబ్బతిన్నదని ఆయన వ్యాఖ్యానిం చారు.అటువంటి వ్యాఖ్యాలపై సి.డి.ఓ పునఃసమీక్షించుకుని సంస్కరణలు చేప ట్టడం అత్యవసరమని ఆయన పేర్కొన్నా రు.అందుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.మంగళవారం మధ్యాహ్నం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్

మిగతా 2లో..




### కాలుష్యకారక పరిశ్రమల తరలింపును వేగవంతం చేయండి

ఆదాయ వనరుల సమీకరణ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**కాలుష్య కారక పరిశ్రమలను హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం

మిగతా 2లో..



అమెరికాలో రోడ్డు ప్రమాదం..

## హైదరాబాద్ విద్యార్థిని మృతి

**హైదరాబాద్(జనంసాక్షి):** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా రామారుకల గ్రామానికి చెందిన శ్రీనివాస్ వర్మ, హేమలత దంపతులకు శ్రీజా వర్మ, శ్రేయా వర్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.శ్రీనివాస్ వర్మ దంపతులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ

మిగతా 2లో..



## ఏపీ,ఒడిషా, పంజాబ్‌లో సెమీకండక్టర్ ప్రాజెక్టులు

- రూ.4,594 కోట్ల వ్యయంతో ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఎపిలో సెమీ కండక్టర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చింది.దేశంలో నాలుగు కొత్త సెమీ కండక్టర్ ప్రాజెక్టులు ఏర్పాటు- చేయాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఏపీ సహా ఒడిశా, పంజాబ్‌లో సెమీ కండక్టర్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది. మొత్తంగా రూ.4,594 కోట్ల వ్యయంతో వీటిని ఏర్పాటు-చేయనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. అలాగే, పట్టణ రవాణాను మరింత బలోపేతం చేసేలా లక్నో మెట్రో ఫేజ్ 1బి నిర్మాణానికి ఆమోదం తెలిపింది. దీన్ని రూ.5,801 కోట్లతో చేపట్టనున్నట్లు పేర్కొంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో 700 మెగా వాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివరాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దేశంలో సెమీ కండక్టర్ ఎకో సిస్టమ్ గణనీయంగా

మిగతా 2లో..

## భారత్‌పై యుద్ధం మినహా మరోదారి లేదు





పాక్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో ప్రేలాపన

**లాహోర్,ఆగస్ట్12(జనంసాక్షి):**నరేంద్ర మోదీ సారథ్యంలోని భారత ప్రభుత్వ చర్యలు పాక్‌కు చాలా నష్టం కలిగించాయి. ఈ చర్యలకు మనమంతా ఐకమత్యంగా ఎదురొడ్డి నిలవాలని పాకిస్థాన్‌కు చెందిన మాజీమంత్రి బిలావల్ భుట్టో అన్నారు. అధికారంలో లేకపోవడంతో ఖాళీగా ఉన్న ఆయన తన పార్టీని అధికారంలోకి తీసుకునిరావాలంటే భారత్ వ్యతిరేక వైఖరితో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లుగా ఉంది.

మిగతా 2లో..

## సృష్టి ఫర్టిలిటీ కేసు సిట్‌కు అప్పగింత

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



**హైదరాబాద్(జనంసాక్షి):**సృష్టి ఫెర్టిలిటీ స్కాం కేసును ప్రభుత్వం సిట్‌కు అప్పగించింది. ఇందులో అనేక దందాలు తోడవ్వడంతో దీనిపై లోతైన విచారణ కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును సిట్‌కు అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంగళవారంఈ కేసుకు సంబంధించిన విషయాలను హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్

మిగతా 2లో..

## ఇద్దరు అన్నదమ్ములం సమర్థులమే

ఖమ్మంకు లేని నిబంధన నల్లగొండకే ఎందుకు?

మరోసారి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు



**నల్గొండ(జనంసాక్షి):** మంత్రి పదవి విషయంలో తనకుకావాలనే అన్యాయం చేయడంపై మరోమారు కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పార్టీనేతల తీరుపై విమ ర్శలు గుప్పించారు. కేబినెట్‌లో ఇద్దరు అన్నదమ్ములకు పదవులు ఇవ్వడం సాధ్యం కాదని చెబుతున్నవారు, పార్టీలో ఇద్దరు ఉన్నారని ముందు తెలియదా అని కూడా ప్రశ్నించారు. మంత్రి పదవి

మిగతా 2లో..




## ఆగని ఆందోళనలు

- బీహార్ ఓటరు జాబితా సవరణపై విపక్ష ఎంపీల నిరసన
- ఉభయ సభలు వాయిదా..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను (ఎస్ఐఆర్) వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్, ఆర్జేడీ వంటి విపక్ష పార్టీలు సోమవారం దిల్లీలో నిరసన ర్యాలీ చేపట్టిన విషయం తెలిసిందే.మంగళవారం కూడా విపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. ఆందోళనల్లో భాగంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీతో సహా పలువురు ప్రతిపక్ష నేతలు 'మింతా దేవి' అనే బిహార్ ఓటరు ఫొటోతో ఉన్న టీ షర్టులు ధరించి పార్లమెంటు వెలుపల నిరసన లో పాల్గొన్నారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ఇతర ప్రతిపక్ష ఎంపీలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఇటీవల కాంగ్రెస్

మిగతా 2లో..

## వరంగల్‌ను ముంచెత్తిన వర్షాలు

వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని తెలుపుతున్నారు. పొలాల దగ్గరకు వెళ్లాల్సిన రైతుల కూడా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజల దృష్ట్యా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు- చేసినట్లు- తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రజలు కంట్రోల్ రూమ్ నెంబర్ 7981975495 కు ఫోన్ చేయాలని అధికారులు వెల్లడించారు. ఇకపోతే ఎగువన కురుస్తున్న వర్షాలతో నాగార్జున సాగర్ జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. దీంతో అధికారులు 16 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టుకు 1,77,173 క్యూసెక్కుల వరద వస్తోంది. స్పిల్‌వే ద్వారా 1,28,768 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రస్తుత నీటి మట్టం 589 అడుగులుగా ఉంది. ఇకపోతే వరంగల్, హనుమకొండ, కాజీపేటలో భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో హనుమకొండ బస్టాండ్, చౌరస్తా, ఇతర లోతట్టు- ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. రహదారులు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై భారీగా నీరు నిలవడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి.

## భారత్‌పై యుద్ధం మినహా మరోదారి లేదు

గతంలో మోడీపైనా విపరీత వ్యాఖ్యలు చేసిన భిలావల్ తాజాగా సింధు జలాల ఒప్పందం నిలుపుదల ఇలాగే కొనసాగితే భారత్‌పై యుద్ధం మినహా పాక్‌కు మరో ప్రత్యామ్నాయం ఉండకపోవచ్చని వార్నింగ్ ఇచ్చారు. పాక్ ప్రజలు యుద్ధానికి సమర్థులంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. 'మేము యుద్ధం ప్రారంభించ లేదు. కానీ, ఆపరేషన్ సిందూర్ లాంటి దాడులు మళ్లీ చేస్తే పాక్‌లోని అన్ని ప్రావిన్స్‌ల (రాష్ట్రాలు) ప్రజలు మీతో (భారత్) పోరాడేందుకు సిద్ధమే. ఈ యుద్ధంలో భారత్‌కు ఓటమి తప్పదు' అని అన్నారు. పహల్గాం ఉగ్ర దాడి తరువాత భారత్ పాక్‌పై ఆపరేషన్ సిందూర్‌ను ప్రయోగించిన విషయం తెలిసిందే. పాక్‌కు గట్టి బుద్ధి చెప్పేందుకు సింధు నదీ జలాల ఒప్పందం అమలును కూడా నిలిపివేసింది. దీంతో, పాక్‌లో నదీ జలాల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో తప్పును సరిదిద్దుకోవాల్సిన పాక్ నేతలు తమ దేశ ప్రజల్లో భారత్‌పై అకారణ ద్వేషం రగిలించి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే పాక్ ఆర్మీ చీఫ్ మునీర్.. అణుబాంబు ప్రయోగిస్తామంటూ ఉన్మాదంతో ఊగిపోయారు. పాక్ ఉనికికి ముప్పు వస్తే తమతో పాటు- సగం ప్రపంచం అంతమైపోతుందని హెచ్చరించారు. సింధు జలాలను అడ్డుకునేందుకు భారత్ చేపట్టే నిర్మాణాలను కూడా కూల్చేస్తామని అన్నారు. నిర్మాణాలు పూర్తయ్యే వరకూ వేచి చూసి ఆపై ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. సింధు జలాలు భారతీయ కుటుంబ ఆస్తి కాదని కామెంట్ చేశారు. ఈ నదీ జలాల ఒప్పందం నిలుపుదలతో 250 మిలియన్‌ల మంది పాకిస్థానీలకు ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. మునీర్ వ్యాఖ్యలకు భారత్ గట్టిగా బదులిచ్చింది. ఈ బాధ్యతారహిత వ్యాఖ్యలను ప్రపంచం అర్థం చేసుకుందని కామెంట్ చేసింది. పాక్‌లో అణ్వాయుధాలకు భద్రత లేదని, అక్కడి మిలిటరీ టెర్రరిస్టులతో కుమ్మక్కయ్యిందని ఈ వ్యాఖ్యలు మరోసారి స్పష్టం చేశాయని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. తాజాగా బిలావల్ భుట్టో వ్యాఖ్యలుకూడా ప్రజలను రెచ్చగొట్టేందుకే అని అర్థం చేసుకోవచ్చు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్ విద్యార్థిని మృతి

చౌరస్తా సమీపంలోని శ్రీకృష్ణానగర్‌లో నివాసముంటున్నారు. శ్రీనివాస్ వర్మ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఆయన భార్య ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. వీరి పెద్ద కుమార్తె శ్రీజా వర్మ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది. ఈ మధ్యే ఎంఎస్ పూర్తి చేసింది. సోమవారం రాత్రి (భారత కాలమానం ప్రకారం) అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వచ్చి భోజనం చేసేందుకు కారులో రెస్టరంట్‌కు వెళ్లింది. భోజనం చేసి తిరిగి వస్తుండగా ఆమె వాహనాన్ని ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీజా వర్మ తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో శ్రీజా వర్మతో పాటు ఆమె స్నేహితురాలు కూడా ఉన్నట్లు సమాచారం. శ్రీనివాస్ వర్మ చిన్న కుమార్తె శ్రేయా వర్మ సైతం ఎంఎస్ చేసేందుకు 20 రోజుల క్రితం అమెరికా వెళ్లింది.

## సృష్టి ఫర్టిలిటీ కేసు సిట్‌కు అప్పగింత

మీడియాకు వెల్లడించారు. సృష్టి కేసును సీసీఎస్ సిట్‌కి బదిలీ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో 25 మంది నిందితులను అరెస్ట్ చేశామని వెల్లడించారు. సృష్టి కేసులో 8 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని వివరించారు. ఓ కేసులో సృష్టి యాజమాన్యం బాధితులకు చనిపోయిన బిడ్డను చూపించారని చెప్పుకొచ్చారు. మరో కేసులో రూ.15 లక్షలు ఎక్కువగా ఇవ్వాలని సృష్టి యాజమాన్యం డిమాండ్ చేసిందని తెలిపారు డీసీపీ రష్మీ పెరుమాళ్. విశాఖపట్నంలో కూడా సరోగసీ పేరుతో మోసం చేశారని డీసీపీ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. బాధితులకు ఇచ్చిన బేబీ గర్ల్‌కి డీఎన్ఏ టెస్ట్ చేసి సరి పోల్చినప్పుడు ఈ వ్యవహారం బయట పడిందని వెల్లడించారు. ఈ కేసులో చాలామంది డాక్టర్ల ప్రమేయం ఉందని తెలిపారు. విశాఖపట్నంలోని డాక్టర్లు విద్యులత, రవిను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. వైజాగ్‌కి చెందిన డాక్టర్ విద్యులతతో పాటు- డాక్టర్ రవి, డాక్టర్ ఉషను అరెస్ట్ చేశామని వివరించారు. సికింద్రాబాద్‌లో ఉన్న హాస్పిటల్‌ను కేవలం కన్సల్టెన్సీగా మాత్రమే వాడుకున్నారని గుర్తుచేశారు. ఇక్కడ ఒ÷ఎఎ పేరుతో శాంపిల్స్ తీసుకుంటున్నారని చెప్పారు. మిగతా సరోగసీ ప్రాసెస్ అంతా వైజాగ్‌లో చేస్తున్నారని తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 25 మందిని అరెస్ట్ చేశామని వెల్లడించారు డీసీపీ రష్మీ పెరుమాళ్. వీరిలో చాలామంది మహిళలు ఉన్నారని... మహిళా నిందితుల్లో చాలామంది అండాలు అమ్ముకున్న వారు ఉన్నారని, సరోగసీ తల్లులుగా నటించిన వాళ్లు ఉన్నారని తెలిపారు. ఎవరైనా దంపతులు సరోగసీ కోసం అప్రోచ్ అవగానే.. వాళ్లకు కొన్నిరోజుల తర్వాత ఒక ఫేక్ అల్ట్రా స్కాన్ రిపోర్ట్ పంపుతారని చెప్పుకొచ్చారు. సరోగసీ పద్ధతిలో మీకు పుట్టబోయే పాప స్కానింగ్ రిపోర్ట్ అని చెబుతారని అన్నారు. అదే సమయంలో డాక్టర్ నమ్రత ఏజెంట్లు- ఓ గర్భిణిని వెతికి పెడతారని తెలిపారు. 9 నెలల తర్వాత వైజాగ్‌లో డెలివరీ చేసి.. ఆ శిశువును సరోగసీ ద్వారా పుట్టిన పాప అని చెప్పి దంపతులకు అప్పగిస్తారని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు.

## ఏపీ,ఒడిషా, పంజాబ్‌లో సెమీకండక్టర్ ప్రాజెక్టులు

ఊపందుకుంటున్న వేళ తాజా నిర్ణయం మరింత ప్రయోజనకరంగా మారనుంది. ఇప్పటికే దేశంలో ఆరు సెమి కండక్టర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉండగా.. తాజాగా కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన నాలుగు కొత్త ప్రాజెక్టులతో ఈ సంఖ్య మొత్తంగా 10కి చేరింది. 2034 నాటికి నైపుణ్యం కలిగిన వారికి మరింతగా ఉపాధి అవకాశాలు సృష్టించడంలో ఇవి కీలకంగా పనిచేయనున్నాయి. ఎలక్ట్రానిక్ తయారీ ఎకోసిస్టమ్‌కు ఉత్ప్రేరకంగా పనిచేయడం ద్వారా ఇవి పరోక్షంగా అనేక ఉద్యోగాల కల్పనకు ఉపయోగపడనున్నాయి

## ఆగని ఆందోళనలు

అగ్రనేత రాహుల్ గాంధీ ఓట్ల చోరీ అంశంలో ఇచ్చిన ప్రజెంటేషన్‌లో బిహార్‌కు చెందిన మింతా దేవి గురించి ప్రస్తావించారు. మింతా దేవి పేరుతో ఉన్న ఓటరు ఐడీలో ఆమె వయస్సు 124 అని ముద్రించినట్లు రాహుల్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత వృద్ధ వ్యక్తి వయసు కంటే ఇది ఎక్కువని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా రూపకల్పనలో అక్రమాలు చోటుచేసుకున్నాయని చెప్పడానికి ఇదే నిదర్శనమని నినాదాలు చేస్తూ.. పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష నేతలు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఓట్ల చోరీపై పార్లమెంటులో విపక్షాలు ఆందోళన చేయడంతో లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడగా.. మధ్యాహ్నం 2 గంటల వరకు రాజ్యసభను వాయిదా వేశారు. దీంతో లోక్‌సభలోని విపక్ష ఎంపీలు పార్లమెంటు వెలుపల ఆందోళన నిర్వహించారు.

# హైదరాబాద్‌లో అతిభారీ వర్షసూచన



మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అతి భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలు ఉన్న జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు సీఎం సూచించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని... అంతా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. రెండు రోజుల్లో ఎంత వర్షపాతం వస్తుంది..ఎలా ఎదుర్కోవాలనే దానిపై మనకు మాన్యువల్స్ ఉన్నాయని... కానీ వాతావరణ మార్పులతో రెండు గంటల్లోనే రెండు నెలల వర్షపాతం కురుస్తోందని... క్లౌడ్ బస్టర్స్‌తో ఊహించనంత నష్టం వాటిల్లుతోందని సీఎం తెలిపారు. క్లౌడ్ బస్టర్ పరిస్థితులను ఎదుర్కొనే వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఊహించనంత వర్షపాతంతో గతంలో ఖమ్మం, వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రాణ నష్టంతో పాటు భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని.. అటువంటి ఘటనలు ఎట్టి పరిస్థితుల్లోనూ పునరావృతం కావడానికి వీల్లేదని సీఎం అన్నారు. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లోపై పూర్తి అవగాహనతో ఉండాలని నీటి పారుదల శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. జల విద్యుత్ తయారీపైనా దృష్టి సారించాలని, అదే సమయంలో నీటి విడుదలపై పూర్తి సమాచారం లోతట్టు ప్రాంతాల ప్రజలకు తెలియజేయాలన్నారు. చెరువులు, కుంటలు కట్టల తెగే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికా రులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు , విద్యుత్ స్తంభాలు, ఇతర సామగ్రి సిద్దంగా ఉంచాలన్నారు. సమస్య ఎక్కడ తలెత్తినా తక్షణమే పరిష్కరించాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని... పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో అవసరమైన మందులు ఉంచాలని, గర్భిణులను తక్షణమే తరలించేలా అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచా లని సీఎం సూచించారు. అన్ని పట్టణాల్లో లోతట్టు ప్రదేశాల నుంచి ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని... వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు..పిడుగుపాట్లతో పశువులు, మేకలు, గొర్రెలు చనిపోయినప్పుడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించి బాధితులకు పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**హైదరాబాద్ నగరంలో....**

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్‌లు సమన్వయంతో పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్, ఎంఏయూడీ.. ప్రతి విభాగం సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం సూచించారు. ఐటీ, విద్యా శాఖ ఉన్నతాధికారులు పరిస్థితిపై సమీక్షించి వర్క్ ఫ్రం హోం.. సెలవుల విషయమై నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. హైడ్రా, విపత్తు నిర్వహణ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, జీహెచ్ఎంసీ సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం సూచించారు.. హైడ్రా టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయాలని..ప్రజల నుంచి వచ్చే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం ఆదేశించారు. లా అండ్ ఆర్డర్ పోలీసులు సైతం ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగస్వాములు కావాలని సీఎం సూచించారు. వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు అందజేయాలని.. అదే సమయంలో భయానక వాతావరణం సృష్టించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల చోరీ ఎన్నికల కుంభకోణం మాత్రమే కాదు.. ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ద్రోహం

తెలుసు. దానిని నిరూపించడానికి మా దగ్గర ఇన్ని రోజులు ఎటువంటి ఆధారాలు లేవు. ఇప్పుడు ఆధారాలు మా చేతికి వచ్చాయి. ఇంకా చాలా విషయాలు బయటకు రాబోతున్నాయి. " అంటూ ఈసీని హెచ్చరించారు. ఓట్ల దొంగతనం ఎన్నికల కుంభకోణం మాత్రమే కాదని..ప్రజాస్వామ్యానికి జరిగిన పెద్ద ద్రోహమని రాహుల్ అన్నారు. సమయం వచ్చినప్పుడు ఓట్ల చోరీకి పాల్పడిన వారికి కచ్చితంగా శిక్ష పడుతుందన్నారు. పార్లమెంట్ వెలుపల విపక్ష ఎంపీలు నిరసన చేపట్టిన అనంతరం కాంగ్రెస్ నేత మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. స్కాన్ చేసిన ఓటరు జాబితా చిత్రాలను పోస్టు చేయడానికి బదులుగా డిజిటల్ ఓటరు జాబితాలను విడుదల చేయాలని ఈసీని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఈ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కర్ణాటకలో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఓ నియోజక వర్గంలో సర్వే నిర్వహించగా.. దాదాపు లక్ష నకిలీ ఓట్లు తేలినా ఈ విషయంపై ఎన్నికల సంఘం మౌనం వహిస్తోందని రాహుల్ మండిపడ్డారు. స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షపాత ఎన్నికలను నిర్వహించి.. ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ఇలా చేస్తే ఇంకెవరికి ఫిర్యాదు చేయాలని ప్రశ్నించారు. 'ఓట్ల చోరీ' దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ ఎన్నికల సందర్భంగా అనేక నియోజకవర్గాల్లో కొనసాగిందని రాహుల్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని కోరారు.

## కాలుష్యకారక పరిశ్రమల తరలింపును వేగవంతం చేయండి

భట్టి విక్రమార్క మల్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణ సమావేశం క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం సమావేశం నిర్వహించారు. కమర్షియల్ టాక్స్, మైనింగ్ శాఖల్లో ఆదాయ ఆర్జనలో మెరుగైన పనితీరు ప్రదర్శించిన అధికారులను క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు అభినందించారు. సమావేశంలో రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డు శాఖలో ప్రభుత్వ ప్రతిపాదనలు ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్ అండ్ బి స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్, కమర్షియల్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్, రెవెన్యూ మరియు సీసీఎల్ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరి కిరణ్, హౌసింగ్ ఎండీ గౌతం పాల్గొన్నారు.

## ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలి

అటవీ శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. మన దగ్గర అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులున్నా తెలంగాణ వాసులు ఇతర రాష్ట్రాల్లోని బందీపూర్, తడోబా వంటి ప్రాంతాలకు పులుల సందర్శనకు వెళుతున్నారని సీఎం అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెంచేలా సౌకర్యాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి సంయుక్త సర్వే చేపట్టాలని సీఎం సూచించారు. కలెక్టర్లు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వరంగల్ కాకతీయ జూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరమైన వరంగల్‌లో జూను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు. అటవీ జంతువుల దాడిలో మృతిచెందిన లేదా గాయపడిన వారికి, పశువులు, పెంపుడు జంతువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందుకు సీఎం ఆర్ఎఫ్ నుంచి అవసరమైన మేరకు నిధులు వినియోగించుకోవాలని సీఎం సూచించారు. అటవీ శాఖ పరిధిలో చేపడుతున్న రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతుల విషయంలో అటవీ శాఖ, ఆయా పనులు చేపడుతున్న శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సీఎం సూచించారు. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులను సాధ్యమైనంత త్వరగా సాధించాలన్నారు. అడవుల్లో వన్య ప్రాణుల సంరక్షణ, వాటి కదలికలను గమనించేందుకు ఏర్పాటు చేసిన కెమెరాలన్నింటిని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలని సీఎం ఆదేశించారు. అటవీ శాఖలో అధికారుల కొరతపైనా సీఎం ఆరా తీశారు. రాష్ట్రానికి తగిన సంఖ్యలో ఐఎఫ్ఎస్ అధికారుల కేటాయింపుపై కేంద్రంతో సంప్రదించాలని సీఎస్‌కు సూచించారు. అటవీ శాఖలో ప్రమోషన్లు... ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖలో ఉత్తమ పని తీరు కనబర్చుతున్న వారికి అవార్డులను ఇచ్చే ప్రక్రియను పునరుద్ధరించాలని సీఎం సూచించారు. సమీక్షలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఎలుసింగ్ మేరు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నా ప్రతిష్టకు భంగం కలిగించారు

సంజయ్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, దురుద్దేశ పూరితమైనవని కేటీఆర్ తరపు న్యాయవాదులు నోటీసులో తెలిపారు. బండి సంజయ్ తన హోదాను దుర్వినియోగం చేస్తూ, ప్రజల్లో తన ప్రతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కేవలం రాజకీయంగా వార్తల్లో నిలిచేందుకు అడ్డగోలుగా ప్రాపగండ చేస్తున్న బండి సంజయ్ పదేపదే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. బండి సంజయ్ ఆరోపణలతో తన ప్రతిష్టకు భంగం కలిగిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు-తో పాటు- ఆ తర్వాత మంత్రిగా తాను అనేక రంగాల్లో అద్భుతమైన సేవలు అందించానని చెప్పుకొచ్చారు. అయితే బండి సంజయ్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలతో తన క్లయింట్ కేటీఆర్ పరువుకి భంగం కలుగుతుందని నోటీసులో న్యాయవాదులు పేర్కొన్నారు.

## శిక్షాకాలం పూర్తైనా జైల్లో ఉంచుతారా?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నిర్ణీత శిక్ష పూర్తి చేసుకొని మరే ఇతర కేసులో దోషిగా లేదా నిందితులుగాలేని ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీం ఆదేశించింది. శిక్షాకాలం పూర్తి చేసుకున్న ఖైదీలు ఇంకా జైల్లోనే ఉండటంపై ఆందోళన సుప్రీం కోర్టు వ్యక్తం చేసింది.. వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. 2002లో దిల్లీలో నితీశ్ కటారా అనే వ్యాపారవేత్త హత్య కేసులో దోషిగా తేలిన సుఖ్‌దేవ్ పహిల్వాన్ శిక్షాకాలం పూర్తయినందున అతడిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇదే వైఖరి కొనసాగితే దోషి జైల్లోనే మరణిస్తాడని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా పహిల్వాన్‌ను ఇంకా జైల్లోనే ఉంచడంపై ప్రశ్నించిన ధర్మాసనం.. ఆయనతో సహా నిర్ణీత జైలు శిక్ష పూర్తయిన దోషులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గడువుకు మించి ఇంకా ఎవరైనా దోషులు లేదా నిందితులు జైల్లోనే ఉన్నారా? అనే విషయాన్ని తెలుసుకోవాలని, తాజా తీర్పు కాపీలను అన్ని రాష్ట్రాల హోంశాఖ కార్యదర్శులకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. దిల్లీలో 2002లో చోటుచేసుకున్న ఓ పరువుహత్య అప్పట్లో సంచలనం రేపింది. నితీశ్ కటారాను పెళ్లి మండపం నుంచే కిడ్నాప్ చేసిన సుఖ్‌దేవ్ పహిల్వాన్ బృందం అతడిని హత్య చేశారు. ఈ కేసులో సుఖ్‌దేవ్‌కు జీవితఖైదు పడింది. 2015లో ఈ కేసును విచారించిన దిల్లీ హైకోర్టు.. శిక్ష తగ్గింపు లేకుండా 20 ఏళ్లపాటు- జైల్లోనే ఉండాలని ఆదేశించింది. ఈ ఏడాది మార్చితో శిక్షాకాలం పూర్తికావడంతో తనను విడుదల చేయాలంటూ సుఖ్‌దేవ్ సుప్రీంను ఆశ్రయించాడు. విచారించిన సుప్రీం ధర్మాసనం సుఖ్‌దేవ్ పహిల్వాన్ అలియాస్ సుఖ్‌దేవ్ యాదవ్‌ను విడుదల చేయాలని జులై 29నే అదేశించింది. అయితే, అతడి ప్రవర్తనను విశ్లేషించిన శిక్షా సమీక్ష బోర్డు విడుదల చేసేందుకు నిరాకరిం చింది. తాజాగా దీనిపై సర్వోన్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది.

# ఆధునిక పరిజ్ఞానాన్ని అమలులోకి తేవాలి

సచివాలయంలో నీటిపారుదల శాఖాధికారులతో ఆయన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు .నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఇ.ఎన్.సో అంజద్ హుస్సేన్,రమేష్ బాబు లతో పాటు నీటిపారుదల శాఖా జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్ సి.డి.ఓ సి.ఇ యం.సత్యనారాయణ రెడ్డి,సి.ఇ లు అజయ్ కుమార్,మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సి.డి.ఓ ను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ముక్యంగా ప్రాజెక్టుల డిజైన్ ల రూపకల్పనలో ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకరావాలన్నారు. అందుకు అవసరమైన లేటెస్ట్ సాఫ్ట్ వేర్ ను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో ముందుండాలన్నారుఒకప్పుడు సి.డి.ఓ ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు యావత్ భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.వందేళ్ల క్రితం నిర్మించిన నిజాం సాగర్ ప్రాజెక్టు నుండి మొదలు పెడితే ఉభయ తెలుగు రాష్ట్రాలలో నిర్మించిన ప్రధాన ప్రాజెక్ట్ నిర్మాణాలలో వినియోగించిన సాంకేతికత తెలంగాణా సి.డి.ఓ ప్రతిభకు పట్టం కడుతుందన్నారు. అటువంటి ప్రతిభ చాటుకునేందుకు సి.డి.ఓ సంస్థ కృషి చేయాలని ఆయన ఉద్బోధించారు. అటువంటి సంస్థ విశ్వసనీయత గలిగిన సంస్థకు ఎట్టి పరిస్థితిలలోనూ నష్టం వాటిల్లబోనియమని లోపాలు సరిదిద్ది అదే ప్రతిష్టను ఇనుమడింప చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.అదే సమయంలో సి.డి.ఓ లో ఖాళీగా ఉన్న ఉద్యగాల భర్తీకి తక్షణం చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు.అన్నీ స్థాయిలలో ఉద్యగాల భర్తీ చేపట్టడం సంస్థను బలోపేతం చేయడంలో బాగామే నన్నారు. ఐ.ఐ. టి లు,ఎన్.ఐ టి ల వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల నుండి నీటిపారుదల శాఖలో నియమితులైన ఇంజినీర్లను సి.డి.ఓ లో పోస్టింగ్ ఇవ్వబోతున్నట్లు ఆయన వెల్లడించారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్నవి కావడంతో ప్రతిభావంతులైన ఇంజినీర్ల సేవలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్దిష్టమైన ఇంజినీరింగ్, సృజనాత్మక అవసరమని అది అత్యుత్తమ శిక్షణ పొందిన నిపుణుల ద్వారానే సాధ్య పడుతుందన్నారు.అటువంటి నిష్ణాతులైన ఇంజినీర్లను వినియోగిస్తూ అత్యాధునిక పరిజ్ఞానం వినియోగించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసుకోవాలన్నారు.పదవీ విరమణ పొందిన అనుభవం కలిగిన అనుభవజ్ఞులైన వారి సేవలు కుడా వినియోగించుకుని అద్భుతమైన ఫలితాలు రాబట్టలన్నారు.అంతే గాకుండా నీటిపారుదల శాఖా చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంలో ఎలక్ట్రోమెకానికల్ ఇంజినీరింగ్ ప్రాముఖ్యత మునుముందు మరింత పెరగబోతుందన్నారు. అటువంటి సమయంలో లోతైన పరిజ్ఞానం కలిగి ఉన్న నిపుణులను నియమించడం ద్వారా సి.డి.ఓ తిరిగి పూర్వవైభవం చాటుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఐ. ఐ. టి హైదరాబాద్, జే.ఎన్.టి.యూ,టి.ఎస్ జెన్ కో వంటి సంస్థలకు చెందిన వారిని నియమించే ముందు టైంబౌండ్ పద్ధతిలో డిజైన్ ల రూపకల్పన లో ఉత్తమ నైపుణ్యాలను ప్రదర్శించడంతో పాటు సమయపాలనకు పెద్ద పీట వేయాలన్నారు.

## అన్ని వివరాలతో సిద్ధంగా ఉండాలి

చనిపోయారని ఈసీ పేర్కొందని, కానీ వారు సజీవంగా ఉన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మరో సందర్భంలో.. బతికే ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు ప్రకటించారని ఆరోపించారు. అయితే.. ఇటువంటి ప్రక్రియలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ వాదించారు. చనిపోయిన వ్యక్తులను బతికి ఉన్నట్లు, సజీవంగా ఉన్నవారిని చనిపోయినట్లు- ప్రకటించడం వంటి తప్పిదాలను సరిదిద్దవచ్చని.. ఇది కేవలం ముసాయిదా జాబితా మాత్రమేనని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే.. వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి 'సుప్రీం' ధర్మాసనం సూచించింది. ఎస్ఐఆర్ పక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారు; గతంలో నమోదైన మరణాల సంఖ్య; ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య వంటి వివరాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది. బిహార్ ఎస్ఐఆర్‌లో సామూహికంగా ఓటర్లను తొలగిస్తే తక్షణమే జోక్యం చేసుకుంటామని జులై 29న సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్న విషయం తెలిసిందే. అంతకుముందు జులై 10న చేపట్టిన విచారణ సందర్భంగా.. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరించింది. అదేవిధంగా ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఓటర్ ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ఆధార్ సేవలను కీలకమైన గుర్తింపు డాక్యుమెంట్‌గానే పరిగణనలోకి తీసుకుంటున్నామని, భారతదేశ పౌరసత్వానికి అది కచ్చితమైన రుజువు కాదని, సరైన వెరిఫికేషన్ తప్పనిసరని ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న వైఖరిని సుప్రీంకోర్టు సమర్థించింది. బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణ కు ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఆధార్‌ను కంక్లూజివ్ ప్రూఫ్‌గా ఆమోదించలేమని ఎన్నికల కమిషన్ చెప్పడం సరైనదేనని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఓటర్ వెరిఫికేషన్ పక్రియను చేపట్టే అధికారం ఈసీఐకి ఉందా అనే ప్రాథమిక అంశాన్ని నిర్ణయించాల్సి ఉంటుందని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. అలాంటి అధికారం లేనట్టయితే ఈ అంశం ఇక్కడితో ముగుస్తుందని, ఆ అధికారం ఈసీఐకి ఉన్నట్లయితే ఓటర్ వెరిఫికేషన్ పక్రియపై ఎలాంటి అభ్యంతరాలు ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది కపిల్ సిబాల్ తన వాదన వినిపిస్తూ, 1950 తర్వాత పుట్టిన ప్రతివ్యక్తి భారతదేశ పౌరుడేనని, అయితే ప్రస్తుతం జరుగుతున్న ఎక్సర్‌సైజ్‌లో విధానపరమైన తీవ్ర తప్పిదాలున్నాయని అన్నారు. ఉదాహరణగా ఒక చిన్న అసెంబ్లీ నియోజకవర్గంలో నివసిస్తున్న 12 మందిని చనిపోయినట్టు- పేర్కొన్నారని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించ లేదని అన్నారు. పోల్ ప్యానల్ సరైన విధానాన్ని అనుసరించకపోవడం వల్ల పెద్ద సంఖ్యలో ఓటర్ల తొలగింపు జరిగిందని, ముఖ్యంగా అవసరమైన దరఖాస్తులు సమర్పించలేక పోయిన వారిపై ఈ ప్రభావం ఉంటుందని అన్నారు. 2003 ఓటర్ల జాబితాలో పేరున్న వారిని కూడా కొత్తగా ఫామ్‌లు సమర్పించమనడం, అలా చేయని పక్షంలో రెసిడెన్స్‌లో ఎలాంటి మార్పు లేనప్పటికీ వారిని తొలగించడం జరుగుతుందన్నారు. ఈసీఐ ప్రకటించిన గణాంకాల ప్రకారం 7.24 కోట్ల మంది అవసరమైన ఫామ్స్ దాఖలు చేశారని, అయినా 65 లక్షల మంది ఓటర్ల పేర్లు సరైన వెరిఫికేషన్ లేకుండా తొలగించారని అన్నారు. పేర్ల తొలగింపును బలపరచే ఎలాంటి సర్వే నిర్వహించ లేదని అఫిడవిట్‌లో ఎన్నికల కమిషన్ అంగీకరించిందని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇటువంటి పక్రియలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదించారు. చనిపోయిన వ్యక్తులను బతికి ఉన్నట్టు-, సజీవంగా ఉన్నవారిని చనిపోయినట్టు- ప్రకటించడం వంటి తప్పదాలని సరిదిద్ద వచ్చన్నారు. ఇది కేవలం

## ఇద్దరు అన్నదమ్ములం సమర్థులమే..

విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మునుగోడు మండలం ఎలగలగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్సీ నెలికంటి సత్యంతో కలిసి కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్ గోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తన నియోజకరవ్గం మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే తనకు అన్యాయం జరిగినట్లేనని రాజ్ గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తనకు అన్యాయం జరిగితే ఫర్వాలేదు కానీ మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దని.. గత ప్రభుత్వానికి చెప్పానని.. ఈ ప్రభుత్వానికి కూడా చెబుతున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ తనకు మంత్రి పదవి ఇస్తానని మాట ఇచ్చింది, మంత్రి పదవి ఇచ్చినప్పుడు ఇవ్వండి కానీ.. అప్పటివరకు మాత్రం మునుగోడు అభివృద్ధికి సహకరించి ఒక్క రూపాయి కూడా ఆపొద్దని కోరారు. తనకు మంత్రి పదవి ఇస్తామన్నమాట ఆలస్య మైందని.. సమీకరణాలు కుదరటం లేదని ఇప్పుడు ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు. తనకు మంత్రి పదవి ఇవ్వడం ఎందుకు కుదరటం లేదు.. ఆ సమీకరణలు రాకుండా ఎవరడ్డుకుంటున్నారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తనను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకునే సమయంలో మంత్రి పదవి ఇస్తాననే తీసుకున్నారని గుర్తుచేశారు. అప్పుడు తాము ఇద్దరం అన్నదమ్ములం కాంగ్రెస్‌లోనే ఉన్నామని తెలియదా అని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో మంత్రి పదవి ఇస్తానని రెండోసారి హామీ ఇచ్చారని.. అప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీలో తాము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని గుర్తులేదా అని కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రశ్నించారు.

# రాఖీ పౌర్ణమి స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఛార్జీల సవరణ

- దుష్ప్రచారాన్ని ఖండించిన టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం

హైదరాబాద్ (జనంసాక్షి) : రాఖీ పౌర్ణమి సందర్భంగా టికెట్ ఛార్జీలను టీజీఎస్ఆర్టీసీ పెంచిందని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదు. కొందరు పనిగట్టుకొని ఉద్దేశపూర్వకంగా సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగేలా చేస్తున్న ఈ అబద్ధపు ప్రచారాన్ని యాజమాన్యం ఖండించింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం రాఖీకి ఈ నెల 7వ తేది నుంచి 11వ తేది వరకు నడిచిన స్పెషల్ బస్సుల్లో మాత్రమే చార్జీలను సవరించామని, రెగ్యులర్ సర్వీస్‌ల టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు చేయలేదని స్పష్టం చేసింది.

రాఖీ పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ మేరకు 4,650 ప్రత్యేక బస్సులను సంస్థ నడిపించింది. ఈ నెల 7న 407, 8న 960, రాఖీ పండుగ(9న) నాడు 1,570, 10న 781, 11న 932 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈ స్పెషల్ బస్సులు మినహా మిగతా బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉన్నాయి. ప్రస్తుతం సంస్థలో 9500 పైగా బస్సులు సేవలందిస్తున్నాయి. అందులో కొన్నింటినే స్పెషల్ సర్వీసులుగా రద్దీ రూట్లలో నడపడం జరిగింది.

ప్రధాన పండుగులైన సంక్రాంతి, దసరా, రాఖీ పౌర్ణమి, వినాయక చవితి, ఉగాది, తదితర సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. ప్రయాణి కుల రద్దీ మేరకు హైదరాబాద్ సిటీ బస్సులను కూడా జిల్లాలకు తిప్పుతుంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవో ప్రకారం స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను 50 శాతం వరకు సవరించుకునే వెసులుబాటును సంస్థకు కల్పించింది.

స్పెషల్ బస్సులకు చార్జీల సవరణ అనవాయితీగా జరిగేదే. పండుగల సమయాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో చార్జీల సవరణ అనేది జీవో ప్రకారం 22 ఏళ్లుగా కొనసాగుతోంది. పండుగ రద్దీ రోజుల్లో స్పెషల్ బస్సులు మినహా.. సాధారణ రోజుల్లో యథావిధిగా సాధారణ టికెట్ ధరలే అమల్లో ఉంటాయి. ఇది సంస్థలో సంప్రదాయంగా కొనసాగుతున్న ప్రక్రియ. అదేం తెలియకుండా కొందరు పండుగ పేరుతో అన్ని సర్వీసుల్లో చార్జీలను పెంచినట్లు ఉద్దేశ పూర్వకంగా సంస్థపై అసత్య ప్రచారం చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు.

ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలను అందిస్తూ.. ప్రతి రోజు లక్షలాది మందిని టీజీఎస్ఆర్టీసీ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తోంది. సిబ్బంది నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వర్తించడం వల్లే లక్షలాది మంది నమ్మకాన్ని సంస్థ చూరగొంది. అలాంటి సంస్థపై కావాలని తప్పుడు ప్రచారం చేయడం ఏమాత్రం తగదు. టీజీఎస్ఆర్టీసీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా చేస్తోన్న ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా ఖండిస్తోంది. వాస్తవాలు తెలుసుకోకుండా.. అబద్ధపు ప్రచారాలను మానుకోవాలని హితవు పలుకుతోంది.

# సీఎం ప్రజావాణిలో 328 దరఖాస్తులు

- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్



హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 328 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 57, రెవెన్యూ శాఖకు సంబంధించి 51, ప్రవాసి ప్రజావాణికి 01, విద్యుత్ శాఖకు 36, ఇందిరమ్మ ఇండ్ల కోసం 111 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 72 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# దేవాలయ భూములు కాపాడుతాం

- పైలట్ ప్రాజెక్టుగా ఎండోమెంటు ల్యాండ్ డిజిటలైజేషన్ ప్రక్రియ షురూ
- కడ్తాల్ విలేజ్ లో డిజిటలైషన్ ను ప్రారంభించిన మంత్రి సురేఖ
- ఎండోమెంట్ ఆఫీసు(బొగ్గులకుంట)లో బోనాల వేడుక సందర్భంగా అండమాన్ ల్యాండ్ డిస్టలేషన్ ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో ఎండోమెంటు భూములను కాపాడుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. మంగళవారం ఎండోమెంట్ ఆఫీసు(బొగ్గులకుంట)లో బోనాల కార్యక్రమంలో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒక సంవత్సరంలో ఎండోమెంట్ లాండ్స్ డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు. దేవదాయ భూములను పరిరక్షించేందుకు ఈ చర్యలు చేపడుతున్నట్టు ఆమె పునర్ ఉద్ఘాటించారు.

# శంషాబాద్‌లో ఖరీదైన గంజాయి పట్టివేత

హైదరాబాద్, ఆగస్ట్ 12 (జనంసాక్షి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఖరీదైన గంజాయిని డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికురాలి వద్ద నుంచి రూ.13.3 కోట్లు విలువైన హైడ్రోఫోనిక్ గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మహిళను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. గత నెల 30న కూడా బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ మహిళ వద్ద రూ.40 కోట్లు విలువ చేసే హైడ్రోఫోనిక్ గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# ఎల్లమ్మ తల్లికి 'ఉప్పల' బోనాలు





హైదరాబాద్ (జనంసాక్షి) : ఎల్బీనగర్ నియోజకవర్గంలోని హయత్ నగర్ లోని సాయి శ్రీనివాస బాటిల్స్ కంపెనీలో రేణుక ఎల్లమ్మ తల్లికి కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త కుటుంబ సభ్యులతో కలిసి బోనం సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఆ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి కి అన్ని విధాలా కృషి చేస్తుంది అని ఆయన అన్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల కుటుంబ సభ్యులు ఉప్పల స్వప్న, సాయి కిరణ్ కోడలు శార్వారీ ఉప్పల సాయి తేజ బంధువులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బనకచర్లపై భారత రాష్ట్ర సమితి ఎంపీల వాయిదా తీర్మానం

- పార్లమెంట్‌లో అదే రభస

న్యూఢల్లీ(జనంసాక్షి):బనకచర్లపై భారత రాష్ట్ర సమితి ఎంపీలు మరోసారి రాజ్యసభలో వాయిదా తీర్మానం ఇచ్చారు. ఏపీలో నిర్మించే ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని అందులో పేర్కొన్నారు.దీనివల్ల తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వెల్లడిరచారు. రాజ్యసభలో భారత రాష్ట్ర సమితి సభ్యుడు సురేశ్‌రెడ్డి తీర్మానం నోటీసు ఇచ్చారు. ఇప్పటికే ఓసారి సభలో బనకచర్లపై వాయిదా తీర్మానం ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రతిపక్షాల ఆందోళలతో పార్లమెంట్ దద్దరిల్లింది. సోమవారం ఉదయం ఉభయ సభలు ప్రారంభం కాగానే బీహార్ ఓటర్ల జాబితా సవరణపై చర్చ నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అందుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో ఆందోళనకు దిగాయి. బీహార్ ఓటర్ల జాబితా సవరణపై చర్చ నిర్వహించాల్సిందేనని పట్టుబట్టాయి. బీజేపీతో ఈసీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి. స్పీకర్ సముదాయించే ప్రయత్నం చేసిన విపక్షాలు వెనక్కి తగ్గలేదు. సభలో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో పార్లమెంట్ ఉభయ సభలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. మరోవైపు.. ఓట్ల చోరీ జరుగుతుదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఈసీ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా బ్లాక్ ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో ఇండియా కూటమిలోని 25 ప్రతిపక్ష పార్టీల నుంచి 300 మందికి పైగా ఎంపీలు పాల్గొననున్నారు. అయితే, ఇండియా కూటమి నేతల ర్యాలీకి ఢల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఇండియా బ్లాక్ ఎంపీల ర్యాలీపై ఉత్కంఠ నెలకొంది.

ఇదిలావుంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని, బిహార్‌లో జరుగుతున్న ఎలక్టోరల్ రోల్స్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సరిగా లేదని ఆరోపిస్తూ ఇండియా కూటమి భారీ ఆందోళనకు సిద్ధమైంది. సోమవారం ఢల్లీలోని పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ఆఫీస్ వరకు 300 మందికి పైగా ఎంపీలు ర్యాలీ చేయబోతున్నారు. అయితే, ఈ ర్యాలీకి ఢల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ర్యాలీ నిర్వహణకు సంబంధించి తమకు ఎలాంటి అధికారిక వినతి అందలేదని సీనియర్ పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఇండియా కూటమి మాత్రం ర్యాలీ నిర్వహించి తీరాలని నిర్ణయించారు. ఇలాంటి సమయంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రతిపక్ష పార్టీ నేతలతో భేటీకి ఎన్నికల సంఘం అంగీకరించింది. కాంగ్రెస్ సీనియర్ నేత, పార్లమెంట్ సభ్యుడు జైరాం రమేష్ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. భేటీకి అవకాశం ఇవ్వాలని కోరారు. జైరాం రమేష్ లేఖపై ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు జైరాం రమేష్‌కు ఎన్నికల సంఘం సెక్రటరీ అశ్వినీ కుమార్ మోహల్ ఆదివారం రాత్రి లేఖ రాశారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ఎక్కువ మంది పట్టే అవకాశం లేనందున కేవలం 30 మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. సుకుమార్ సెన్ హాల్‌లో సమావేశం జరగనుంది. అయితే, ఎన్నికల సంఘం భేటీకి అంగీకరించిన నేపథ్యంలో ర్యాలీపై ఇండియా కూటమి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. కాగా, 2024 ఎన్నికల్లో కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో దాదాపు 1,00,250 ఓట్లు చోరీ అయ్యాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు.

# చెరువులో మునిగి కవలల మృతి

కామారెడ్డి, ఆగస్ట్12 (జనంసాక్షి) : స్నానం కోసం చెరువుకు వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు గల్లంతైన సంఘటన కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకొంది. ఎస్ఐ రంజిత్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తిమ్మకుపల్లికి చెందిన కవల సోదరులు రామ్, లక్ష్మణ్(13)లు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. సోమవారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చి సమీపంలోని చెరువుకు స్నానానికి వెళ్లారు. చెరువు లోతు ఎక్కువగా ఉండటంతో ఈత రాక ఇద్దరూ మునిగిపోయి గల్లంతయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా గజ ఈతగాళ్ల సహాయంతో వెతికించడంతో మంగళవారం ఉదయం ఇద్దరు అన్నదమ్ముల మృతదేహాలు బయటపడ్డాయి. కవల సోదరుల మృతితో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకొన్నాయి.

# ఆత్మకూరులో అత్యాధునిక స్పోర్ట్స్ మైదానం

స్థల పరిశీలన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి



మహబూబ్‌నగర్, ఆగస్ట్ 12 (జనంసాక్షి) : ఆత్మకూర్ మున్సిపాల్టీల లో నూతనంగా నిర్మించనున్న క్రీడా మైదానాలకు రాష్ట్ర స్పోర్ట్ అథారిటి చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి స్థల పరిశీలన చేశారు. ఆత్మకూర్ మున్సిపాల్టీ పరిదిలో జాతర మైదానం పక్కన అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఒక మినీ స్టేడియం, అదేవిధంగా జాతర మైదానంలో నడక వ్యాయామ దారులకు సౌకర్యాలు అధునీకరించడంతో పాటు పక్కనే ఒక ఇండోర్ స్టేడియం కొరకు ప్రణాళికలు సిద్ధం చేసి ఇవ్వాలని సూచించారు. ఈ క్రీడా మైదానాలకు దాదాపు 5 కోట్ల నిధులు కేటాయించడం జరుగుతుం దని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక చొరవ తీసుకొని 4 ఎకరాల స్థలాన్ని కేటాయించారని తెలిపారు.

## చందానగర్ ఖజానా జ్యువెలరీలో
# చోరీకి దుండగుల విఫలయత్నం

- రెండు రౌండ్ల కాల్పులు.. డిప్యూటీ మేనేజర్ సతీష్ కు గాయాలు
- ఏడుగురు నిందితులు ఉన్నట్లు పోలీసుల వెల్లడి
- సేఫ్టీ లాకర్ తెరవకపోవడంతో వెండి నగలతో నిందితుల పరారీ...






శేరిలింగంపల్లి, ఆగస్టు 12 (జనంసాక్షి) : మంగళవారం ఉదయం 10 గంటల 35 నిమిషాలు... ముంబై జాతీయ రహదారిపై చందానగర్ ప్రాంతంలో వాణిజ్య వ్యాపార విభాగం తలుపులు అప్పుడప్పుడే తెరుచుకుంటున్నాయి... అక్కడ అంతా ప్రశాంతం! ఈలోగా ఏడుగురు అపరిచిత వ్యక్తులు మాస్కులను, కర్చీఫ్ లను ముఖాలకు ధరించి ముంబై జాతీయ రహదారిపై చందానగర్ ప్రాంతంలో ఉన్న ఖజానా జ్యువెలరీ షాపులోకి ఎంటర్ అయ్యారు. ప్రధాన ద్వారం దాటి లోపలికి చొచ్చుకు వెళుతూనే తమ చేతిలోని ఆయుధాలను(తుపాకులను) షాపు సిబ్బందిపై ఎక్కుపెట్టి షాపులోని బంగారు నగలను తీసి మూటగట్టి తమకు ఇవ్వాల్సిందిగా గట్టి స్వరంతో హెచ్చరించారు. హఠాత్పరిణామానికి ఖజానా జ్యువెలర్స్ షాపు ఉద్యోగులంతా అవాక్కవడంతోపాటు ఒకింత ఉలిక్కిపడి ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితుల్లో ఒకరి మొహాలు ఒకరు చూసుకునే లోపే ఏడుగురు నిందితులలోని ఓ వ్యక్తి జువెలరీ షాప్ లో భయానక వాతావరణాన్ని సృష్టించడానికి తాను వేసుకున్న స్కెచ్ ప్రకారం జలరి సిబ్బంది లోని ఓ వ్యక్తి(అతను డిప్యూటీ మేనేజర్ సతీష్)పై ఫైరింగ్ ఓపెన్ చేశాడు. దీంతో ఆ తుపాకి లోని తూటా సర్రున దూసుకుంటూ వెళ్లి సదరు డిప్యూటీ మేనేజర్ సతీష్ తొడను చీల్చివేసింది. అంతటితో ఆగని సదరు నిందితుడు మరోసారి గాల్లోకి ఫైరింగ్ చేయగా అది ఓ సిసి కెమెరా పక్కనుండి దూసుకెల్లడం జరిగింది. మర్యాదగా బంగారు ఆభరణాలను భద్రపరిచే సేఫ్టీ లాకర్ ను వెంటనే ఓపెన్ చేసి బంగారు నగలను మూటగట్టి తమకు అందించకపోతే ఒక్కొకరి పుచ్చలు పేలిపోతాయని సినిమా రేంజ్ లో ఆ నిందితులంతా డైలాగ్ డెలివరీ చేసినప్పటికీ... తమ వద్ద సేఫ్టీ లాకర్ ఉండదని, అది తమ యజమాని వద్దనే ఉంటుందని వారు చెప్పడంతో ఇక ఆలస్యం చేస్తే ఎక్కడ తమకు ముప్పు వాటిల్లుతుందోనని భావించారో ఏమో షాపులోకి చొరబడ్డ నిందితులంతా అక్కడ కనిపించిన కొన్ని వెండి ఆభరణాలను తమ బ్యాగుల్లో వేసుకుని క్షణాల్లో షాపు బయటకు వచ్చి మూడు, నాలుగు ద్విచక్ర వాహనాలపై చూస్తుండగానే కనుమరుగైపోయారు. కాగా సమాచారం అందుకున్న సైబరాబాద్ కమిషనరేట్ పోలీసు అధికారులు క్లోజ్ టీమ్స్, సైబరాబాద్ పోలీసు అధికారులు, సిసిఎస్, ఎస్ఓటి సహా ఇతర విభాగాల పోలీస, చందానగర్ పోలీసులు అధికారులను ఘటనా స్థలానికి రప్పించి ఖజానా జ్యువెలర్స్ షాప్ పై దాడి జరిగిన తీరును, నిందితుల ఆనవాళ్లను, ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమై ఒక ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై మాదాపూర్ జోన్ డిసిపి వివరాలను వెల్లడిస్తూ ఏడుగురు నిందితుల బృందం ఖజానా జ్యువెలరీ షాపులోకి ఉదయం 10 గంటల 35 నిమిషాల ప్రాంతంలో ప్రవేశించి సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడి బంగారు ఆభరణాలను తస్కరించడానికి గట్టి ప్రయత్నమే చేశారని, ఈ క్రమంలో ఓ నిందితుడు తుపాకీతో కాల్పులకు పాల్పడి డిప్యూటీ మేనేజర్ సతీష్ కుమార్ ను గాయపరచడం జరిగిందని, మరో రౌండు గాల్లోకి కాల్పులు జరిపి సీసీ కెమెరాను ధ్వంసం చేసే ప్రయత్నం కూడా చేయడం జరిగిందని, కానీ అది సఫలం కాలేదన్నారు. సేఫ్టీ లాకర్ ను తెరవడానికి శతవిధాల ప్రయత్నించినప్పటికీ మరో తాళం చెవి లేకపోవడంతో వారి ప్రయత్నం వృధా అయ్యిందని, దీంతో ఎదురుగా ఉన్న కొన్ని వెండి ఆభరణాలను తీసుకొని తమ బ్యాగుల్లో వేసుకొని వచ్చిన బైకుల పైనే పారిపోవడం జరిగిందన్నారు. నిందితుల ఆధారాలు సేకరిస్తున్నామని, బయటి ప్రాంతం వారు కూడా అయ్యుండొచ్చు అన్న కోణంలో కూడా తమ దర్యాప్తు కొనసాగుతుందని, త్వరలోనే నిందితులను పట్టుకుని మీడియా ముందు వివరాలను వెల్లడిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం దుండగుల దాడిలో గాయపడిన డిప్యూటీ మేనేజర్ సతీష్ కుమార్ కు ఎలాంటి ప్రాణహాని లేదని, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని ఆయన వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, రాబరీ జరిగిన విధివిధానాలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక బృందాలను ఏర్పాటు నిందితులను అరెస్టు చేస్తామని తెలిపారు.

# నిరసనల మధ్య బిల్లుల ఆమోదం

**కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం**
**ఐటి, స్పోర్ట్స్ బిల్లులకు సభ మద్దతు**
**ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటు**

ప్రవేశపెట్టారు.బిల్లు ప్రవేశపెట్టిన 3 నిమిషాలకే ఎలాంటి చర్చా జరగకుండానే మూజువాణి ఓటుతో సభామోదం పొందింది. బిహార్ ఓటర్ల సమగ్ర సవరణపై విపక్షాలు ఆందోళన నిర్వహిస్తుండడంతో దీనిపై చర్చకు తావులేకుండా పోయింది. బిల్లు పాసైన అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడిరది.ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం–1961 స్థానంలో ఈ ఏడాది ఫిబ్రవరిలోనే కేంద్రం లోక్‌సభలో ఆదాయపు పన్ను బిల్లు, 2025ను ప్రవేశపెట్టింది. విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాన్ని సెలక్ట్ కమిటీకి పంపించింది. కమిటీ ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకున్న అనంతరం.. ఆదాయపు పన్ను (నం.2) బిల్లు–2025ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. గత శుక్రవారం పాత బిల్లును ఉపసంహరించుకున్నారు. సెలక్ట్ కమిటీ సిఫార్సులన్నింటినీ దాదాపుగా ఆమోదించినట్లు మంత్రి వెల్లడిరచారు. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి 66 బడ్జెట్‌లలో (రెండు మధ్యంతర బడ్జెట్లు కలిపి) ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు కొత్త బిల్లును రూపొందించారు. లోక్‌సభ ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ బిల్లు తదుపరి రాజ్యసభకు వెళ్లనుంది. రాష్ట్రపతి ఆమోద ముద్రతో కొత్త చట్టంగా మారనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది.పాత ఆదాయపు పన్ను చట్టంలో 'క్రితం సంవత్సరం' 'అసెస్‌మెంట్ ఇయర్' అనే పదాలు వాడుకలో ఉన్నాయి. కొత్త బిల్లులో వీటి స్థానే 'పన్ను సంవత్సరం' వినియోగంలోకి రానుంది.2025 ఆదాయపు పన్ను బిల్లు కొత్త పన్నులేమీ విధించదు. ప్రస్తుతం ఉన్న పన్ను శ్లాబులు, రేట్లను మార్చదు. అలాగే ఐటీఆర్ ఫైలింగ్ గడువు తేదీలు, ఆదాయపు పన్ను శ్లాబులు, మూలధన లాభాల్లో ఎటువంటి మార్పులూ ఉండవు.వేతనాల నుంచి డిడక్షన్ల విషయానికొస్తే అంటే స్టాండర్డ్ డిడక్షన్, గ్రాడ్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితరాలు వేర్వేరు సెక్షన్లు, నిబంధనల కింద ఉన్నాయి. వీటిని ఒకే దగ్గరకు తీసుకొొచ్చి పట్టిక రూపంలో కనిపిస్తాయి.

**ఐటి, స్పోర్ట్స్ బిల్లులకు సభ మద్దతు**

విపక్షాల నుంచి సర్‌పై నిరసనలు గందరగోళం నడుమనే లోక్‌సభలో సోమవారం మొత్తం నాలుగు కీలకమైన బిల్లులు ఆమోదం పొందాయి. రెండు ఆదాయపు పన్ను పన్నుల వసూళ్లకు సంబంధించినవి, మరో రెండు క్రీడావిధానాల సంస్కరణల పరిధిలోకి వచ్చేవి. పన్నుల విధింపు సంబంధిత ఇన్‌కం టాక్స్ (నెంబరు 2) ,పన్నుల విధింపునకు సంబంధించిన టాక్సేషన్ లాస్ (సవరణ) బిల్లు ఇప్పుడు సభామోదం దక్కించుకున్నాయి. సోమవారం ఉదయం సభ ఆరంభం కాగానే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రెండు బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. దేశంలో అమలులో ఉన్న ఆదాయపు పన్ను బిల్లు 1961 నాటి ఆదాయ పన్ను చట్టం నిబంధనలకు అనుగుణంగా ఉంది. ఈ చట్టాన్ని సవరించి , సరైన విధంగా పటిష్టం చేసేందుకు ఈ నూతన ఆదాయపు పన్ను బిల్లు తీసుకువచ్చారు.ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందితే పాత చట్టం స్థానంలో కొత్త చట్టం అమలులోకి వస్తుంది. ఆదాయపు పన్ను చట్టం అంశాలను పరిశీలించేందుకు బిజెపి సీనియర్ ఎంపి బైజ్యనాథ్ పాండా సారథ్యంలో ఏర్పాటు– అయిన సెలెక్ట్ కమిటీ– సిఫార్సులను ఈ బిల్లులో పొందుపర్చారు. ఇక పన్నుల విధింపు సంబంధిత బిల్లు పన్నుల వ్యవస్థీకృత పద్ధతులలో మార్పునకు ఉద్దేశించింది. ఈ క్రమంలో ఈ ఏడాది తీసుకువచ్చిన ఫైనాన్స్ యాక్ట్‌ను కూడా సవరించడం జరుగుతుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 13వ తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఐటి బిల్లు 2025లో పలు మార్పులు చేర్పులను సెలెక్ట్ కమిటీ– సిఫార్సు చేసింది. ఇవి కూడా ఇప్పటి తాజా బిల్లులో చేరాయి. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సర్‌పై ప్రతిపక్షాలు సభలో తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తం చేయడంతో సభా కార్యక్రమాల దశలో గందరగోళం ఏర్పడిన దశలోనే ఈ రెండు బిల్లులు ఆమోదం పొందినట్లు– సభాధ్యక్ష స్థానం నుంచి ప్రకటన వెలువడిరది. ప్రతిపక్షాల ప్రాతినిధ్యం అంతకు ముందటి చర్చ పక్రియ లేకుండానే ఈ బిల్లు ఆమోదం పొందింది.క్రీడా విధానానికి సంబంధించిన అత్యంత కీలకమైన నేషనల్ స్పోర్ట్ గవర్నెన్స్ బిల్లును , నేషనల్ యాంటీ– డోపింగ్ సవరణ బిల్లును సోమవారం లోక్‌సభ ఆమోదించింది. సర్‌పై ప్రతిపక్షాల తీవ్ర నిరసనల నడుమనే ఈ బిల్లులు సభా సమ్మతి దక్కించుకుంది. స్వాతంత్యం÷%–%ర వచ్చిన తరువాత దేశంలో క్రీడా విధాన సంస్కరణల దిశలో తీసుకువచ్చిన బిల్లు ఇదే అని క్రీడల మంత్రి మనుసుఖ్ మాండవీయ తెలిపారు. క్రీడా రంగంలో ఏకైక సంస్కరణల అడుగు అని స్పందించారు. ఈ రెండు క్రీడా బిల్లులతో జవాబుదారి , సరైన న్యాయం, సుపరిపాలనకు వీలేర్పడుతుంది. క్రీడా సమాఖ్యలు సముచితంగా వ్యవహరించేందుకు వీలేర్పడుతుందని మంత్రి తెలిపారు. బిల్లులు సభలో ప్రవేశపెట్టిన సమయంలో సభలో ప్రతిపక్ష నాయకులు ఎవరూ లేరు. దేశ క్రీడా యవనికలో గణనీయ పరిణామానికి దారితీసే ఈ బిల్లుల దశలో ప్రతిపక్షాలు సభలో లేకపోవడం దురదృష్టకరం అని మంత్రి వ్యాఖ్యానించారు.

## చరిత్ర పునాదులపైనే...
# వర్తమాన సమాజం పయనం!



మానవ పరిణామ క్రమంలో చరిత్ర వర్తమానానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. సామాజిక వ్యవస్థలో వ్యక్తి, కుటుంబం, సమాజం ప్రధాన పాత్రలు పోషిస్తాయి. ఏ వ్యవస్థలోనైనా అభివృద్ధి కార్యక్రమాలను సమాజానికి తెలియజేయడం అవసరం. ప్రతి వ్యక్తి తన చరిత్రను నిర్మించుకోవడం ఎంత ముఖ్యమో, దానికి అక్షర రూపం ఇవ్వడం అంతే ముఖ్యం. బాధ్యతలను గుర్తించడం, అవగాహన పెంచుకోవడం, భావితరాల కోసం కుటుంబ చరిత్రలు నిబద్ధతకు, నిజాయితీకి కొలమానాలుగా నిలుస్తాయి. గతం ఎలా ఉన్నప్పటికీ, దాని పునాదులపై వర్తమానాన్ని నిర్మించి, భవిష్యత్తుకు దోహదపడేలా ఆలోచనలకు లిఖిత రూపం చరిత్రగా భావించవచ్చు.

కొన్ని సందర్భాల్లో "వెనుతిరిగి చూడకుండా, నమ్మిన సిద్ధాంతం కోసం పోరాటంలో పయనించారు" అని చెప్పుకుంటాం. అంటే, అంకితభావంతో సరైన మార్గంలో పయనించి లక్ష్యాన్ని సాధించారని అర్థం. మరోవైపు, పూర్వాపరాలు పరిశీలించకుండా, సమయస్ఫూర్తిగా ఆలోచించకుండా గుడ్డిగా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు సంభవించాయని కూడా చెబుతాం. ఇటువంటి సంఘటనలు చెడు పరిణామాలను, రాబోయే ప్రమాదాలను ఊహించకుండా వ్యవహరించడం వల్ల జరుగుతాయని అర్థం చేసుకోవాలి. మనిషి ప్రయాణం, దిశ, సందర్భం, లక్ష్యం, పరిస్థితులను బట్టి అంచనా వేయడం చరిత్ర ద్వారా సాధ్యమవుతుంది.

ఏ పనికైనా ఉద్యుక్తులైనప్పుడు, పూర్వాపరాలను పరిశీలించి, పరిణామాలను విశ్లేషించి, లక్ష్య సాధన వైపు సాగాలనే ఆలోచన సామాన్యుల నుండి అసామాన్యుల వరకూ ఉండాలి. ఎదురైన అనుభవాలు, సంఘటనలు, ఆటుపోట్లు, అవమానాలు, తప్పిదాలు, లోపాలను మనసులో ఉంచుకోవడం కష్టం కాబట్టి, వాటిని రాసి పెట్టుకుంటే పునరావృతం కాకుండా చూసే అవకాశం ఉంటుంది. విఫలమైన సందర్భాలను, వాటి కారణాలను రాసి పెట్టుకోవడం ద్వారా భవిష్యత్తులో మెరుగైన నిర్ణయాలు తీసుకోవచ్చు.

మన పూర్వీకులు జ్ఞాపకశక్తితో సంఘటనలను, సన్నివేశాలను, బాధలను వివరంగా చెప్పగలిగారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో విచ్ఛిన్నమైన వాతావరణం, దెబ్బతిన్న మానవ సంబంధాలు, అనారోగ్యం, మానసిక సంఘర్షణల వల్ల జ్ఞాపకశక్తి తగ్గుతోంది. నిన్న మొన్నటి సంఘటనలు కూడా మరచిపోతున్నాం. ఇలాంటి సమయంలో, అనుభవాలను రాసుకోవడం ద్వారా పొరపాట్లను సవరించుకొని, సమాజాన్ని ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేయవచ్చు. ఇతరులకు మన అనుభవాలను పంచడం ద్వారా సాటి మనిషిని సమానంగా చూసే సంస్కృతి ఏర్పడుతుంది. ఇదే కుటుంబ చరిత్రగా అర్థవంతంగా నిలుస్తుంది.

కొందరు వృత్తిని అంకితభావంతో నిర్వహిస్తూ కనీస విలువలకు కట్టుబడి జీవిస్తారు. మరికొందరు వృత్తితో పాటు సామాజిక చింతన, ఇతరులకు తోడ్పాటు అందించడంలో భాగస్వాములవుతారు. ఇంకొందరు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సంఘ జీవితానికి అలవాటు పడతారు. వాళ్ల స్థాయిలో త్యాగాలు, వృత్తులు, ప్రవృత్తులు ఉంటాయి. ఈ కార్యక్రమాలను రాసి పెట్టుకుంటే, అవి ఇతరులకు మార్గదర్శకంగా నిలుస్తాయి. భారత మాజీ ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ "చరిత్రను అధ్యయనం చేయడం ద్వారా జ్ఞానం, విజ్ఞానం సేకరించవచ్చు. ప్రతి వ్యక్తి తన ఆచరణ, ఆదర్శాల ద్వారా చరిత్ర నిర్మించుకోవాలి. అది మానవ జీవితానికి సార్థకతను ఇస్తుంది" అని చెప్పారు. ఇది సమాజంలో గౌరవాన్ని సంపాదించే జీవన విధానాన్ని సూచిస్తుంది. చారిత్రక వ్యక్తులు కొందరే అయినప్పటికీ, ప్రతి ఒక్కరూ తమ చరిత్రను రాసుకోవడం మంచిది. గతంలో త్యాగధనులు, పోరాట వీరులు, నిపుణులు ఉన్నప్పటికీ, చరిత్రకారుల నిర్లక్ష్యం, స్ఫూర్తి లేమి వల్ల లక్షలాది మంది చరిత్రలు అందకుండా పోయాయి. ఇటీవలి కాలంలో పరిశోధనల ద్వారా కొందరి చరిత్రలను నమోదు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉదాహరణకు, తెలంగాణ సాయుధ పోరాటంలో నలగొండ జిల్లా కడివెండి గ్రామానికి చెందిన నల్ల నరసింహులు, ఆయన భార్య వజ్రమ్మల చరిత్రను పరిశోధకుల ఆధారాలతో "తెలంగాణ సాయుధ పోరాటంలో నల్ల వజ్రమ్మ" అనే వ్యాసం గా రాశాను. కొందరు చరిత్రకెక్కితే, మరికొందరు కనుమరుగయ్యారు.

మామూలు వ్యక్తుల చరిత్ర అందుబాటులో ఉంటే, వీరోచిత కార్యకలాపాలలో పాల్గొన్నవారి చరిత్ర కూడా అందకుండా పోయిన సందర్భాలు ఉన్నాయి. చరిత్రకారులు, రచయితలు, కళాకారులు, సామాజికవేత్తలు ఇటువంటి అంశాలపై దృష్టి సారించి చరిత్రలో వారిని నిలబెట్టాలి. నెహ్రూ సూచించినట్లు, ప్రతి వ్యక్తి సామాజిక స్పృహతో తన రంగాన్ని ఎంచుకొని కృషి చేసి, చరిత్ర నిర్మించుకోవాలి. ఈ అనుభవాలను రచన రూపంలో నమోదు చేయడం భావితరాలకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం కవులు, రచయితలు, సామాజికవేత్తలు తమ అభిప్రాయాలను పుస్తక రూపంలో ప్రచురిస్తూ భావితరాలకు అందిస్తున్నారు. అయితే, ప్రతి కుటుంబం తమ వంశ చరిత్ర, గ్రామ చరిత్ర, చిన్ననాటి పరిస్థితులు, వృత్తి, విద్యార్హతలు, మానవ సంబంధాలను నమోదు చేయడం తర్వాతి తరాలకు ఉపయోగకరం. ఇవి భారీ పుస్తకాల రూపంలో కాకపోయినా, నోటుబుక్కుల లోనైనా రాసి పెట్టుకోవాలి. పురాతన కాలంలో కొందరి ఇళ్లలో చిట్టాలు, పద్దుల రూపంలో జ్ఞాపకాలు, వంశ వివరాలు ఉన్నాయి. ఇటీవల కొందరు కుటుంబ చరిత్రలను పుస్తకాలుగా ప్రచురించి, ఉత్సవాల ద్వారా విడుదల చేస్తున్నారు. ఇవన్నీ పాఠకులకు ఉపయోగపడతాయి, కానీ చదవడానికి, ఆలోచించడానికి, ఆచరించడానికి సిద్ధంగా లేకపోతే, పుస్తకాలు, గ్రంథాలు, కుటుంబ చరిత్రలు వృథా అవుతాయి. ప్రస్తుత లెక్కల ప్రకారం, సాహిత్యాన్ని చదివే వారు 10 శాతం కూడా లేరని అంచనా. అలాంటప్పుడు కుటుంబ చరిత్రల అవసరం ఉందా అని కొందరు ప్రశ్నిస్తారు. కానీ, కుటుంబ చరిత్రలు రాసుకోవడం ద్వారా భావితరాలకు స్ఫూర్తి, అనుభవాలు, వంశ గౌరవం, గతంతో పోటీ పడే ఆరాటం పెరుగుతాయి. ఈ ఆలోచనను పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు అందించడం ద్వారా నాగరిక సంస్కృతికి నాంది పడుతుంది. తమ చరిత్రను తాము రాసుకుంటే సక్రమంగా ఉంటుందిబీ ఇతరులు రాస్తే వక్రమవుతుంది. నేరస్తులు, అవినీతిపరులు తాము మంచివారమని రాసుకుంటే చరిత్ర క్షమించదు. చరిత్ర గౌరవాన్ని పెంచుతుంది, తప్పుదారిలో హెచ్చరిస్తుంది. ఈ సత్యాన్ని గమనించి సమాజం ముందుకు సాగాలి.




డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# జాతర నవల
## జాగృత పరిశోధన



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305





సామాజిక జీవితంలోని సమస్యల్ని సంఘర్షణల్ని ఇతివృత్తంగా తీసుకొని నవల రాయడం అంత సులువైన పనేం కాదు. ఈ నేపథ్యంలో రచయిత సమాజ పరిశీలన, అవగాహన, అధ్యయనం, అన్నింటికి మించి ముఖ్యంగా అతని సామాజిక దృక్కోణం అనేవి కీలక పాత్ర వహిస్తాయి. సామాజిక జీవితం అనేదే పెద్ద కాన్వాసు. అందులో చరిత్ర, సంస్కృతి,నాగరికత, కళలు, ఆచార వ్యవహారాలు, అలవాట్లు, విశ్వాసాలు ఇలా ఎన్నో అంశాలు చోటు చేసుకుంటాయి. ఇందు లో అన్ని అంశాలు మీద శాస్త్రీయ దృక్పథానికి కట్టు బడి ఉంటాయని చెప్పలేము. తరతరాలుగా మన సమాజంలో సంస్కృతిలో పరంపరగా ఎన్నో పండుగ లు పబ్బాలు, ఉత్సవాలు, జాతరలు అనాదిగా కొన సాగుతూనే ఉన్నాయి. ఇవి మన రాష్ట్రానికో దేశానికో జాతికో మాత్రమే పరిమితమైనవి కావు. వివిధ రూపా ల్లో పేర్లతో ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. నల్లగొండ జిల్లా మాన్యం చెల్కకు చెందిన బోయ జంగయ్య మంచి రచయిత, కవి, కథకుడు. ఆయన కథలు, నవలలు తెలంగాణ జీవితాన్ని ప్రభావితం చేసిన నాటి ఫ్యుడల్ వ్యవస్థలోని గ్రామీణ జీవితాన్ని అక్కడి పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వివరిస్తాయి, విశ్లేషిస్తాయి. ఆయన రచనలలో సామాజిక వాస్తవికత గోచరిస్తుంది. ప్రజల విశ్వాసాలను నమ్మకాలను భక్తి ముసుగులో పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా వినియోగించుకుంటుందో దోచుకుంటుందోనన్న విషయాన్ని సమకాలీన సమాజానికి తెలియజెప్పడం కోసం ఆయన "జాతర"అనే నవల రాశారు. సమ్మక్కబి సారక్క, గంగమ్మ జాతరల వంటివి పెద్దవి కాగా గ్రామీణ ప్రాంతాలలో స్థానిక దేవతామూర్తుల పర్వాలను పురస్కరించుకొని రెండు మూడు రోజులపాటు సాగే జాతరలు ఉన్నాయి. రచయిత తన పరిసర ప్రాంతంలో జరిగే ఒక జాతరను ఇతివృత్తంగా తీసుకొని ఈ నవల రాశాడు. 1988లో వచ్చిన ఈ నవల తెలుగు సాహిత్య ప్రపంచంలోనే కాదు సామాజిక జీవితంలోనూ సంచలనం సృష్టించింది. ఆధ్యాత్మికత, భక్తి, అంధ విశ్వాసాలను ఆసరాగా చేసుకుని జాతర ముసుగులో ఎన్ని చీకటి విషాదాలు కొనసాగుతున్నాయో వివరించారు. బడుగు బలహీన వర్గాలే కాక వీటిని పెంచి పోషించిన పెట్టుబడిదారి వర్గం కూడా లైంగికంగా ఎలా దోపిడీకి గురవుతుందో తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని, చేత బళ్ళు పనిచేయవని, గ్రహ పీడ తొలగుతుందని, సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని ఇలా ఎన్నో నమ్మకాలతో జనులు జాతరకు వస్తుంటారు. అందులో కొంతమందికి అనుకున్నవిధంగా కోరికలు నెరవేరడం సహజం. అదే ప్రచారంగా మారుతుంది. దాంతో పెద్ద సంఖ్యలో ఆర్తులు ఆప్తులు భక్తులు సరే సరి.

ఈ నవలలో కూడా ఊరి పటేలు కోడలైన రాధకి పిల్లలు లేరనే బాధ. బండి కట్టించి ఆమెను గుట్టమీద పూజకు పంపిస్తాడు. మామగారైన సీతయ్య తన కొడుకు పాండయ్యను కోడలితో వెళ్ళమంటే అతడు వెళ్లడు. పట్నం వెళ్లి క్యాబరే చూస్తూ రోజంతా గడుపుతాడు. జాతరకు వెళ్లి వచ్చిన రాధా అటు తరువాత నెల తప్పడంతో అందరూ సంతోషిస్తారు. అదంతా గుట్ట దేవుడి మహిమగా భావిస్తారు. కానీ నిజానికి మన్మధ పూజ పేరుతో అర్ధరాత్రి పూజారి రాధపై చేసిన లైంగిక దోపిడీ మహిమ అది. రాధకులాగే అతడు ఎందరినో అలా గర్భవతుల్ని చేశాడనడంతో నవల ముగుస్తుంది. అంధ విశ్వాసాలను పారద్రోలి శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవడానికి కాదు జాతరల ముసుగులో సాగే రకరకాల దోపిడీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రబోధించిన ఈ నవలకు 1989లో తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాన్ని అందించింది. సభ్య సమాజాన్ని ఆలోచింపజేసిన ఈ నవలపై ఉత్తరాంధ్రకు చెందిన మొయిలి శ్రీరాములు"జాతర నవలహసమగ్ర పరిశీలన"అనే అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి 1999లో ఎం.ఫిల్ పట్టాను పొందారు. శ్రీరాములు నిర్దిష్ట లక్ష్యంతో సామాజిక స్పృహతో కూడిన జాతర నవలను తనకు తానుగా ఎన్నుకోవడం అభినందనీయం. తన పరిశోధన కృషిని విశ్వవిద్యాలయ గ్రంథాలయానికి పరిమితం చేయకుండా ఎన్నో వ్యయ ప్రయాసలకు వచ్చి పాఠకులకు అందించడం ఆహ్వానించదగిన పరిణామం. ప్రస్తుతం అతడు నవోదయ విద్యాలయంలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. జాతర నవలను సమగ్రంగా విశ్లేషించడానికి శ్రీరాములు తన అధ్యయనాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించాడు. మొదటి అధ్యాయంలో నవలా రచయిత బోయ జంగయ్య జీవన రేఖల్ని, రెండో అధ్యాయంలో ప్రాచీనాధునికాంధ్ర సాహిత్యంలో జాతర ప్రస్తావన, మూడో అధ్యాయంలో నవలానుశీలనం, నాలుగో అధ్యాయంలో జాతర నవలానుశీలనం, ఐదో అధ్యాయంలో జాతర నవలలో సామాజిక సమస్యల ప్రతిఫలనం, ఆరో అధ్యాయంలో భాషా విశేషాల్ని శాస్త్రీయంగాను సమగ్రంగాను విశ్లేషించాడు. అనుబంధంలో బోయ జంగయ్య తో ముఖాముఖి నిర్వహించాడు. బహుశా ఒక అంశాన్ని లోతుగా విశ్లేషించడానికి అధ్యయనం చేయటానికి అవసరమైన మౌలికాంశాలన్నింటినీ అతడు ఎన్నుకున్నాడు. అతని పరిశోధన ఫలితం స్కానింగ్ రిపోర్ట్లాగా స్పష్టంగా సార్థకంగా ఉంది. అందుకు అతనికి అభినందనలు.

జాతర వంద పేజీల నవలే కావచ్చు కానీ జాతర ప్రస్తావన గల ప్రాచీన ఆధునిక ఆంధ్ర సాహిత్యాన్ని మదించటానికి అతడు పడిన పరిశ్రమ చేసిన పరిశోధన ప్రశంసనీయమైనది. అందుకు ఎంతో కోరిక తీరిక ఓపిక ఉండాలి. యాత్ర శబ్దభవంగా జాతరను పేర్కొంటూ యజ్ఞ యాగాదులను శిష్టులు ఆచరిస్తే జానపదులు గ్రామదేవతల్ని పూజిస్తారని గ్రామ దేవతలకు పెద్ద పెట్టున ఊరేగింపులతో కూడిన ఉత్సవాలు జరుపుతారని ఆ పండగలనే జాతరలు అంటారని వివరించాడు. అలాగే బసవపురాణంలో పాల్కురికి సోమనాథుడు ముగ్ధ భక్తురాలు అయినా గొడగూచి వృత్తాంతంలో గల "వీరభద్రుని జాతర వేళ" అనే ప్రయోగాన్ని ప్రస్తావించడం గమనించదగినది. మూడో అధ్యాయంలో నవల నిర్వచనం మొదలు దాని లక్షణాలను గురించి అందులోని వస్తువు శైలికి ఏర్పడ్డ అనుబంధాన్ని గురించి పేర్కొన్నాడు. చెట్టు వల్ల చెట్టు జంతువు వల్ల జంతువు మనిషి వల్ల మనిషి పుడతాడు కానీ మంత్ర తంత్రాలకు పుట్టరు అనుకుంటా, అన్న కథానాయక పాత్రలోని రాధ మాటలు ఆమె శాస్త్రీయ దృక్పథాన్ని వెల్లడిస్తాయి. చివరకు రాధ" భయం ఉన్నంతవరకు బాధలు తప్పవు మరి "అని వాపోతోంది. నవలలో ప్రధాన ఇతివృత్తంతో పాటు సమాజంలో వెళ్ళూనుకొనిపోయిన లంచగొండితనాన్ని, వ్యభిచార వృత్తిని జానపదుల అమాయకత్వాన్ని జాతర సందర్భంలో ఏర్పాటు అయ్యే దుకాణాలను గురించి, పశువుల, గొర్రెల, మేకల, కోళ్ళ బలులను గురించి వివరంగానే ప్రస్తావించా డు. శ్రీరాములు నవల లోనే పాండయ్య, రాధ, సీతయ్య, పూజారి వంటి ముఖ్యపాత్రల్ని వాటి స్వభావా న్ని కూలంకషంగా విశ్లేషించి నవలలో ఆ పాత్రలు ఎలా సహజంగా ఇమిడిపోయాయో చెప్పటానికి, ఒక్కొక్క పాత్రను ప్రత్యేకంగా వివరించాడు. తెలంగాణ మాండలికాలైన గదుమ, బోనాలు, గల్ల,అరుగు, మొగులు మొదలైన పదాలు సందర్భోచితంగా ఏ విధంగా పొదగబడ్డాయో వివరించాడు. చివరగా మొయిలి శ్రీరాములు తన పరిశోధన ఫలితంగా నిగ్గుదేలిన సత్యాన్ని పేర్కొంటూ"ఈ నవల గ్రామీణ జీవితానికి అద్దం పడుతూ వారు ఎలా పూజారి వర్గం దోపిడికి గురవుతున్నారో స్పష్టంగా చూపిస్తుంది. ఇందులో సిద్ధాంతాలు. స్లోగన్ లు, చర్చలు, వాదోపవాదాలు ఏమీ లేవు. కథ ప్రవాహ సదృశ్యంగా సాగిపోతూ జీవిత సత్యాలను ఆవిష్కరిస్తూ మూఢనమ్మకాలను పటాపంచలు చేస్తుంది"అంటూ జాతర నవల ఆధునిక సాంఘిక నవలల్లో అగ్రశ్రేణికి చెందిన నవల మాత్రమే కాదు, ఉత్తమ సాహితీ విలువలను సంతరించుకున్న విశిష్టమైన నవలగా అభివర్ణించారు. సమాజం -సాహిత్యం అనేవి బింబ ప్రతిబింబ రూపాలు. వాటి మధ్య సమన్వయం, సమ్యగవాహన కలిగించేవే పరిశోధనలు. పాఠకుల ఆలోచన పరిధిని విస్తరింప జేస్తున్న ఉత్తమ సిద్ధాంత వ్యాసాన్ని రచించి ప్రచురించిన మిత్రులు డాక్టర్ మొయిలి శ్రీరాములు నా హార్దికాభినందనలు.

## మేల్కొనకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదం!




'ఫాసిజం అనేది ఒక్క రాత్రిలో రాదు. మెల్ల మెల్లగా దేశంలోకి చొచ్చుకువస్తుంది. వ్యవస్థల ను క్రమంగా బలహీనపరుస్తుంది. ఆ తర్వాత ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా సమాధి చేస్తుంది..' జర్మనీలో నాజీ అనుభవాలను దృష్టిలో ఉంచు కొని చాలా మంది చరిత్రకారులు, రచయితలు చేసిన వ్యాఖ్యలివి.. ప్రస్తుతం భారతదేశం అటు వైపే ప్రయాణిస్తున్నదా? అనే తీవ్రమైన ఆందోళన ప్రజాస్వామ్యవాదులను కలచివేస్తు న్నది. ఎన్నికల నిర్వహణలో ఎలక్షన్ కమిషన్ వ్యవహరిస్తున్న తీరును ఇటీవల రాహుల్ గాంధీ బయటపెట్టాక.. ఈ ఆందోళన మరింత పెరిగింది. ఇండియాలో కూడా అలాంటి సిద్ధాంతాలను అనుసరిస్తున్నారా అనే అనుమానం వ్యక్తమవుతున్నది. ఈ అనుమానం.. వాస్తవరూపం దాల్చే దారిలో అడుగులు పడక ముందే.. ప్రజలు, ముఖ్యంగా యువత మేల్కొనాల్సిన అవసరముంది. లేకుంటే ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడి.. ప్రజల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది.

### అనేక సారూప్యతలు..

దేశంలో ప్రస్తుతం జరుగుతున్న కొన్ని పరిణామాలు.. ఆనాటి జర్మనీలో నాజీల పాలనా లక్షణాలను గుర్తుకు తెస్తున్నాయని విమర్శకులు, మేధావులు, ఫ్రీలాన్స్ జర్నలిస్టు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాజీ పాలనలో హిట్లర్ ఒక్కడినే దేశరక్షకుడిగా చిత్రీకరించారు. అప్పుడు జర్మనీలో జాతీయతను ఒక ఆయుధంగా మలిచి.. ప్రశ్నించే, విమర్శించే వారిని దేశద్రోహులుగా ముద్రవేసేవారు. ఇప్పుడు ఇండియాలోనూ భారత్ మాతాకీ జై వంటి నినాదాలను జాతీయతకు, తమ రాజకీయ ఎజెండాకు ఒక సాధనంగా మలుచుకుంటున్నారు. భారత్లో విపక్ష పార్టీల నేతలు, వారి కుటుంబసభ్యులపై ఈడీ, సీబీఐ, ఐటీ వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా వారిని బలహీనపర్చే కార్యక్రమం కొనసాగుతున్నది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే నేతలు, మేధావులు, సామాజిక కార్యకర్తలపై దేశద్రోహం ముద్ర వేసి అనేక సంవత్సరాలుగా జైళ్లలో ఉంచుతున్నారు. మైనార్టీలైన ముస్లింలు, క్రైస్తవుల పట్ల వివక్ష పెరిగేలా కుట్రలు పన్ని అమలు చేస్తున్నారు. సీఏఏ, ఎన్ఆర్సీ వంటి చట్టాలు ఇందులో భాగమే అనే అభిప్రాయాలున్నాయి. గోరక్షకుల దాడులు, మతమార్పిడి ఆరోపణలతో దాడులు, మణిపూర్లో జాతి హింస వంటివి ఈ వివక్షను స్పష్టంగా సూచిస్తున్నాయి.

### వ్యవస్థలను బలహీనం చేసి..

ముఖ్యంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాల్సిన ఎలక్షన్ కమిషన్ పై వస్తున్న తీవ్రమైన ఆరోపణలు ఇందుకు నిదర్శనం. అయితే ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేలా ఈసీ సరైన జవాబు ఇవ్వకపోవడం ఈ అనుమానాలను మరింత బలోపేతం చేస్తున్నది. కొన్నేళ్లుగా వెలువడుతున్న తీర్పులను చూస్తే న్యాయవ్యవస్థపైనా ఒత్తిడి ఉన్నట్లు స్పష్టమవుతున్నది. అంతేకాకుండా గతంలో బీజేపీ ప్రతినిధిగా పని చేసిన ఒక నాయకురాలిని బాంబే హై కోర్టు జడ్జిగా ప్రతిపాదించడం కూడా ఇందులో భాగమేననే చర్చ జరుగుతున్నది. 'ఎలాంటి నేరం చేయకున్నా దేశంలోని అనేక మంది కవులు, రచయితలు, ప్రొఫెసర్లు, న్యాయవాదులు జైళ్లలో మగ్గుతున్నారు.. కానీ బహిరంగంగా మారణహోమానికి పిలుపునిచ్చేవారికి మాత్రం బెయిల్ దొరుకుతున్నది' అని అరుంధతి రాయ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. విమర్శనాత్మక ఆలోచనలను అణచివేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. విమర్శలు చేసినందుకు జేఎన్ యూ వంటి వర్సిటీల్లో విద్యార్థులు, ప్రొఫెసర్లు దాడులకు గురైన సందర్భాలు ఉన్నాయి. ఇదీ జర్మనీలో నాజీల విధానాన్ని గుర్తుకు తెస్తున్నాయన్నారు.

### మీడియా నియంత్రణ.. 'గోబెల్స్' ప్రచారం..

జోసెఫ్ గోబెల్స్ నాయకత్వంలోని ప్రచార మంత్రిత్వ శాఖ జర్మనీలో మీడియాను పూర్తిగా నియంత్రించింది. ఇప్పుడు భారతదేశంలో మీడియా స్వేచ్ఛ క్రమంగా క్షీణిస్తున్నదని రిపోర్టర్స్ విథౌట్ బోర్డర్స్ వంటి సంస్థలు గుర్తించాయి, 2025 వరల్డ్ ఫ్రీడమ్ ఇండెక్స్ ప్రకారం 180 దేశాల్లో మీడియా స్వేచ్ఛలో ఇండియా 151వ స్థానంలో ఉన్నది. అంతేకాకుండా ప్రతిసంవత్సరం వివిధ కారణాలతో వందలాది మంది జర్నలిస్టులను అరెస్ట్ చేస్తున్నారు. జర్నలిస్టుల హత్యలు సైతం జరుగుతున్నాయి. నాజీల పాలనలో మీడియా అంతా ప్రభుత్వ అనుకూల వార్తలను మాత్రమే ప్రసారం చేసేది. భారత్ లోనూ ప్రస్తుతం మీడియా ప్రభుత్వ వ్యతిరేక వార్తలకు చోటివ్వకుండా ప్రభుత్వ భజననే చేస్తున్నది. భారతదేశ ప్రధాన ప్రతిపక్ష నేత లేవనెత్తిన సందేహాలను దేశవ్యాప్తంగా అనేక పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా కవర్ చేయకపోవడం, అప్రధాన వార్తగా ప్రచురించడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఇంటర్నెట్ షట్ డౌన్ లు, సోషల్ మీడియా కంటెంట్ ను బ్లాక్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు.

### ఏకమైతేనే ప్రజాస్వామ్య పరిరక్షణ..

ప్రస్తుతం దేశపాలకులు అనుసరిస్తున్న విధా నాలు ప్రజల్లో ఒకరకమైన అనుమానం, భయాన్ని సృష్టిస్తున్నాయి. చరిత్ర చెప్పిన పాఠాల నుంచి ప్రజలు ఇప్పటికైనా నేర్చుకోవాలి. అందరూ ఏకమవ్వాలి. భారతదేశం ఫాసిజం వైపు జారకుండా కాపాడుకోవాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకు ముందుకు కదలాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడీ బాధ్యత అని గుర్తించాలి.



ఫిరోజ్ ఖాన్,
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9640466464

## నాడు-నేడు

మాయలుమంత్రాలతో
దేవుడుదెయ్యాలతో
మనల్ని 'ప్రక్కదారి'
పట్టించారు నాడు!
ఉపాధి సంక్షేమ ఉచిత
పథకాలతో ముష్టివేసి
మనల్ని 'ప్రక్కదారి'
పట్టించారు నేడు!
ఇప్పుడున్న'రాజా'వారు
ఈముష్టి
కూడాఇష్టపడక
వెనకటి
'మాయదారి'కే
నడిపిస్తున్నాడుచూడు!

తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# మహా యోధ అనిశెట్టి రజిత




ఒక మహా వృక్షం నేల కొరిగింది.

అనిశెట్టి రజిత సుప్రసిద్ధ కవయిత్రి, రచయిత్రి , ఆర్గనైజర్, మహిళా వాది, , బహుజనవాది, మానవతావాది . 14 ఏప్రిల్ 1958 లో వరంగల్ జన్మించిన అనిశెట్టి రజిత సోమవారం 11 ఆగస్టు 2025 న సాయంత్రం గుండె పోటుతో అమరులయ్యారు. కాళోజీ బాటలో ప్రతి అన్యాయాన్ని ఎదిరిస్తూ నిర్భీతిగా సాగిన ఒక మహావృక్షం నేల కొరిగింది.

అనిశెట్టి రజితతో 1990 నుండి 35 ఏళ్లుగా విడదీయని అనుబంధం. ఎపుడూ నిండుహృదయంతో అన్నా అనే ఆ పిలుపు ఇప్పటికీ అలా మారు మోగుతూనే ఉంది. వామ పక్ష భావ జాలంలో వికసించిన మహిళా వాది, బహుజనవాది. కార్యకర్త. నాయకురాలు, మేధావి. కవయిత్రి రచయిత్రి. సంకలనకర్త. సహృదయ సౌజన్యశీలి. అనిశెట్టి రజిత ఉద్యమకారులకు, సాహితీవేత్తలకు ఒక ఆదర్శ నమూనా! అనిశెట్టి రజిత మృతితో తెలుగు సాహిత్యం గొప్ప యోధను, సాహితీ వేత్తను కోల్పోయింది. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర నిర్వహించిన రజిత మృతి పట్ల తీవ్ర సంతాపంతో జోహార్లు అర్పిస్తూ వారి కృషి గురించి నాలుగు మాటలు.

### బీసీ సగర సామాజిక వర్గం నుండి ఎదిగిన వజ్రం

బీసీల్లోని ఉప్పరి / సగర సామాజిక వర్గం నుండి రాతి నేలను చీల్చుకొని మహావృక్షంలా ఎదిగారు అనిశెట్టి రజిత. అనిశెట్టి రజిత చరిత్ర నిర్మాత. చరిత్ర నిర్మాతగా తనదైన చరిత్ర సృష్టించుకుంది. కవితాధారలో ప్రసంగాల్లో నవ యువత ఆవేశం, ధర్మాగ్రహం, నిత్య చైతన్యశీలి రజిత వ్యక్తిత్వం. అనిశెట్టి రజిత గొప్ప యోధ. పౌరహక్కుల ఉద్యమం, మహిళలపై అత్యాచార వ్యతిరేక ఉద్యమం, విప్లవ ఉద్యమాలు ... ఒక్కటేమిటి.. కాళోజీలాగే ఉద్యమం ఎక్కడ ఉంటే అనిశెట్టి రజిత అక్కడ ఉంటుంది. ఉద్యమంలో భాగమవు తుంది. ఉద్యమాల వెంట నడుస్తుంది. ఉద్యమాలను నిర్మిస్తుంది. ఉద్యమాలు, కవిత్వం, సాహి త్యం, రకరకాల సంకలనాలు, ఒంటరి మహిళా గాథల సంకలనాలు ప్రచురణ, సభలు సమావేశాలు, మహిళా సాధికారికత, బీసీ ఉద్యమ నిర్మాణం తప్ప అనిశెట్టి రజితకు వ్యక్తిగత జీవితం అంటూ వేరే లేదు. పెళ్లి చేసుకోలేదు.. తన జీతాన్ని జీవితాన్నిసామాజిక సాహిత్య ఉద్యమాలకు అంకితం చేసింది. ఏ మీటింగ్ కు వెళ్లినా వెంట కెమెరా తెచ్చుకొని ఆ వార్తలను అందరికి స్ఫూర్తిదాయకంగా అందించేది. అనిశెట్టి రజిత విప్లవోద్యమాలకు పేరుగాంచిన కాకతీయ యూనివర్సిటీలో నాన్ టీచింగ్ స్టాఫ్గా 1992 లో చేరి పని చేసి రిటైరయ్యారు. కాళోజీ, కాత్యాయనీ విద్మహే, జ్యోతి, వంటి సాహితీవేత్తలతో సహవాసం ఆమె చైతన్యాన్ని నిత్యం ప్రజ్వరిల్ల జేసింది. క్రమంగా తానే స్ఫూర్తినిచ్చి కదిలించేదిగా ఎదిగింది.

### అనిశెట్టి రజితతో ఎన్నో జ్ఞాపకాలు

అనిశెట్టి రజితతో ఎన్నో జ్ఞాపకాలు. 1998ఆగస్టులో జగిత్యాలలో వందలాది సాహితీ వేత్తలతో నా 50వ జన్మదినం జరిగినప్పటి నుండి ఏటా విశాల సాహితి సాహిత్య సదస్సుల్లో పాల్గొన్నారు. విశాల సాహితి సత్కారం అందుకున్నారు. తన చేతుల మీదుగా విశాల సాహితి సత్కారాలు అందజేశారు. వరంగల్ నుండి హైదరాబాద్ వచ్చినపుడల్లా నారాయణగూడ దీపక్ టాకీస్ ఎదుటగల ఆచార్య పి యశోదారెడ్డి గారింట దిగేది. స్వంత ఇల్లుగా ఫీలయ్యేది. నేను కూడ అపుడపుడు అక్కడే కలుసు కనేది. అక్కడ అన్నీ తెలంగాణ ముచ్చట్లే. తెలంగాణ యాస భాష నుడికారం ఎంత గొప్పదో వంట అయ్యే దాకా, భోంచేసి పనిమీద బయలుదేరే దాకా తెలంగాణ ముచ్చట్లు. అనిశెట్టి రజిత తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. నాయకత్వం అందించారు. అనిశెట్టి రజిత రిటయ్యాక కాకతీయ యూనివర్సిటీని కాజీపేటను కలిపే 100 ఫిట్లలో తనదంటూ ఇల్లు ఏర్పరుచుకున్నారు.

### దరకమే ఐక్య వేదికలో అనిశెట్టి రజిత

దశాబ్దాల స్నేహంలో ఎన్ని రంగాల్లో కలిసి పని చేశామో ఎన్ని విషయాలు, భావాలు కలిసి పంచుకున్నామో లెక్కలేదు. బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీలతో కూడిన దరకమే ఐక్య వేదిక నిర్మాణంలో అనిశెట్టి రజిత చురుకుగా పాల్గొన్నారు. 1992 లో ప్రారంభమైన దరకమే ఐక్ర్య వేదిక నిర్మాణంలో వరంగల్ జిల్లాలో పి రాములు, పి ఎన్ ప్రసంగి, శమశ్రీ మల్లయ్య, స్వామి, వల్ల పట్ల తదితరులతో కలిసి బహుజన సాహిత్య ఉద్యమ నిర్మాణంలో ఎంతో కృషి చేశారు. 1992 నుండి వ్యవస్థాపక కన్వీనర్గా, అధ్యక్షుడిగా రాష్ట్ర నిర్మాణంలో నాకు వరంగల్లో అంది వచ్చిన చేయి చేయూత అనిశెట్టి రజిత.


అనిశెట్టి రజిత వంటి ఉత్సాహ వంతులే సంస్థకు అవసరమని, వరంగల్ మొగిలయ్య హాల్ లో 1995 లో జరిగిన దరకమే ఐక్య వేదిక రెండు రోజుల రెండవ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులుగా ఆచార్య ననుమాస స్వామి కూడా వరంగల్ వాడే కావడం విశేషం. దరకమే ఐక్యవేదిక తరఫున గబ్బిలం సాహిత్య పత్రిక తీసినపుడు, వెంటది వెంట రాష్ట్ర కార్య వర్గ సమావేశాలు సభలు జరపడంలో చురుకుగా పని చేశారు. బుద్ధుడు నుండి కబీర్ గురు నానక్, మహాత్మా జోతిరావు ఫూలే, అంబేద్కర్, బియస్పీ కాన్సీరాం వారసత్వ బాటలో సమస్త వర్ణ వర్గ కుల లింగ జాతి మత భాష ప్రాంత వివక్షతలను తొలగించే సాహిత్య సామాజిక సంస్కృతిక రంగాలను బలమైన శక్తిగా నిర్మించడంలో అంది వచ్చిన నాయకత్వం వరంగల్ నుండి అనిశెట్టి రజిత, ప్రభంజన్ కుమార్, వల్లంపట్ల, ఖమ్మం నుండి జూపల్లి సత్య నారాయణ, కె. సీతారాములు, జగిత్యాల నుండి కె. రామ లక్ష్మణ్, రాజధాని నుండి మాస్టార్జీ, విజిఆర్ నారగోని. ,ననుమాస స్వామి, ఉ సాంబశివరావు, కె జి సత్యమూర్తి సాహిత్య తాత్విక సామాజిక ఉద్యమాలను బలోపేతం చేసింది. చరిత్రను మలుపు తిప్పింది. ఆ చరిత్ర నిర్మాణంలో పాల్గొని అనిశెట్టి రజిత, ప్రభంజన్, రామ లక్ష్మణ్ చరితార్థులయ్యారు. మా పెద్ద కొడుకు పాణిగ్రాహి సులేఖల పెళ్లి హన్మకొండలో 2000 ఫిబ్రవరిలో స్టేజి మ్యారేజి చేసినపుడు, ఆచార్య కొత్తపల్లి జయశంకర్, కాళోజీ మొదలైన వారి చేతులమీదుగా పెళ్లి జరగడంలో అందరిని ఆర్గనైజ్ చేయడంలో అనిశెట్టి రజితదే ప్రధాన పాత్ర.

### అనిశెట్టి రజిత రచనలు

కాళోజీ స్ఫూర్తితో 1973లో "చైతన్యం పడగెత్తింది" అనే తొలి రచనతో అనిశెట్టి రజిత రచనా జీవితం మొదలైంది. 500 పైగా కవితలు, వందకు పైగా వ్యాసాలు, వందలాది ప్రసంగాలు .30 పైగా పాటలు. 1. గులాబీలు జ్వలిస్తున్నాయి కవితా సంపుటి (1994), నేనొక నల్ల మబ్బు నవుతా ( 1997), చెమట చెట్టు(1999), ఓ లచ్చవ్వ(2005), ఉసురు (2002), గోరంత దీపాలు(2005), మొదలైన కవితా సంపుటాలతో పాటు "మట్టి బంధం "కథల సంపుటి వెలువరించారు.

### సంకలనకర్తగా

అనిశెట్టి రజిత సంపాదకత్వంలో 1. వెతలే కథలై , 2. ఊపిరి , 3. జిగర్, 4. ఉద్విగ్న, 5. ఆకాశ పుష్పం, 6. ముజఫర్ నగర్ మారణకాండ, 7. అగ్నిశిఖ, 8. పోలవరం ప్రాంతక్రమాదం మొదలైని. అనిశెట్టి రజిత రిటైరయ్యాక కూడా పూనుకొని ప్రతి ఒకరికి ఫోన్ చేసి రాయించి తెచ్చిన ఈ సంకలనాలు సాహిత్య ఉద్యమంలో మైలు రాళ్లుగా నిలిచి పోయాయి. నూతన తరాలను ప్రోది చేసాయి. కొంతకాలం మహిళా రచయితల సంస్థను నిర్మించి ముందుకు నడిపారు. అనిశెట్టి రజిత ప్రజాస్వామిక మహిళా రచయితల సంస్థను నిర్మించి కార్యదర్శిగా ముందుకు నడిపారు. ఇలా నిరంతర సాహిత్య జీవిగా జీవించిన అనిశెట్టి రజిత ధన్య జీవి. యువ తరానికి ఆదర్శం. నా 75వ జన్మదిన సందర్భంగా జీవన సంచారి మనోవిహారి అనే కవితాత్మక శీర్షికతో తన ఆత్మీయతను పంచుకున్నారు. బహుజన బీసీ, మహిళా ఉద్యమాలలో సావిత్రి బాయి ఫూలే వారసత్వాన్ని కొనసాగించిన అనిశెట్టి రజితకు జోహార్లు. నివాళి.



- యుగకర్త
సామాజిక తత్వవేత్త
బి ఎస్ రాములు
తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ
కమిషన్ చైర్మన్
శతాధిక గ్రంథకర్త

# తెలంగాణ ప్రాంతం గర్వించదగ్గ శిల్పి బైరోజు

- బైరోజు చంద్రశేఖర్‌ను సన్మానించిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 12 (జనంసాక్షి) :** ఇటీవల సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నుండి శిల్పకళా రంగంలో ప్రతిభా పురస్కారం అందుకున్న వనపర్తికి చెందిన శిల్పి బైరోజు చంద్ర శేఖర్ ను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో విభిన్న రంగాలలో ప్రతిభను సాధించిన కళాకారులు ఎంతో మంది ఉన్నారని అలాంటి వారు వెలుగులోకి రావలసిన అవసరం ఉందని అన్నారు. వంశపారంపర్యంగా వస్తున్న శిల్పకళను చంద్ర శేఖర్ చిన్ననాటి నుండి నేర్చుకొని ఎన్నో దేవాలయాలకు వందలాది విగ్రహాలను తయారు చేయడం అభినందనీయమని అన్నారు. నలభై ఏళ్లకు పైగా సాగిన శిల్పకళా జీవితంలో ఇలాంటి అవార్డులను అందుకోవడం కొత్త ఉత్సాహాన్నిస్తుందని, కొనియాడారు. శిల్పిగా, సాహితీవేత్తగా, పరిశోధకుడిగా బహుముఖీయమైన ప్రతిభ కనపరిచిన బైరోజు చంద్ర శేఖర్ మరిన్ని పురస్కారాలు అందుకోవాలని తమ ఆకాంక్షను తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి, ఉమామహేశ్వరరావు, వనపర్తి సీఐ. కృష్ణయ్య,



స్పెషల్ బ్రాంచ్ సిఐ, నరేష్, వనపర్తి జిల్లా విశ్వకర్మ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, మారోజు తిరుపతయ్య, బి.యాదగిరి, మాజీ కౌన్సిలర్, బ్రహ్మ చారి, సుగుణబ్రహ్మయ్య, సత్యం, ఈశ్వరాచారి, శ్రీనివాసులు, డా.శ్యాంసుందర్,రమేష్, రామ్మోహన్, యాదగిరిచారి, మాధవాచారి తదితరులు పాల్గొన్నారు.

**చదువుల భార్గవిని సన్మానించిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ని పూర్తి చేసి అందులో ఆరు బంగారు పతకాలు సాధించిన వనపర్తికి చెందిన గుండోజు భార్గవిని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి అభినందించారు.ఇటీవల జరిగిన ఆ యూనివర్సిటీ 55వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ,వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య,డిల్లీ ఐ కార్ డైరెక్టర్ అఫ్ జనరల్ డా.మంగీలాల్ జాట్ ఆమెను ఓవర్ అల్ కేటగిరీలో 4, ఫామ్ మిషనరీ, ఫుడ్ ప్రాసెసింగ్ లో 2 బంగారు పతకాలను అందజేసి సన్మానించారు.చదువులో చక్కగా రాణించి పలువురికి స్ఫూర్తిగా నిలిచిన భార్గవిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.పేద కుటుంబానికి చెందిన ఆమె తండ్రి యాదగిరి ఆచారి స్వర్ణకార వృత్తి చేస్తూ పిల్లల్ని ఉన్నత చదువులు చదివించడం చదువు పట్ల ఆయనకు గల నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో డిసి ఆర్బీ డిఎస్పీ, మహేశ్వరరావు, వనపర్తి సిఐ, కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, యం. తిరుపతయ్య, బి. యాదగిరి, బైరోజు చంద్ర శేఖర్,మాజీ కౌన్సిలర్ బ్రహ్మ చారి, సుగుణ బ్రహ్మయ్య ,ఈశ్వరాచారి శ్రీనివాసులు డా.శ్యాం సుందర్,మాధవాచారి,రమేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 12 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాలువలు, నిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉదయం కలెక్టర్ తన ఛాంబర్ లో భూసేకరణ పై అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాలో చేపడుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాలువల నిర్మాణం కొరకు ఇరిగేషన్ శాఖ ద్వారా పెట్టిన భూసేకరణ ప్రతిపాదనలకు ఇప్పటి వరకు రెవెన్యూ, సర్వే అధికారులు తీసుకున్న చర్యల పై సమీక్ష నిర్వహించారు.భూసేకరణకు సంబంధించి ఇంకా పెగ్ మార్కింగ్ చేయని వాటిని పెగ్ మార్కింగ్ చేయించడం, ఎంజాయ్మెంట్ సర్వే అయిన వాటికి అవార్డ్ పాస్ చేయాలని సూచించారు.కానాయపల్లి నిర్వాసితులకు పునరావాస కేంద్రం ఏర్పాట్ల పై సైతం సమీక్షించారు. నిర్వాసితులకు అవసరమైన సదుపాయాల పై చర్యలు తీసుకోవాలని సూచించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. కిమ్యా నాయక్, ఆర్డీఓ సుబ్రమణ్యం, జి.సెక్షన్ సూపరిండెంట్ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీని సందర్శించిన అధికారులు



**మానవపాడు, ఆగస్టు 12 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా, మానవపాడు కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన మండల స్పెషల్ ఆఫీసర్ సక్రియ నాయక్, మండల విద్యాధికారి శివప్రసాద్, ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించి విద్యార్థుల కోసం తయారుచేసిన భోజనమును అన్ని రకాలను పరిశీలించడం జరిగింది. తరగతి గదిలో విద్యార్థులను చదివించడం జరిగింది. ఆర్వో ప్లాంట్, ఫుడ్ అబ్జర్వేషన్, మొదలైనవి అన్ని అబ్జర్వేషన్ చేసి పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపాల్ జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సునీత. అరిఫా, తదితరులు ఉన్నారు.

## ప్రోత్సాహం ద్వారానే పిల్లలు ఉన్నత స్థానాన్ని అధిరోహిస్తారు



**మొయినాబాద్, ఆగస్టు 12 (జనం సాక్షి) :** పుట్టి పెరిగిన ఊరును, చదివిన పాఠశాలను మరవద్దనే ఉద్దేశంతో బాబు జగ్జీవన్ రామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దమంగళారం గ్రామంలోని ప్రైమరీ స్కూల్‌లో ఈరోజు విద్యార్థి, విద్యార్థినిలకు 17,860 రూపాయల సౌండ్ సిస్టం యూత్ ఆధ్వర్యంలో స్కూల్ యాజమాన్యానికి అందివ్వడం జరిగింది. పెద్దమంగళారం గ్రామ యువత చేసిన ఈ గొప్ప సహకారానికి గాను టీచర్లు, విద్యార్థులు ఎంతో సంతోషిస్తూ హర్షం వ్యక్తం చేస్తూ ఈ విధమైన ప్రోత్సాహాల వల్లనే పిల్లలు ఉన్నత స్థానాలకు చేరడానికి దోహదపడతాయని టీచర్లు యూత్ సభ్యులకు కృతజ్ఞత ధనులు తెలియజేయడం జరిగింది. స్కూల్లో జరిగే వివిధ కార్యక్రమాలకు 15 ఆగస్టు, జనవరి 26 ఉదయం జరిగే ప్రతిజ్ఞ, పాటల పోటీలు, ఇతర స్పీచ్ లు మాట్లాడడానికి అనువుగా ఈ సౌండ్ బాక్స్ ఉంటుందని దీనిని సరైన క్రమంలో వాడుకోవాలని యూత్ సభ్యులు తెలియజేయడం జరిగింది. మరియు స్కూల్లో ఇతర ఏ అవసరాలు ఉన్న మాకు సాధ్యమయ్యే సహాయం చేస్తూ మంచి ప్రోత్సాహాలను విద్యార్థులకు అందిస్తూ వారి ఎదుగుదలకు దోహదపడతామని బాబు జగ్జీవన్ రామ్ యూత్ అసోసియేషన్ సభ్యులు తెలియజేయడం జరిగింది.ఈ సహకారంలో యూత్ సభ్యులు అరుణ్, చెన్నయ్య, యాదగిరి, సురేష్, ప్రవీణ్, బాలకృష్ణ,శ్రీకాంత్, మిట్టు, ఉపేందర్,సింహాద్రి ఉన్నారు. ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, లక్ష్మి, బీబీ హాజ్రా, అలివేలు, ఉమాదేవి విద్యార్థి,విద్యార్థినిలు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు కొనసాగిద్దాం

- ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**బోడుప్పల్, ఆగస్టు 12 (జనంసాక్షి) :** విద్యా రంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు కోనసాగిస్తుందని అ సంఘం రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో కార్యాలయం వద్ద అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరై శ్వేతా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందే, 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్, ఆజాద్ వంటి వీరుల ఆశయ సాధన కోసం బబృద్దీన్ బాసు, ప్రేమ్ నారాయణ భార్గవ్ నాయకత్వంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని తెలిపారు.బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కోసం జరుగిన స్వాతంత్ర్య సమరంలో ఎందరో విద్యార్థి విప్లవ వీరులు "స్వాతంత్ర్యం మా జన్మహక్కు" అని నినదిస్తూ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వ విద్య పరిరక్షణ, శాస్త్రీయ విద్య, కామన్ విద్యా విధానం కోసం 90 ఏళ్ళుగా నిరంతర పోరాటాలు సాగిస్తున్న ఏఐఎస్ఎఫ్ "చదువుతూ పోరాడుతాం, చదువుకై పోరాడుతాం" అనే




నినాదంతో దేశవ్యాప్తంగా విద్యార్థి సమస్యల కోసం అలుపెరుగని ఉద్యమాలు చేస్తోందని ఆయన అన్నారు.విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమం, 18 సంవత్సరాలకు ఓటుహక్కు సాధన, మలిదశ తెలంగాణ పోరాటం, హాస్టల్ సమస్యలు వంటి అనేక పోరాటాల్లో ఏఐఎస్ఎఫ్ విజయాలు సాధించిందని పేర్కొన్నారు. శాస్త్రీయ సోషలిజం, ప్రభుత్వ విద్య, సెక్యులరిజం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఇవే ఏఐఎస్ఎఫ్ యొక్క లక్ష్యాలుగా కొనసాగుతాయని, భవిష్యత్తులో విద్య వ్యతిరేక విధానాలను అడ్డుకునే పోరాటాలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, మహేష్, ఆదిత్య, శివ, సాయి, అరవింద్, చిన్న, దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ స్ఫూర్తితో దేశ ఐక్యతకు పాటుపడదాం



- డిసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి
- సద్భావన జ్యోతి యాత్ర ఘన స్వాగతం

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 12 (జనం సాక్షి) :** సమాజంలో మత సామరస్యం, అభివృద్ధి పట్ల అవగాహన పెంచుతూ దేశ ఐక్యత కోసం పాటు పడదామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే.ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం కర్ణాటక రాష్ట్రం నుండి బయలుదేరిన రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్ర నారాయణపేట జిల్లాలో ప్రవేశించింది.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు,జ్యోతి యాత్రకు సింగారం గేట్ దగ్గర ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ సమాజంలో మతసామరస్యాన్ని కాపడేందుకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా కృషి చేస్తుందన్నారు. కుల మతలకు అతీతంగా దేశ ప్రజల్లో ఐక్యత సౌభ్రాతృత్వం పెంపొందించడం యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు.దేశ ఐక్యత శాంతి సద్భావన కోసం రాజీవ్ గాంధీ చూపిన మార్గాన్ని ప్రజలకు తెలియచేస్తు,యువతలో సామాజిక దేశభక్తి విలువలను, నాటేందుకు ఈ యాత్ర ద్వారా చైతన్యం తీసుకురావడం జరుగుతుందని వివరించారు.అనంతరం యాత్ర ను తెలంగాణ బోర్డర్ జిలాల్ పూర్ గ్రామం వరకు నిర్వహించి కర్ణాటక రాష్టానికి యాత్రను సాగనంపారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర జాతీయ అధ్యక్షులు ఆర్.దొరై, కన్వీనర్ సుజేంద్ర శెట్టి, అధ్యక్షులు శ్రీనివాసయ్య, పట్టణ అధ్యక్షులు ఎండి.సలీం, సీనియర్ నాయకులు మనోహర్ ప్రసాద్ గౌడ్, ధన్వాడ మండల అధ్యక్షులు నరహరి ముదిరాజ్,మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మహిమూద్ ఖురేషి, పిఎసిఎస్ డైరెక్టర్ మల్లేష్, యూసుఫ్ తాజ్,పళ్ళ అనిల్,ఎరుకలి వెంకటయ్య, బాపనపల్లి అంజి, మారెప్ప, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని మినీ ట్యాంక్ ఏర్పాటు చేయాలి



**మల్కాజిగిరి, ఆగస్టు 12 (జనంసాక్షి) :** బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజు విగ్రహాన్ని సఫిల్ గూడా లోని మినీ ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ జాకీయా సుల్తాన కు గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తిని నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బత్తిని నరసింహా గౌడ్ మాట్లాడుతూ, 300 సంవత్సరాల క్రితమే బహుజనులను ఏకం చేసి 36 సంస్థానాలకు వివిధ కులాల నాయకులను రాజులను చేసి చివరగా గోల్కొండ కోటపై మొగల్ చక్రవర్తిని ఓడించి పరిపాలన కొనసాగించిన మహా వీరుడని కొనియాడారు, కాబట్టి ఆ మహానీయుని చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈనెల 18వ తేదీన జరుగు జయంతి ఉత్సవాలకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం నాయకులు వాసగొని శ్రీనివాస్ గౌడ్, జీనుకుంట్ల రమేష్ గౌడ్, జీడి బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు కాసర్ల నాగరాజు, సంపత్ గౌడ్, జీడి నవీన్ గౌడ్, జీడి సాయి గౌడ్, ముద్దాపురం కొండల్ గౌడ్, నగేష్ గౌడ్, నూనె ముందల నరహరి, బి శ్రీనివాస్ గౌడ్, కామేశ్వర్ గౌడ్, ఏడుకొండలు గౌడ్, బిక్షపతి గౌడ్, జీడి సాయి గౌడ్, బి రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన గుంతను మూయండి



**జడ్చర్ల, ఆగస్టు 12 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు వాల్మీకి నగర్ లో గవర్నమెంట్ జూనియర్ కాలేజీ రోడ్డులో వాటర్ పైప్ లీకేజీ అవుతుందని మరమ్మత్తు కోసం తీసిన గుంతను మూసివేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీవాసులు మంగళవారం మీడియాకు తెలిపిన వివరాల మేరకు కాలేజీ రోడ్డులో దాదాపు 40 రోజుల క్రితం వాటర్ పైపు లీక్ అవుతుందని మరమ్మత్తుల కోసం గుంత తీసి నేటి వరకు ఆ గుంతను మూయలేదని, ముఖ్యంగా ఈ రోడ్డులో కాలేజీ ఉండడం వలన విద్యార్థుల రాకపోకలతో పాటు, ద్విచక్ర వాహనాలు, పాఠశాల బస్సులు, భారీ వాహనాలు వెళుతుంటాయి, ఇప్పటికే ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలైన సంఘటనలు చోటు చేసుకున్నాయని, వాటర్ పైప్ లీకేజీ వలన నీరు రోడ్డుపై వృధాగా వెళుతుందని, ఇప్పటికైనా వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి వాటర్ పైపు లీకేజీ మరమ్మత్తులు చేపట్టి గుంతను మూసివేయాలని కోరారు.

# పేదల ఆరోగ్యాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్

- సర్కారు నిర్లక్ష్యంతో 12వ స్థానానికి దిగజారిన టీ హబ్
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధ్వజం

**వనపర్తి, ఆగస్టు 12 (జనంసాక్షి) :** పేదల ఆరోగ్యాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నదని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ క్రిటికల్ కేర్ సెంటర్ ను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను, సిబ్బంది స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వనపర్తి ప్రభుత్వ టీ హబ్ డయాగ్నోస్టిక్ సెంటర్ సిరిసిల్ల తర్వాత రెండోస్థానంలో ఉండేదని పర్యవేక్షణ లేకపోకపోవడం సరైన నిధులను కేటాయించకపోవడం వలన 12వ స్థానానికి పడిపోయిందని విమర్శించారు.టీ -డయాగ్నస్టిక్ లో 134 టెస్టులు చేయాల్సి ఉండగా ప్రస్తుతం జరుగుతున్నది 95 టెస్టులు మాత్రమేనని,కార్డియాలజిస్ట్ లేక 2డి ఎకో మిషన్ డీఎంహెచ్ఓ కార్యాలయంలో పెట్టారని ఎద్దేవా చేశారు. రేడియాలజిస్ట్ కూడా లేక పోవడం అధికార పార్టీ ప్రతి నిధుల అసమర్థతకు నిదర్శనం అన్నారు.షుగర్ టెస్టులకు వాడే రీ ఏజెంట్స్ కూడా అయిపోయి, నాగర్ కర్నూలు నుండి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని,అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే షుగర్ టెస్ట్



చేస్తున్నారని అన్నారు. ప్రతి గర్భిణికి మూడు రకాల థైరాయిడ్ టెస్టులు చేయాల్సి ఉండగా దానికి సంబంధించిన మిషన్ మరమ్మతులో ఉండడంతో టెస్టులు చేయడం లేదన్నారు.కనీసం పేదలు, గర్భిణులకు చిన్న చిన్న మెడికల్ టెస్టులు కూడా చేయలేని దుస్థితికి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారిందని అన్నారు. కేసీఆర్ పాలనలో దేశానికి ఆదర్శంగా ఉన్న తెలంగాణ ఆరోగ్యశాఖ కాంగ్రెస్ పాలనలో పక్క దారి పట్టిందని,పేద ఆడబిడ్డల కోసం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లను ఎత్తేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం వైద్య పరీక్షలకు కూడా నోచుకోని పరిస్థితికి వైద్యశాఖను దిగజార్చిందని అన్నారు.టీ-హబ్ డయాగ్నోస్టిక్ లో అన్ని రకాల పరీక్షలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, రేడియాలజిస్ట్, కార్డియాలజిస్ట్ లను అందుబాటులో ఉంచాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.

అత్యవసర పరిస్థితులలో ప్రాణాలు నిలబెట్టాలనే లక్ష్యం నాదని, కొరవడిన వసతుల కల్పన కోసం ఆరోగ్యశాఖమంత్రికి లేఖ రాస్తానని వెల్లడించారు. అనంతరం జిల్లా కేంద్రములో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(మాత శిశు సంరక్షణ కేంద్రం)ను వార్డుల వారిగా కలియ తిరుగుతూ రోగులను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు సావధానంగా విని వైద్యులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది రోగులతో ఆప్యాయంగా,వినమరంగా మాట్లాడాలని పరుష పదజాలం వాడరాదని హెచ్చరించారు. గర్భిణులు,నవజాత శిశువులను ఆప్యాయంగా పలకరించి తల్లుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నిరంజన్ రెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ పి రమేష్ గౌడ్,నందిమల్ల. అశోక్,గంధ పరంజ్యోతి,విజయ్ కుమార్,ఉంగ్లం తిరుమల్,నాగన్న యాదవ్,హేమంత్ ముదిరాజ్, చిట్యాల రాము, సుగూర్.మురళి సాగర్,గులాం ఖాదర్ ఖాన్,జోహెబ్ హుస్సేన్,చిట్యాల.రాము, నీలస్వామి, స్టార్.రహీమ్, హారీఫ్, బాగ్యరాజ్,చంద్రశేఖర్, గొర్ల ప్రేమ్ కుమార్, సూర్యవంశం మునికుమార్, బాలరాజు, అలీం, లక్ష్మణ్ గౌడ్, శివ గౌడ్, కుమ్మరి రామస్వామి ఉన్నారు.

## చెత్త, చెదారాన్ని వెంటనే తొలగించండి

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, ఆగస్టు 12 (జనం సాక్షి) :** హయత్ నగర్ డివిజన్ శుభోదయ కాలనీ లో వరద నీటి కాలువ వద్ద చెట్లు, చెత్త, చెదారం చేరి వర్షపు నీరు వెళ్లకుండా అడ్డుగా ఉండడంతో, వర్షాలు పడినప్పుడల్లా వర్షపు నీరు కాలనీ రోడ్లపై నిలిచి కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీ వాసులు తెలపడం తో కార్పొరేటర్ ఆదేశాలతో హైడ్రా సిబ్బంది వరద నీటి కాలువ వద్ద ఉన్న చెత్త, చెదారాన్ని జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్ ఉన్నటువంటి వరద నీటి కాలువల వద్ద ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని శుభ్రపరచాలని హైడ్రా సిబ్బందికి వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎర్రవెలి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు నర్సింహా, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 12 (జనం సాక్షి) :** ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నారాయణపేట కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.సురేష్,చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి అన్నారు. నారా యణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మంగళవారం నారాయణ పేట జిల్లా దమరగిద్ద మండ లంలో చాకలోనిపల్లె గ్రామం లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ విజ్ఞాన సదస్సును పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.సురేష్, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో రాజ్యాం గం ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించిందన్ని అన్నారు. ప్రజలు వాటిపై అవగాహన కలిగి ఉన్నప్పుడే తమ హక్కులను నిర్భయం గా పొందుతారని తెలిపారు. అలాగే మాదక ద్రవ్యాల వాడ కం ఒక ప్రమాదమైన వ్యసన ము. ఈనాటి యువతరాన్ని దారి మళ్ళించి చెడు మార్గా ల్లో నడిపిస్తున్న దురలవా ట్లలో మాదక ద్రవ్యాల విని యోగం తీవ్రమైనది. ధూమ పానం, మద్యపానం వంటి వ్యసనాల కన్నా తీవ్రమైన ప్రభావకాలు.మాదక ద్రవ్యాల మత్తు మందులు పండించే వారు, వ్యాపారం చేసేవారు, కలిగివున్నవారు చట్టపరంగా కఠినంగా శిక్షార్హులు. మాద కద్రవ్యాలు మద్యానికి బానిస కావడం వ్యక్తులను మాత్రమే కాకుండా, వారితో సంబంధం ఉన్న వారందరి జీవితాన్ని, నైతికతను కూడా తీవ్రంగా ప్రభావితంచేస్తుందన్నారు..ప్రజలందరు సమానమే ఉన్న వాళ్ళు, పేదవాళ్ళు అని తేడా లేదు, పేదరిక నిర్మూలనా, సంక్షేమ పథకాలు, సామాజిక భద్రతా,ప్రజలు చైతన్యంగా ఉంటేనే అన్ని హక్కులు సాధ్యమవుతయీ అవగాహ నా చేసారు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయాన్ని ప్రజల వద్దకు పొందవచ్చుఅన్నారు. చిన్న పిల్లలకు 18 ఇయర్స్ నిండకముందే వారికీ పెళ్లిళ్లు చేస్తున్నారనితెలిపారు .అక్షరాస్యత, చట్టపరమైన అవగాహ న ముఖ్యంగా, సమాజంలోని బలహీన వర్గాలకు హక్కులు, బాల్యవివాహాలు, బాల కార్మిక చట్టాలు, తమ పిల్ల లకు చిన్నవయస్సులో పెళ్లిళ్లు చేస్తే పెద్దవారిదే తప్పుగా తల్లితండ్రుల నిర్వహణ, స్త్రీ మరియు పురుష ఆధిక్యత, మహిళలకు రక్షణ చట్టం ఉన్నదని నిత్యవసర సరు కుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదుల ను జాగ్రత్తపరచుకొని నష్టం వారిని ఎదుర్కోకుండా తమను తాను కాపాడుకోవా లని తెలిపారు.న్యాయప రమైన రక్షణ, చట్టపరమైన అవగాహన, ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాల న్నారు.అమలు వంటివి న్యాయ సేవా సంస్థ చట్టాలపై ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి అమలు వంటివి, న్యాయ సలహాల కోసం 15100 నెంబర్ కు ఫోన్ చేసి తమ సమస్యను చెప్తే ఈ సంస్థలో పరిష్కారం చూపడం జరుగుతుందని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పంచాయత్ సెక్రటరీ రమీజా బేగం, ఏఈఓ అజయ్ కుమార్, వెంకట్రాములు గౌడ్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ,పార లీగల్ వాలంటీర్, కృష్ణ వేణి, ఇందిరమ్మ, గ్రామా ప్రజలు పాల్గొన్నారు.

## డాక్టర్ ఎంఎస్ పాషాకు "సేవా రత్న" పురస్కారం



**చేర్యాల, ఆగస్టు 12 (జనంసాక్షి) :** కరాటే పాషాకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాదులోని రవీంద్ర భారతిలో "హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్" వారి ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు, కరాటే సీనియర్ మాస్టర్ డాక్టర్ మొహమ్మద్ సాజిద్ పాషా కు సేవారత్న పురస్కారము అందజేసి శాలువాతో సన్మానించారు. గత 36 సంవత్సరాలుగా ఎందరినో విద్యార్థిని విద్యార్థులకు కరాటే శిక్షణలో జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయిలలో గుర్తింపు తెప్పించిన సుదీర్ఘ శ్రమను గుర్తించారు. మార్షల్ ఆర్ట్స్ లో విశేష కృషి సేవలు అందించిన పాషాను సేవారత్న అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా స్వర్ణ గిరి దేవాలయం ఫౌండర్ మానేపల్లి రామారావు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్, కలువ సుజాత, హ్యూమన్ రైట్స్, నేషనల్ ఇన్చార్జి బీరెల్లి చంద్రశేఖర్ గుప్తా, పాల్గొన్నారు. పాషాను ఆకునూరు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## చిన్నశంకరంపేటలో బీజేపీ నాయకుల అరెస్టు



**చిన్నశంకరంపేట, ఆగస్టు 12 (జనం సాక్షి) :** రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పెద్దమ్మతల్లి కుంకుమార్చనలో పాల్గొనేందుకు మంగళవారం చిన్నశంకరంపేట నుండి విశ్వహిందూ పరిషత్ బిజెపి నాయకులు వెళుతుండగా, అక్రమంగా పోలీసులు అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని ఆరోపించారు.ఈ చర్యను బిజెపి నాయకులు ఖండించారు. అరెస్ట్ అయినా వారు జిల్లా కార్యవర్గ సభ్యులు బాగాగౌని సురేష్ గౌడ్, రొండ్ల నరేందర్ రెడ్డి మండల జనరల్ సెక్రటరీ.మూర్తి శంకర్ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు,తాళ్ళ శివశంకర్ మండల ఓబీసీ అధ్యక్షులు, నీళ్ల శామ్ విహె చ్ పి జిల్లా సెక్రటరీ ఉన్నారు.

## బంద్‌కు సహకరించిన విద్యాసంస్థలకు, విద్యార్థులకు కృతజ్ఞతలు

● జేఏసీ చైర్మన్ డాక్టర్ ఆర్. పరమేశ్వర్

**చేర్యాల, ఆగస్టు 12 (జనంసాక్షి) :** నేటి విద్యాసంస్థల బంద్ సంపూర్ణంగా విజయవంతంగా కొనసాగడం ప్రజల ఆకాంక్షకు నిలువెత్తు నిదర్శనమని, సహకరించిన విద్యాసంస్థల యజమాన్యాలకు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం జేఏసీ తలపెట్టిన విద్యాసంస్థల బంద్ లో భాగంగా సంపూర్ణంగా విజయవంతం కావడంతో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల కొండాపూర్, కూటిగల్ తండాలు మొదలుకొని గురువన్నపేట, తపాస్ పల్లి వరకు పల్లెల నుండి పట్టణాల వరకు నాలుగు మండలాల పరిధిలోని 115 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలలో యజమాన్యాలు, విద్యార్థులు వంద శాతం సంపూర్ణంగా సహకరించారని, దాదాపు పరోక్షంగా మద్దతు పలికిన 30 వేల మంది తల్లిదండ్రులకు, విద్యా సంస్థల



యజమాన్యాలకు ప్రతి ఒక్కరికి జేఏసీ కృతజ్ఞతలు తెలుపుతుందన్నారు. ఇప్పటికైనా అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ ఈ సమస్యను ప్రజల ఆకాంక్ష కోణంలో చూడాలి తప్ప ఓట్ల కోసం, రాజకీయ కోణంలో కాకుండా ఎలాంటి కాలయాపన చేయకుండా ప్రజల తక్షణ అవసరంగా గుర్తించి రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు చేత మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. రెవెన్యూ డివిజన్ వచ్చేంతవరకు త్వరలో కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, పిల్లి చంద్రం, పోలోజు వెంకటాద్రి, ఈరి భూమయ్య,జంగిలి యాదగిరి, వలబోజు నర్సింహా చారి, కత్తుల భాస్కర్ రెడ్డి, నంగి కనకయ్య, పొనుగోటి శ్రీనివాస్ రెడ్డి, గూడెపు సుదర్శన్, ఆరుట్ల లింగం, సత్తాల మహేష్, పోషబోయిన పరమశేఖర్, లింగంపల్లి బాబు, మద్దూరి కనకయ్య, బండారి సిద్దయ్య, కత్తుల లక్ష్మారెడ్డి, శనిగరం శ్రీనివాస్,ఘనపురం అంజయ్య, శెట్టే శ్రీకాంత్, పుల్ల ఆంజనేయులు, పుల్ల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

### కొమురవెల్లిలో విద్యాసంస్థల బంద్ సక్సెస్



**కొమురవెల్లి, ఆగస్టు 12 (జనం సాక్షి) :** చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జేఏసీ తలపెట్టిన విద్యాసంస్థల బందు సంపూర్ణంగా వంద శాతం సక్సెస్ అయ్యింది. ప్రైవేట్ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ చేయగా ప్రభుత్వ విద్యాసంస్థలు ఉదయం నుండి జేఏసీ నాయకులు పాఠశాలలకు వెళ్లి తరగతులు బహిష్కరించారు. ఈ సందర్భంగా కొమురవెల్లి మండల జేఏసీ నాయకులు కూడిక్యాల బాల్ మోహన్, బూరుగు సత్తయ్య గౌడ్, మల్లం మంజయ్యలు మాట్లాడుతూ.. ఎంతో ఘనమైన చరిత్ర గలిగిన చేర్యాల ప్రాంతం రోజురోజుకు కనుమరుగైపోయి నియోజకవర్గాన్ని తాలూకా కేంద్రాన్ని కోల్పోయిందని, చేర్యాలకు పూర్వ వైభవం తీసుకురావాలంటే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడమే ఏకైక మార్గమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కాలయాపన చేస్తే ప్రజలు తరిమికొట్టక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చేర్యాల ప్రాంతం పై ప్రత్యేక దృష్టి పెట్టి ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికను ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున జేఏసీ ఉద్యమస్తుందని తెలిపారు. విద్యాసంస్థల బందుకు సహకరించిన యజమాన్యాలకు, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు జేఏసీగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

## విద్యాబోధనలో వినూత్న బోధనా పద్దతులు పాటిద్దాం

● కాంప్లెక్స్ అధికారి గణేశ్ సింగ్



**కృష్ణ, ఆగస్టు 12 (జనం సాక్షి) :** విద్యా బోధనలో వినూత్న పద్దతులు పాటించాలని గణేష్ సింగ్ అన్నారు. మంగళవారం గుడేబల్లూర్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గణేశ్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్ బోధిస్తున్న 5వ తరగతి తెలుగు మన జెండా పాఠ్యాంశాన్ని పరిశీలించారు. తరగతి బోధనలో విద్యార్థులతో పలకరింపు, శీర్షిక ప్రకటన,ధ్వని గుర్తింపు, అక్షర గుర్తింపు, విభిన్న ప్రశ్నలతో పాఠ్యాంశ వివరణను ఆసక్తిగా తిలకించి, తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ యందు వివరాలు నమోదు చేశారు. తదనంతరం విద్యార్థులతో మన జెండా పాఠ్యాంశం గురించి వివిధ ప్రశ్నలు అడిగే సమాధానాలు రాబట్టి అభినందించారు. విద్యార్థులచే పఠనం చేయించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్,ఉపాధ్యాయులు భారతి,రవి కుమార్,ఆస్మా నిషాత్,పద్మావతమ్మ మరియు పాఠశాల సిబ్బంది యండి సోఫీ, శివమ్మ,మధ్యాహ్న భోజన సిబ్బంది పద్మమ్మ, నర్సమ్మ, తదితరులు ఉన్నారు.

## బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

**చిలప్‌చేడ్, ఆగస్టు 12 (జనంసాక్షి) :** మండలంలోని బిజెపి నాయకుల ముందస్తు అరెస్టు చేసిన ఎస్సై నర్సింలు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్ లోని పెద్దమ్మ తల్లి గుడిని కూల్చివేతను నిరసిస్తూ మంగళవారం నాడు హిందూ సంఘాల పిలుపు మేరకు హైదరాబాదులోని జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి వద్ద కుంకుమచ్చన కార్యక్రమమునకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మండల బిజెపి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేస్తూ చిలప్ చేడ్ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు నగేష్,మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ,మండల మాజీ అధ్యక్షులు దశరథ,నాయకులు సత్యం, సంతోష్ కుమార్,




తదితరులను తీసుకెళ్లారు.

## లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తాం



**జడ్చర్ల, ఆగస్టు 12 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట 2వ వార్డులో నెలకొన్న విద్యుత్ లోవోల్టేజి సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. గత సంవత్సరం అక్టోబర్ 19వ తేదీన పట్టణంలోని విద్యుత్ డిఈ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ బుక్క మహేష్ 2వ వార్డు పరిధిలో నెలకొన్న విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ నాగేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్ మహేష్ వినతి మేరకు స్పందించిన విద్యుత్ వినియోగదారుల ఫోరం లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం జడ్చర్ల డిఈ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ సిబ్బంది నరసింహులు, శ్రీనివాసులు 2వ వార్డు పరిధిలో నెలకొన్న విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిశీలించి, సమస్య పరిష్కారానికై 160 కె.వి ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీలైనంత తొందరగా ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసి లోవోల్టేజి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ లక్ష్మణ్, నాయకులు రమేష్ యాదవ్, గుండు చంద్రమౌళి, నరసింహులు, బాబు, రాజు, భాస్కర్ రెడ్డి, లైన్ మెన్ రవి తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరత తీర్చాలని బీఆర్ఎస్ ధర్నా

● తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత

**నంగునూరు, ఆగస్టు 12 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నంగునూరు మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నంగునూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, ఆయిల్ పామ్ రైతుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, నంగునూరు పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్ గౌడ్, నంగునూరు మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు బద్దిపడగ కిష్టారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కూతురు రాజిరెడ్డి, వార్డోలు వేణుచక్రవర్తి, అనగోని పరశు రాములు, చెలికాని మల్లేశం, తాళ్ళపల్లి వీరయ్య గౌడ్, చింతల రాంరెడ్డి ఉల్లి మల్లయ్య, రచ్చ సిద్ధూ, గోనేపల్లి సిద్దేశ్వర్ గౌడ్, శనివారం బాబు, బెదురు తిరుపతి, ఎం డి అజీజ్, దేవులపల్లి కనకయ్య, మ్యాక కనకయ్య, ఆరేపల్లి రాజయ్య, వర్ధోలు ఆయిలయ్య తదితరులు ఈ ధర్నాలో మాట్లాడుతూ నంగునూరు మండలం 20 వేలకు పైగా ఎకరాలలో వరి, మొక్కజొన్న, పత్తి, ఇతర పంటలు సాగయ్యాయని చెప్పారు. ఈ పంటలకు సరిపడా ఎరువులను సరఫరా చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం అయ్యిందన్నారు. పంట సాగు అంచనాలను రూపొందించుకొని అందుకు అనుగుణంగా ముందస్తుగా ఎరువులను నిలువ చేయాల్సి ఉండగా



ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఆన్లైన్ నమోదు పేరిట ఒక రైతుకు ఒక ఎకరానికి ఒక బస్తా నిబంధన విధించడం సరైనది కాదన్నారు. డిమాండ్ కు అనుగుణంగా ఎరువులను నిలువ చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇప్పటికే గత ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను పడుతున్నారని చెప్పారు. రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో రైతులు రుణ విముక్తులు కాలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులందరికీ సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఎరువుల కొరతను తీర్చకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం మండల తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

## కరీంకుంటను స్వాధీనపరుచుకున్న ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు



**శివ్వంపేట, ఆగస్టు 12 (జనంసాక్షి) :** వివాదాస్పదమైన కరీంకుంట కబ్జా ఎన్నో ఏండ్లుగా సర్వేకు నోచుకోక అపరిష్కృతంగా ఉండి సమస్య పరిష్కారం కాక పోవడంతో నిరుత్సాహానికి గురైన రైతులకు, గ్రామస్తులకు కుంట సమస్య పరిష్కారం కావడంతో ఊపిరి తీసుకొని, మోక్షం లభించినట్లు అయిందన్నారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని కొంతాన్ పల్లి గ్రామ శివారులో కొన్ని సంవత్సరాల కింద ఇదే గ్రామానికి చెందిన ఒక బడా నాయకుడు ఈ కరీంకుంటను, అలాగే కుంట శిఖాన్ని దర్జాగా కబ్జా చేసి, అందులో ఏర్పాటు చేసిన గెస్ట్ హౌస్ కు వెళ్లేందుకు రోడ్డును సైతం నిర్మించారు. గ్రామ శివారులో 341 సర్వే నంబరులో కరీంకుంట మొత్తం మూడెకరాల 27 గంటలు ఉన్నదని, అయితే కుంటశిఖం నుంచి నిర్మించిన రోడ్డును తొలగించాలని, కబ్జాకు గురైన కుంటమొత్తన్ని స్వాధీనపరుచుకోవాలని గ్రామస్తులు, రైతులు కొన్ని సంవత్సరాలుగా నిరంతరం సాగించిన పోరాటానికి మంగళవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు దిగివచ్చి, కరీం కుంటను మొత్తాన్ని సర్వే చేపట్టారు. ఇందులో ఇరిగేషన్ డీ ఈఈ బుజ్జిబాబు, ఏఈ, మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ కిషన్, ప్రభుత్వ సర్వే అరుణ్ కుమార్, ఇరిగేషన్ శాఖకు చెందిన లష్కర్లు అక్కడికి చేరుకొని కుంటా మొత్తం ను సర్వే చేపట్టి హద్దులు నిర్ధారించడం జరిగిందని నర్సాపూర్ డీఈఈ బుజ్జి బాబు తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే చేపట్టి మూడు ఎకరాల 27 గుంటల భూమిని తమ స్వాధీనంలోకి తీసుకోవడం జరిగిందని, అదేవిధంగా శిఖంలో నుంచి వేసిన రోడ్డును తొలగించవలసిందిగా ఆదేశించామని ఆయన పేర్కొన్నారు. ఈ రోడ్డును తొలగించని పక్షంలో తమ శాఖపరంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈఈ పేర్కొన్నారు. ఈ సర్వేలో గ్రామస్తులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల గైర్హాజర్‌పై కలెక్టర్ ఆగ్రహం

- ఆశ్రమ పాఠశాల తనిఖీతో వెలుగులోకి..



జయశంకర్ భూపాల పల్లి బ్యూరో, (జనంసాక్షి): ఉపాధ్యాయుల గైర్హాజరు కావడం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూపాలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గిరిజన అశ్రమ పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పరిసరాలను పరిశీలించి, ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. గైర్హాజరైన ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న ఉపాధ్యాయులు కూడా పొంతన లేని సమాధానాలు చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కారణం లేకుండా గైర్హాజరు కావడం, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ లకు తాళాలు వేసి ఉండడం గమనించిన జిల్లా కలెక్టర్ మరొకసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి లక్ష్యాల గురించి అడిగి తెలుసుకుని బాగా చదవాలని సూచించారు. విద్యార్థి లక్ష్య సాధనకు 10వ తరగతి మొదటి మెట్టు అని ప్రతి విద్యార్థి బాగా చదవాలని, మంచి మార్కులు సాధించాలని సూచించారు. వంటగదిని పరిశీలించి భోజనం ఏవిధంగా ఉందో పరిశీలించారు. స్టోర్ రూమ్ లో సామాన్లు భద్రపరచడానికి అవసరమైన ర్యాక్ లు అందిస్తామని తెలిపారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వార్డెన్ ను ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆయన తెలిపారు. అంతకుముందు పక్కనే గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని రోగుల హాజరు పట్టిక, ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించి జరుగుతున్న వైద్య సేవలపై వైద్యులను, రోగులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవసరమైన వ్యాక్సిన్లు, ఇతర మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఎంహెచ్ఓ శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిఓ నాగరాజు, ఆర్.ఐ రామస్వామి, హాస్టల్ వార్డెన్ సమ్మయ్య, డాక్టర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- అత్యవసర సహాయార్థం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 18004253424 జిడబ్ల్యూఎంసీలో 18004251980
- 9701999676 నెంబర్ల ఏర్పాటు
- టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్



వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 12 (జనంసాక్షి): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదనపు కలెక్టర్, జిల్లా, మండల స్థాయి అధికారులు, తహసిల్దార్లతో టెలీ కాన్ఫెరెన్స్ ద్వారా సోమవారం రాత్రి భారీ వర్షాలు కూరవడంపై జిల్లాలోని అన్ని మండలాల్లో పరిస్థితులను సమీక్షించి సమర్థవంతంగా నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల కారణంగా అత్యవసర సహాయార్థం ప్రజల కొరకు వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ 1800425 3424 టోల్ ఫ్రీ నెంబర్‌కు 9154252936 మొబైల్ నంబర్‌కు అదేవిధంగా వరంగల్ పట్టణానికి సంబంధించి జిడబ్ల్యూ ఎంసీ ప్రధాన కార్యాలయం లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ 18004251980 టోల్ ఫ్రీ నెంబర్ కు 9701999676 నెంబర్లకు సంప్రదించాలని అన్నారు.జిల్లా వ్యాప్తంగా జిల్లా మండల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ముఖ్యంగా తహసీల్దారులు, ఆశావర్కర్లు, అంగన్వాడి వర్కర్లు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తాసిల్దార్లు, ఎంపీడీవోలు తమ మండల పరిధిలోని గ్రామాలు జలమయమయ్యే ప్రాంతాల్లో ఎటువంటి ఆటంకాలు కలగకుండా పర్యవేక్షిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద సంకేత బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయ్యే అవకాశం ఉంటుందని, రోడ్డు రవాణా విద్యుత్ సరఫరాలో అంతారం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా రెవెన్యూ, విద్యుత్, రోడ్ల భవనాల శాఖ అధికారులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టాలని, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయితీ శాఖల ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్ర మాలు చేస్తూ ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేపట్టాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు వారివారి పరిధిలోని చెరువులను నిత్యం పర్యవేక్షిస్తూ ఏదైనా అత్యవసర మరమ్మతులు ఉన్నచో యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలన్నారు. వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా అధికారులు కార్యస్థానంలో ఉంటూ 24 గంటలు ప్రజలకు అందుబా టులో ఉండా లని అన్నారు. పారిశుద్ధ్య ఆరోగ్య సమస్యల పరంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ముంపు సమస్యలపై శ్రద్ధ వహించాలన్నారు. ఏమైనా అత్యవసర పరిస్థితులు ఉంటే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, వైద్య ఆరోగ్య, ఇరిగేషన్, పంచాయతీ , అగ్నిమాపక ,బల్దియా, కుడా, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు తహసిల్దారులు ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- జిల్లా ఎస్పీ జానకీ షర్మిల



నిర్మల్ బ్యూరో, ఆగస్టు11 (జనంసాక్షి) : సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం లో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.

# గిరిజనుల సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు

- 2005 కంటే ముందు పోడు భూములు సాగు చేసుకున్న వారికి పట్టాలు.
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు12 (జనంసాక్షి) : గిరిజనుల సమస్యల శాశ్వత పరిష్కారానికి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో గిరిజనుల సమస్యలపై జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్, డి.సి.పి. ఎ.భాస్కర్, దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ... గిరిజనుల సమస్యల శాశ్వత పరిష్కారానికి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం ప్రకారం 2005 కంటే ముందు నుండి పోడు భూములు సాగు చేస్తున్న అర్హులైన గిరిజనులకు పట్టాలు అందించి జీవనాధారం కల్పించడం జరుగుతుందని తెలిపారు. కొంతమంది గిరిజనులు ప్రస్తుత కాలంలో అటవీ భూమిని ఆక్రమించి పోడు వ్యవసాయ సాగు చేస్తూ పట్టాలు అడగడం జరుగుతుందని, షెడ్యూల్డ్ తెగలకు కల్పించిన హక్కుల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ మానిటరింగ్ సిస్టం ద్వారా ప్రతిరోజు పర్యవేక్షించడం జరుగుతుందని, చేపట్టవలసిన చర్యలపై అటవీశాఖ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేస్తుందని తెలిపారు. అర్హులైన గిరిజనులకు అటవీ భూములలో వెదురు సాగు చేసేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని, సాగుకు అవసరమైన మొక్కలు, కూలీల ఖర్చులు ప్రభుత్వం అందించి పంటను విక్రయించుకునేందుకు ఆయా సంస్థలతో ఒప్పందాలు చేయించి గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. పండ్ల మొక్కల పెంపకంపై రైతులకు మెలకువలు అందించి, కూలీల ఖర్చులు, మొక్కలు, సాగునీటిని అందించి పంట దిగుబడిని విక్రయించుకునేలా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 5 శాతం ఉద్యానవన పంటల సాగు జరుగుతుందని, జిల్లాలోని దేవునిపల్లి గ్రామంలో 150 హెక్టార్ల విస్తీర్ణంలో గిరిజనులతో మల్బరీ సాగు చేయించడం జరుగుతుందని తెలిపారు. మల్బరీ సాగు సంవత్సరం నుండి సంవత్సరన్నర కాలంలో దిగుబడి వస్తుందని, గిరిజనులు సమన్వయంతో ఒక సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలని, పంట సాగులో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపామని అన్నారు. పంట ఉత్పత్తి విక్రయించుకునేందుకు గిరిజన కార్పొరేషన్ ద్వారా కనీస మద్దతు ధర నిర్ణయించడం జరుగుతుందని, గిరిజనుల కోసం గోదాం, శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కోటపల్లి, వేమనపల్లిలలో మల్బరీ సాగులో ఉత్పత్తి తో పాటు దారం తయారు చేసేందుకు గిరిజన రైతులకు శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్ నగర్‌లో 'వందే భారత్' రైలుకు ఆల్ట్ ఇవ్వండి

- సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 12 (జనం సాక్షి) : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్లో వందే భారత్ రైలుకు ఆల్ట్ ఇవ్వాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కోరారు. మంగళవారం సికింద్రాబాద్ లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ వాత్సవను కలిసి వినతి పత్రం అందజేశారు. గత నెలలో వరంగల్ వచ్చిన రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే హరీష్ బాబు. జీఎంకు వివరించారు. దీంతో త్వరలోనే వందే భారత్ ట్రైన్ ను ఆపేందుకు (ఆల్ట) హామీ ఇచ్చారు. అలాగే సిర్పూర్ కాగజ్ నగర్ లో రైల్వే స్టేషన్ ఆధునికరణ చేపట్టాలని రైల్వే జీఎంను ఎమ్మెల్యే త్వరగా రు.19 కోట్లతో రైల్వే స్టేషన్లో అవసరమైన సౌకర్యాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని కిందిస్థాయి అధికారులను రైల్వే జీఎం ఆదేశించారు. అలాగే పట్టణంలోని సంజీవయ్య కాలనీ లో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని త్వరగా ఇప్పటికే రు.9 కోట్లతో టెండర్లు పూర్తి గావించినట్లు జీఎం శ్రీవత్సవ తెలిపారు. అట్లాగే చింత గూడాఇన్ గాం రైల్వే గేటును ఎత్తివేసి అండర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని చేపట్టాలని ఎమ్మెల్యే హరీష్ బాబు కోరగా రు.120 కోట్ల అంచనా వ్యయంతో త్వరలోనే టెండర్లు పూర్తి చేసి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నట్లు ఎమ్మెల్యే హరీష్ బాబుకు జీఎం శ్రీవాత్సవ హామీ ఇచ్చారు.

# చైన్‌స్నాచర్లకు రిమాండు

- మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుదీర్ రామ్ నాథ్ కేకన్



మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 12(జనం సాక్షి): ప్రజల సహకారంతో ఉత్తరప్రదేశ్ కు చెందిన ఇద్దరు చైన్ స్నాచర్లను ఒక గంటలో పట్టుకొని కేసును చేదించిన మహబూబాబాద్ జిల్లా పోలీసులు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వికాస్ కుమార్, శుభం కుమార్ ఇద్దరు నిందితులు షామిలీ జిల్లాకు చెందినవారు. వికాస్ కుమార్ గతంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో పలు దొంగతనాలు, దోపిడీలు, హత్యాయత్నం, అక్రమ ఆయుధాలు కలిగి ఉండడం వంటి పలు నేరాలలో నిందితుడిగా ఉండి జైలు శిక్షణ కూడా అనుభవించాడు. వికాస్ కుమార్, శిఖదం కుమార్ తో కలిసి దక్షిణ భారతదేశానికి (తెలుగు రాష్ట్రాలకు) వచ్చి దొంగతనాలు, దోపిడీలు చేసి అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో, షామిలీ నుండి ఢిల్లీకి వచ్చి అక్కడ నుండి కేరళ ఎక్స్ ప్రెస్ లో 9వ తేది రాత్రి విజయవాడకు చేరుకున్నారు. విజయవాడలో అక్కడ, ఇక్కడ తిరిగి మరుసటి రోజు సాయంత్రం విజయవాడ నుంచి ఖమ్మం చేరుకొని ఎలాగైనా దొంగతనాలు చేయాలనే ఉద్దేశంతో ఆ రోజు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో రెక్కీ చేసి, తెల్లవారి రోజు అక్కడ పార్కు చేసి ఉన్న పల్సర్ బైక్ దొంగతనం చేసి, అట్టి బండిమీద ఇద్దరు కలిసి మళ్లీ ఏదైనా దొంగతనం లేదా దోపిడీ చేయాలని ఉద్దేశంతో ఖమ్మం నుండి బయలుదేరి తొర్రూరు వైపుకు వచ్చారు. మార్గమధ్యలో మాటిడు చేరుకునేసరికి ఉదయము సమయంలో రోడ్డు మీద ఒంటరిగా ఉన్న మాటేడు గ్రామానికి చెందిన ముత్యం ప్రేమలీల(55) మహిళ కనబడగా, ఆమెను కత్తితో బెదిరించి, చెంప మీద కొట్టి, ఆమె మెడలో సుమారు మూడు (3) తులాల బంగారు గొలుసు లాక్కొని, తిరిగి దంతాలపల్లి వైపు వెళ్ళినారు. విషయం తెలుసుకున్న దంతాలపల్లి బ్లూ కోల్ట్ కానిస్టేబుళ్లు ఆకుల గణేష్, మరో కానిస్టేబుల్ కె. లోకేష్, వారిని వెంబడించగా మద్దిరాల సిఐఎస్ పరిదిలో వేములపల్లి వైపు పారిపోగా విషయం తెలుసుకున్న దంతాలపల్లి ఎస్సై పి రాజు , అక్కడి గ్రామస్తులు మల్లం లింగయ్య, పాక సాయి, పాక ఉదయ్, బిక్షపతి అని వారికి ముందస్తుగా సమాచారం చేరవేసి, ఇంతలో అక్కడికి చేరుకున్న తొర్రూర్ ఎస్సై ఉపేందర్, దంతాలపల్లి ఎస్సై రాజు మరియు అందరూ కలిసి పై నేరస్తులను పట్టుకోవడం జరిగింది. సదరు నిందితుల నుండి పల్సర్ బైక్, 27 గ్రాముల గోల్డ్ రికవరీ చేయడం జరిగిందన్నారు. నిందితులను పట్టుకోవడంలో సహకరించిన ప్రజలకు, బ్లూ కోర్ట్ కానిస్టేబుల్ గణేష్, లోకేష్, చొరవ చూసిన ఎస్సై తొర్రూర్ మరియు దంతాలపల్లి లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల ఆకస్మిక తనిఖీ

- లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడిన కలెక్టర్



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : జిల్లాలో ఇళ్ల నిర్మాణపు జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు ఎలా జరుగుతున్నాయి, ఇప్పటి వరకు ఎంతఖర్చు చేశారు ఇసుక ఎక్కడి నుండి తెచ్చుకుంటున్నారు ఇటుకలకు ఒక ట్రిప్ కు ఎంతఖర్చు అవుతుంది, తదితర అంశాలపై స్వయంగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, పంచాయితి సెక్రటరి లు ఇసుక ఎక్కడెక్కడ అవసరం ఉందో తెలుసుకొని, ఇసుక అందుబాటులో ఉన్న చోట వారికి కూపన్ ఇచ్చి పంపించాలని, ఇసుక ఉచితంగానే ఇస్తారని ట్రాన్స్పోర్ట్ చార్జీ లు మాత్రమే పెట్టుకోవాలని అన్నారు.ఎవరైనా డబ్బులు అడిగితే తెలియజేయాలని అన్నారు.ఆన్ లైన్ నమోదును పరిశీలించి నెట్ వర్క్ ప్రాబ్లం సరిచేసుకోవాలని తెలిపారు. కలెక్టర్ తో పాటు యం ఆర్ ఓ, ఎంపీడీవో, ఎంపీవో, లబ్ధిదారులు ఉన్నారు.

# మంచిర్యాల జిల్లాలో ఏసీబీ దాడి

- 6 వేలు తీసుకుంటూ పట్టుబడ్డ పిహెచ్‌సి జూనియర్ అసిస్టెంట్ గడియారం శ్రీనివాసులు



మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 12 (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఓ రిటైర్డ్ ఉద్యోగి నుండి, ఓ అవినీతి ఉద్యోగి 6 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే కోటపల్లి మండలం ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇంచార్జ్, అంగరాజుపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ జూనియర్ అసిస్టెంట్ గడియారం శ్రీనివాసులు, రిటైర్డ్ ఎంప్లాయ్ నుండి జిల్లా కేంద్రంలోని హోటల్ లో 6 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రిటైర్డ్ ఎంప్లాయి కి సంబంధించిన రెండు డిఏ బకాయి బిల్లులు తయారుచేసి కోటపల్లి పిహెచ్సి డీడీఓ కు ఇచ్చినందుకుగాను సంబంధిత జెట గడియారం శ్రీనివాసులు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చి డిమాండ్ ఒప్పందంలో భాగంగా అట్టి డబ్బులను శ్రీనివాసులు తీసుకునే సమయంలో ఏసిపి అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు శ్రీనివాసులు పై కేసు నమోదు చేసి కరీంనగర్ కోర్టుకు తరలించారు.

# ముదిరాజ్ పోరాట సమితికి మెపా మద్దతు

- మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్



చెన్నారావుపేట, ఆగస్టు 12(జనం సాక్షి): ముదిరాజ్ పోరాట సమితికి మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) సంపూర్ణ మద్దతు తెలిపినట్లు మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్ లో నిర్వహించిన టిఎంపిఎస్ ఆవిర్భావ సభలో పులి దేవేందర్ ఆధ్వర్యంలో మెపా వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. సభలో ముఖ్య అధితిగా పాల్గొన్న ముదిరాజ్ యువ నేత నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ పండుగ సాయన్న వారసులకు పోరాటం కొత్త కాదని పోరాడి ముదిరాజ్ హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు. టిఎంపిఎస్ పేరులోనే పోరాటం ఉందని ముదిరాజ్ హక్కుల కోసం త్వరలోనే అన్ని సంఘాలను కలుపుకొని నూతన జేఏసీ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ టిఎంపిఎస్ పోరాటానికి ముదిరాజ్ జాతి బిడ్డల హక్కుల సాధనకు మెపా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఎక్కడ పోరాటం నిర్వహించిన ఆయా జిల్లాలు, గ్రామాల్లోని మెపా బాద్యులు టిఎంపిఎస్ కు మద్దతుగా ఉంటారని తెలిపారు. అనంతరం టిఎంపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సుంకరబోయిన మహేష్ ముదిరాజ్ మాట్లాడుతూ జాతి బిడ్డలు ఉన్నతంగా ఎదగాలని రానున్న స్థానిక ఎన్నికల్లో అందరితో కలిసికట్టుగా ముదిరాజుల గెలుపు కోసం టిఎంపిఎస్ పని చేస్తుంద న్నారు. ఈ కార్యక్ర మంలో టిఎంపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పరవేణి రంజిత్, కార్యనిర్వాహక అధ్యక్షులు కాశబోయిన శేఖర్, మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిరుత వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, వరంగల్ జిల్లా అధ్యక్షులు తాళ్ళ రవీందర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు దుండి అశోక్, ములుగు జిల్లా అధ్యక్షులు అచ్చునూరి కిషన్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎలబోయిన రాజు, నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కావలి రాజకుమార్, మహబూబాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు గైరబోయిన మహేందర్, రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జి చెన్నబోయిన శ్రీనాథ్, నర్సంపేట డివిజన్ నాయకులు చేలకలపల్లి మహేందర్ ముదిరాజ్ లతో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు

# అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం

- జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండండి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : రానున్న నాలుగు రోజులపాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో భారీ వర్షాల పరిస్థితిపై మంగళవారం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబధిత మంత్రులు, ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై పలు సూచనలు అందించారు.రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని, అత్యవసరమైతేనే తప్పా సెలవులు ఇవ్వాలని, సిబ్బంది అత్యవసర సేవలకు అందుబాటులో ఉండాలన్నారు. మనుషులు, పశువులను కాపాడుకోవాలని, టాప్ నుండి బాటమ్ వరకు పోలీస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. డ్రైనేజ్ వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అత్యధిక వర్షాలు పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని, వర్షాలు, వరదల పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఎఫ్ఎం రేడియోలలో అలర్ట్ చేయాలని, పరిస్థితులనుబట్టి స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించాలని, అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ 18004251939 కు కాల్ చేయాలనీ సూచించారు.

## విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి




**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 12 (జనంసాక్షి)** : జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన ఆకస్మిక వర్షం వల్ల ఎల్లమ్మ కుంట చెరువులో నీరు పొంగి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ఆవరణంలోకి చేరడం వల్ల విద్యార్థులకి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, కేజీబివి ఆవరణలోకి వచ్చిన నీరును బయటకి పంపించాలని, శానిటేషన్ పనులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదికారులను ఆదేశించారు.మంగళవారం అర్వపల్లి కేజీబీవీని సందర్శించారు.ఈ సందర్భంగా కేజీబివి వద్ద గల ఎల్లమ్మ కుంట చెరువు నుండి నకిరేకల్ రోడ్డు వరకు కలియ తిరుగుతూ అధికారులకి పలు సూచనలు చేశారు.ఎల్లమ్మ కుంట చెరువు నుండి వరద నీరు నకిరేకల్ రోడ్డులోని తీగల చెరువు, బతుకమ్మ కుంటకి అనుసంధానం చేసి వరద నీరు ఆగకుండా చూడాలని ఇరిగేషన్, జాతీయ రహదారి అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, డిపిఓ యాదగిరి, ఎంపిడిఓ గోపి, ఇరిగేషన్ ఏఈ హరి స్వరూప్, అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలు పరిష్కరించండి



**మక్తల్, ఆగస్టు 12 (జనంసాక్షి)** : మఖ్తల్, మాగనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న తీవ్రమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరికి విజ్ఞప్తి చేశారు. ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు ఎస్. వినయ్ కుమార్ నేతృత్వంలో విద్యార్థులు మంగళవారం మంత్రికి సమస్యలను వివరించారు. మఖ్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 500 మందికి పైగా విద్యార్థులు శిథిలావస్థలో ఉన్న పాత భవనంలో పాఠాలు వింటున్నారు. పైకప్పులు ఎప్పుడు కూలిపోతాయోనన్న భయంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. అలాగే చాలా తరగతి గదుల్లో కూర్చోవడానికి బెంచీలు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళా విద్యార్థులకు 300 మందికి కేవలం 3 మరుగుదొడ్లు మాత్రమే ఉండగా, పురుష విద్యార్థులకు మరుగుదొడ్లు లేవు. దీనితో విద్యార్థులు బహిరంగ ప్రదేశాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. తాగడానికి మంచి నీరు లేకపోవడం, కళాశాల మైదానంలో వర్షాకాలంలో నీరు నిలిచి విష సర్పాలు, కీటకాలు రావడం, ప్రహరీ గోడ లేకపోవడంతో పందులు సంచరించడం వంటి సమస్యలను కూడా నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కళాశాల అధ్యక్షురాలు ఇందు, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి కిషోర్, మాగనూర్ మండల కన్వీనర్ సందీప్, అనిల్, శ్రీధర్, లింగ, నవీన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 14 తేదీన తిరంగా ర్యాలీ



**నేరేడుచర్ల, ఆగస్టు 12 (జనంసాక్షి)** : బీజేపీ కార్యాలయంలో పార్టీ నిర్ణయం మేరకు పట్టణ, మండల కమిటీల ఉమ్మడి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆగష్టు 15 స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రతి ఇంటి మీద ప్రజలు అందరు జాతీయ జెండా ఎగరవేయాలని కోరారు.అదే విదంగా దేశ విభజన సమయంలో జిన్నా కుటిల పన్నాగాం వలన 6 లక్షల మంది హిందువులను పాకిస్తాన్ లో ఊచకోత కోశారని.దానిని కనీసం నాటి నెహ్రూ ప్రభుత్వం కనీసం ఖండించలేదని సమావేశంలో వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ దుచర్యకు గుర్తుగా ఆగష్టు 14 సాయంత్రం 5:00 గంటలకు నేరేడుచర్ల లో తిరంగా ర్యాలీ చేయాలని తీర్మానం చేయడం జరిగింది. అదేవిదంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలవాలని,దానికి ఎప్పటినుండే ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించడం జరిగింది.ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి,మండల అధ్యక్షులు చింతకుంట్ల.రాజేష్ రెడ్డి,ప్రధాన కార్యదర్శులు ఏమిరెడ్డి శంకర్ రెడ్డి,కాలం నాగయ్య,ప్రోగ్రాం ఇంచార్జ్ లు తాళ్ల.నరేందర్ రెడ్డి,కుందూరు కోటి రెడ్డి ,జిల్లా కార్యవర్గ సభ్యులు సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి,సీనియర్ నాయకులు బాల వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు జగతయ్య,పార్టీ నాయకులు బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,బైరెడ్డి బక్కిరెడ్డి,హిందూజ,ఉరిమల్ల రామూర్తి,బుస్సా.విమల,వినయ్, జొన్నలగడ్డ శ్రీను,గొడ్డేటి పవన్, శానం నాగరాజు, బచ్చు నాగరాజు, బండ్లపల్లి సైదులు,ఆఫీస్ ఇంచార్జి దేవిరెడ్డి.నాగిరెడ్డి తదితరులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది.

## గంజాయి కేసులో ఇద్దరికి 20 ఏండ్ల జైలు శిక్ష

- ఒక్కొక్కరికి 2 లక్షల జరిమానా

**ఖమ్మం, ఆగష్టు 12 (జనం సాక్షి)** : గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 20 ఏండ్ల చొప్పున కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రెండు లక్షల జరిమాన విధిస్తూ. మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె. ఉమాదేవి తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జల్సాలకు అలవాటు పడి, అక్రమార్జన కోసం 2021ఏప్రియల్ 28న మోతుగూడెం నుండి కారులో 30 లక్షల విలువ చేసే 200 కేజీల గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ ఖమ్మం సమీపంలోని వి. వెంకటపాలెం వద్ద పోలీస్ చెక్పోస్ట్ ఉందని, వేగంతో కారు నడుపుకుంటూ ప్రయాణికులతో కూడిన ఆటోను బలంగా డీ కొట్టడంతో ఆటో, కారు బోల్తా పడ్డాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదంలో మృతి చెందిన ఆటో ప్రయాణికుడిని మార్చురికి, గాయపడిన వారిని ఆసుపత్రి తరలించారు. అనంతరం కారు పరిశీలించగా 200 కేజీల 100 గంజాయి ప్యాకెట్లు లభించాయి. ఇద్దరు నిండుతులను అదుపులో తీసుకోగా మరో నిందుతుడు పారిపోయాడు. ప్రస్తుతం హైదరాబాద్లోని దుండిగల్,గండిమైసమ్మ ప్రాంతంలో నివసిస్తున్న ఏ1 నిందుతుడు మల్లేష్ ఏ నాయక్ మల్లేష్ 21 సం,, గద్వాల్, మహబూబ్నగర్ జిల్లా ఏ2 నిందితుడు గడ్డం బువన్ ఏ యెరుగుంట్ల రవితేజ, 20 సం,ప్రైవేట్ ఉద్యోగం, జగిత్యాల జిల్లా కోరుట్ల ను అరెస్టు చేసి సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. పరిశీలించిన న్యాయమూర్తి నిందితులపై మోపిన అభియోగం రుజువు కావటంతో పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్కు సహకరించిన విచారణ అధికారలు అప్పటి ఇన్స్పెక్టర్ పి సత్యనారాయణ రెడ్డి, ప్రస్తుత ఇన్స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.శంకర్,జె. శరత్ కుమార్ రెడ్డి, ఎస్సై శ్రీనివాస్, కోర్టు కానిస్టేబుల్ జి.రవి కిషోర్, సాంబశివ రావు, కోర్టు లైజనింగ్ కె.శ్రీకాంత్ (ఎస్ఐ) హెూంగార్డ్ ఆఫీసర్ ఎండీ.ఆయూబ్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ తనిఖీ



**ఖమ్మం, ఆగస్టు 12 (జనం సాక్షి)** : ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ప్రాంగణంలోని సఖి కేంద్రం, వన్ స్టాప్ సెంటర్, షీ టీమ్, భరోసా కేంద్రాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భరోసా, సఖి కేంద్రాలలోని న్యాయ సలహా, మెడికల్, చిన్నారుల, కౌన్సిలింగ్ స్టేట్మెంట్ రికార్డింగ్ చేయు గదులను, రిజిస్టర్ రికార్డ్ లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సఖి వన్ స్టాప్ సెంటర్ను ఆశ్రయించిన వారి వివరాలను, బాధితులకు అందించిన న్యాయ, వైద్య, వసతి ఇతర సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకొని, సెంటర్ నిర్వాహణ తీరును కలెక్టర్ ఆరా తీశారు. ఇప్పటివరకు 2338 కేసులకు వివిధ రకాల న్యాయ సేవలు అందించినట్లు నిర్వాహకులు కలెక్టర్కు వివరించారు. సఖి వన్ స్టాప్ సెంటర్ కి వచ్చే బాధితులకు అన్ని రకాల సేవలు, సౌకర్యాలు సమకూర్చి న్యాయం అందించేలా చూడాలని కలెక్టర్ ఈ సందర్భంగా నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మహిళల రక్షణ, సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సఖి సెంటర్లు దోహదపడుతున్నాయని అన్నారు. అంతేకాకుండా సఖి కేంద్రానికి హఠాత్తుగా వివిధ కారణాలచే ఇంటి నుంచి బయటకు వచ్చిన బాధిత స్త్రీల కోసం తాత్కాలిక వసతి, అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు వారి తరుపున కేసుల నమోదు, ఎఫ్ఐఆర్ చేయించడం లాంటి సేవలు బాధిత మహిళలకు అందిస్తున్నారని కలెక్టర్ వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఆర్. అరుణ, కో-ఆర్డీనేటర్ జి. రాజకుమారి, లీగల్ కౌన్సిలర్ ఇ. అంజని, టి. శ్రావణి, కె. సరిత, యం. సుమలత, యం. పుష్పలత, యన్. నవీన్ కుమార్, సిబ్బంది, అధికారులు తదితరులు ఉన్నారు.

# నందిపేటలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- ఎంపీడీఓ, తహసీల్ కార్యాలయాల సందర్శన
- భూభారతి దరఖాస్తులపై రెవెన్యూ అధికారులతో సమీక్ష
- పీ.హెచ్.సీ, జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, ఎరువుల గోడౌన్, నర్సరీ, వెటర్నరీ హాస్పిటల్, ఫైర్ స్టేషన్ల తనిఖీ



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 12 (జనం సాక్షి)** : నిజామాబాద్ జిల్లా నందిపేట మండల కేంద్రంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రైమరీ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సహకార సంఘం ఎరువుల గోడౌన్, పశు వైద్యశాల, నర్సరీ, ఫైర్ స్టేషన్లను కలెక్టర్ సందర్శించారు. పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థుల హాజరును ఫేస్ రికగ్నేషన్ విధానం (ఎఫ్.ఆర్.ఎస్) ద్వారా చేపడుతున్నారా లేదా అని పరిశీలించారు. నూటికి నూరు శాతం ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా హాజరు అమలు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఉంటే, వెంట వెంటనే పరిష్కరించుకోవాలని అన్నారు. ఫేస్ రికగ్నేషన్ హాజరు సంపూర్ణంగా అమలు అయ్యేలా రోజువారీ పర్యవేక్షణ చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేసిన కలెక్టర్, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. టాయిలెట్స్, తాగునీటి వసతి వంటి సదుపాయాలు అవసరం అయిన పక్షంలో ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అంతకుముందు కలెక్టర్ నందిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీ.హెచ్.సీ ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, అందుబాటులో ఉన్న ఔషధ నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని తహసిల్దార్ సంతోష్ ను కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీఓ శ్రీనివాస్ రావు ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతి గురించి ఆరా తీశారు. ఈ నెల 13న చేపట్టనున్న మార్కింగ్ మహా మేళాలో లబ్దిదారులు అందరూ మార్కింగ్ పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. గ్రౌండింగ్ అయిన అనంతరం ఇళ్ళ నిర్మాణ పనులు చేపట్టి వేగంగా పూర్తి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు.

## గ్రామపంచాయతీ వద్ద నిరసన



**సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 12 (జనం సాక్షి)** : గుజ్జ గ్రామంలో గత 20 రోజులుగా తాగునీరు వాడుకనీరు రాకపోవడం, వీధి దీపాల సమస్య అనేక సమస్యలు ఉండడంతో గుజ్జ గ్రామ, బిఆర్ఎస్, బిజెపి, టిడిపి పార్టీల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గ్రామ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, గ్రామ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల కల్పించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో గుజ్జ గ్రామ పార్టీల నాయకులు గ్రామపంచాయతీ వద్ద ధర్నా చేపట్టారు, దశాబ్దాలుగా గుజ్జ గ్రామానికి, గుజ్జ నుండి చల్మడ ,గుజ్జ నుండి ఏపూరి ,గుజ్జ నుండి లింగ వారి గూడెం ,గుజ్జ నుండి కోతులారం లింక్ రోడ్లు కూడా నిర్మాణం లేదు, ఎమ్మెల్యే స్పందించి గ్రామాన్ని ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నిరసన వ్యక్తం చేశారు, స్పందించిన సంస్థాన్ నారాయణపురం మండల ఎంపీవో నరసింహారావు, కార్యదర్శి లింగస్వామి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగాదేవి సత్తయ్య, బిజెపి మండల నాయకుడు కుకుడాల మహేందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ మైలా యాదవ రెడ్డి,మాజీ మార్కెట్ డైరెక్టర్ రాచకొండ రాజు, బిజెపి మండల ఉపాధ్యక్షుడు ఎలిజాల శ్రీను,బిఆర్ఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి ఏర్పుల సైదులు, మాజీ వార్డ్ మెంబర్ చాడ రాములు, దేవాలయ మాజీ చైర్మన్ ఎనుగుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## నేరేడుచర్ల - మిర్యాలగూడ ఆర్టీసీ టికెట్ల ధరలు పునః సమీక్షించాలి



**నేరేడుచర్ల, ఆగస్టు 12 (జనంసాక్షి)** : నేరేడుచర్ల-మిర్యాలగూడకు కేవలం 15 కిలోమీటర్ల దూరం కి వసూలు చేస్తున్న టికెట్ ధరలను పునః పరిశీలించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు మిర్యాలగూడ డిపో మేనేజర్ కు మరియుఆర్టీసీ ఎండీ సజ్జనార్ కు విజ్ఞప్తి చేశారు.మంగళవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో పట్టణ ప్రజా సంఘాలకు చెందిన నాయకులతో కలిసి ఆర్టిసి బస్సు ముందునిలబడి నిరసన తెలియజేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.నేరేడుచర్ల నుంచి మిర్యాలగూడకు 15 కిలోమీటర్ల దూరంకి పల్లె వెలుగు బస్సు చార్జీ 50 రూపాయలుగా, ఎక్స్ప్రెస్ చార్జీ 60 రూపాయలుగా డీలక్స్ చార్జీ 70 రూపాయలుగా లగ్జరీ బస్సు చార్జి 95 రూపాయలుగా వసూలు చేస్తున్నారని అదే నేరేడుచర్ల నుంచి కోదాడకు 35 కిలోమీటర్ల దూరంకి కేవలం 40 రూపాయలు చార్జి మాత్రమే వసూలు చేస్తున్నారని ఇది ఎక్కడ విడ్డూరమని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ యువజన విభాగం నాయకులు రాపోలు నవీన్ నేరేడుచర్ల మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాస్ రెడ్డి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సామాజిక కార్యకర్త యారవ సురేష్ తక్కెళ్ళ నాగార్జున రామ్ సైదులు ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు ఊదర వెంకన్న బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మరాజు వెంకట్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ , ఎస్.కె నాగుల్ మీరా బత్తిని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా సహాయక చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 12 (జనంసాక్షి)** : అధిక వర్షం కారణంగా తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా సంబంధిత శాఖలు సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.సోమవారం రాత్రి తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో 180 మిమిల ఆకస్మిక వర్షం కురవటం వల్ల గ్రామంలోని వరద ప్రభావిత లోతట్టు ప్రాంతమైన 12వ వార్డులో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం పర్యటించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వలిగొండ-తొర్రూరు జాతీయ రహదారి తొండ గ్రామం వద్ద కమ్మరికుంట చెరువుకి వరద నీరు వెళ్లేందుకు కడుతున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. వరద నీరు చెరువులోకి వెళ్ళేలా ఎక్కువ మిషనరిని ఉపయోగించి అడ్డంకులను తొలగించాలని, అలాగే సర్వీస్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ హరి ప్రసాద్, ఎంపిడిఓ లాజర్, డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్,ఎంపిఓ భీమ్ సింగ్,పంచాయతీ కార్యదర్శి యాకుబ్ రెడ్డి, ఆర్ఐలు సుజిత్, జార్జిరెడ్డి,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే రాజగోపాల్ రెడ్డికి జరిగినట్టే..



**మునుగోడు, ఆగస్టు 12 (జనం సాక్షి)** : మునుగోడు మండల పరది ఎలకలగూడెం గ్రామంలో నూతనంగా 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ 9 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండడం తప్పా అని, ఈ ప్రాంతానికి అన్యాయం చేయొద్దు మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి,గతంలో నేను భువనగిరి పార్లమెంటు నుండి ఎంపీగా పని చేశాను నల్గొండ జిల్లాకు ఎమ్మెల్సీగా పని చేశాను నల్గొండ జిల్లాలో ఉన్న నియోజకవర్గాలలో మునుగోడు నియోజకవర్గం వెనుకబడి ఉంది, అభివృద్ధిలో భాగంగా మునుగోడుకు చెందవలసిన నిధులు ఒక్క రూపాయి కూడా ఆపొద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుకుంటున్నానని అన్నారు. ప్రభుత్వ దవాఖానకు పోతే పేదోడికి న్యాయం జరగాలి, ప్రైవేటు ఆసుపత్రులు ప్రైవేటు పాఠశాలలు పేదవాడి రక్తం తాగుతున్నాయి,పేదవాళ్లకు అండగా ఉండాలని నేను కష్టపడుతునాన్నని తన ఆవేదనను వ్యక్తం చేశారు.అధిష్టానం మేరకు ఏ పదవి ఇచ్చినా మునుగోడు ప్రజల కోసమే కానీ నా కోసం కాదని మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి కోసమే పాటు పడతానని నియోజకవర్గ ప్రజలకు వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, కాంగ్రెస్ పార్టీ మునుగోడు మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, వెలగలగూడెం తాజా మాజీ సర్పంచ్ సురిగి చలపతి, మాజీ ఉపసర్పంచ్ మేకల శ్రీనివాస్ రెడ్డి స్థానిక ఎస్సై ఇరుగు రవి, పంచాయత్ రాజ్ డి ఈ,యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి,పలు శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై లైంగికదాడి

- 10 ఏళ్ల జైలు, అయిదు లక్షల పరిహారం
- ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి రోజారమణి తీర్పు

**మర్రిగూడ, ఆగస్టు 12 (జనం సాక్షి)** : మర్రిగూడ మండలం లోని తిరుగండ్లపల్లి గ్రామానికి చెందిన పోలే నరేష్ అదే గ్రామానికి ఓ మైనర్ బాలికపై 2016లో బాలికపై లైంగికదాడికి పాల్పడిన నేరస్థుడికి 10ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ, ఎస్సీఎస్టీ నల్లగొండ కోర్టు అదనపు న్యాయమూర్తి ఎన్.రోజారమణి మంగళవారం సంచలన తీర్పు వెల్లడించారు. మర్రిగూడ మండలంలోని ఒక గ్రామానికి చెందిన, 14 ఏళ్ల వయసున్న బాలిక 22 ఆగస్టు 2016న బహిర్భూమికి వెళ్లగా, తిరుగండ్లపల్లి గ్రామానికి చెందిన పోలే నరేష్ ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెప్పితే తనను చంపేస్తానని బెదిరించాడు. అయినా భయపడకుండా బాలిక తన తల్లికి జరిగిన విషయం చెప్పడంతో, వెంటనే మర్రిగూడ పోలీస్ స్టేషన్ కు వెళ్లి బాధితురాలు ఫిర్యాదు చేశారు. అప్పటి మర్రిగూడ ఎస్ఐ కె.బలరాం 92/2016 ఎస్సీ నెం. 38/2017, యూ/ఎస్, 376(ఐ), 506 ఐపీసీ, ప్రకారం పోక్సో చట్టం-2012, సెక్షన్ 4 ప్రకారం కేసు నమోదైంది. నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ బాలగంగిరెడ్డి ఆ కేసును దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు వాయిదాలపై వస్తూ మంగళవారం ఫైనల్ కు వచ్చింది. ప్రస్తుత నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ దూది రాజు సాక్షదారాలతో, న్యాయమూర్తి ఎదుట ప్రవేశ పెట్టగా, జడ్జి రోజారమణి కేసు పూర్వపరాలను పరిశీలించి బీఎన్ఎస్ 376 (2) (ఎం) లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టంలోని, సెక్షన్ 5(కే) ఆర్డబ్ల్యూ 6 కింద శిక్షార్హమైన నేరాలకు పాల్పడినట్లు తేలింది. దీని ప్రకారం సెక్షన్ 235 (2) సెక్షన్ల కింద నిందితుడు నరేష్ ను కోర్టు దోషిగా నిర్ధారించింది. 10ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, పదివేల రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుందని వెల్లడించారు. అయితే బాధిత బాలిక మానసికంగా అనుభవించిన బాధకు పరిహారంగా, ప్రభుత్వం నుంచి అయిదు లక్షల రూపాయలు అందేలా చూడాలని న్యాయమూర్తి ఆదేశించారు. పోక్సో చట్టం కేసుల ఫాస్ట్ ట్రాక్ కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, వేముల రంజిత్ కుమార్, బరోసా సెంటర్ లీగర్ ఆఫీసర్, అదనపు పీపీ కల్పన, నాంపల్లి సీఐ రాజు, అనుసంధాన అధికారులు నరేందర్, మల్లికార్జున్ లను, పోలీస్ సిబ్బందిని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

## బాధితులకు భరోసాగా సఖి కేంద్రాలు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, ఆగస్టు 12 (జనం సాక్షి)** : సఖి కేంద్రాల ద్వారా మహిళల హక్కులపై అవగాహన కల్పించాలని, అన్యాయానికి గురైన బాధితులకు అండగా భరోసా కేంద్రాలు రక్షణ కల్పిస్తాయని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ప్రాంగణంలోని సఖి కేంద్రం, వన్ స్టాప్ సెంటర్, షీ టీమ్, భరోసా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భరోసా, సఖి కేంద్రాలలోని న్యాయ సలహా, మెడికల్, చిన్నారుల, కౌన్సిలింగ్ స్టేట్మెంట్ రికార్డింగ్ చేయు గదులను, రిజిస్టర్ రికార్డ్ లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సఖి వన్ స్టాప్ సెంటర్ ను ఆశ్రయించిన వారి వివరాలను, బాధితులకు అందించిన న్యాయ, వైద్య, వసతి ఇతర సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకొని, సెంటర్ నిర్వాహణ తీరును కలెక్టర్ ఆరా తీశారు. ఇప్పటివరకు 2338 కేసులకు వివిధ రకాల న్యాయ సేవలు అందించినట్లు నిర్వాహకులు కలెక్టర్కు వివరించారు. సఖి వన్ స్టాప్ సెంటర్ కి వచ్చే బాధితులకు అన్ని రకాల సేవలు, సౌకర్యాలు సమకూర్చి న్యాయం అందించేలా చూడాలని కలెక్టర్ ఈ సందర్భంగా నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మహిళల రక్షణ, సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సఖి సెంటర్లు దోహదపడుతున్నాయని అన్నారు. హింసకు గురైన మహిళలు, యువతులకు ఒకే చోట వైద్య, పోలీసు, న్యాయ సహాయం అందించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం, అవసరమైతే తాత్కాలిక వసతి కల్పించడం సఖి సెంటర్లలో చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఆర్. అరుణ, కో-ఆర్డీనేటర్ జి. రాజకుమారి, లీగల్ కౌన్సిలర్ ఇ. అంజని, టి. శ్రావణి, కె. సరిత, యం. సుమలత, యం. పుష్పలత, యన్. నవీన్ కుమార్, సిబ్బంది, అధికారులు తదితరులు ఉన్నారు.






# లాభాలకు బ్రేక్..

• నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**జనంసాక్షి:**మంగళవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 368.48 పాయింట్లు లేదా 0.46 శాతం నష్టంతో..80,235.59 వద్ద, నిఫ్టీ 97.65 పాయింట్లు లేదా 0.40 శాతం నష్టంతో.. 24,487.40 వద్ద నిలిచింది.టాప్ గెయినర్స్ జాబితాలో.. యాత్ర ఆన్‌లైన్, డబ్ల్యుఎస్ ఇండస్ట్రీస్, వెంచర్స్, రికో ఆటో, సోనాటా సాఫ్ట్‌వేర్ కంపెనీలు చేరాయి. మ్యాన్ ఇండస్ట్రీస్ (ఇండియా), మార్క్‌సాన్స్ ఫార్మా, బ్యాంకో ప్రోడక్ట్స్ (ఇండియా), పిక్స్ ట్రాన్స్‌మిషన్స్, అట్లర్ లిమిటెడ్ వంటి కంపెనీలు నష్టాలను చవిచూశాయి.

## ఎరిక్సన్, నోకియాతో బీఎస్ఎన్ఎల్ జట్టు

### యువతకు 5జీ తదితర టెక్నాలజీల్లో శిక్షణ

యువతకు నైపుణ్యాల్లో శిక్షణ కల్పించే దిశగా నాలుగు అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాలతో ప్రభుత్వ రంగ దిగ్గజం బీఎస్ఎన్ఎల్ చేతులు కలిపింది.కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం సింధియా సమక్షంలో ఎరిక్సన్ ఇండియా, క్వాల్‌కామ్ టెక్నాలజీస్, సిస్కో సిస్టమ్స్, నోకియా సొల్యూషన్స్ అండ్ నెట్‌వర్క్స్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది.5జీ, ఏఐ, సైబర్‌సెక్యూరిటీ, నెట్‌వర్కింగ్ తదితర టెక్నాలజీలకు సంబంధించిన కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చేందుకు ఇది ఉపయోగపడుతుంది. జబల్‌పూర్‌లోని భారతరత్న భీమ్‌రావ్ అంబేద్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెలికం ట్రైనింగ్‌లో ఈ కోర్సుల్లో శిక్షణనిస్తారు. తొలి దశలో రూ.1 కోటికి పైగా పెట్టుబడితో ఏటా 2,000 మంది విద్యార్థులకు ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు సింధియా తెలిపారు. కాగా, భారత్‌లో పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని విస్తరించి, భారీగా ఉద్యోగాలు కల్పిస్తామని నోకియా ఇండియా కంట్రీ మేనేజర్ తరుణ్ ఛాబ్రా తెలిపారు.

# ఇళ్ల విక్రయాలపై టారిఫ్ దెబ్బ


**భారత ఎగుమతులపై అమెరికా విధించిన అధిక టారిఫ్‌లు దేశీయ మార్కెట్లో అందుబాటు ధరల ఇళ్ల అమ్మకాలను ప్రభావితం చేయొచ్చని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ తెలిపింది.అధిక టారిఫ్‌లు చిన్న వ్యాపారాలకు విఘాతం కలిగించొచ్చంటూ.. ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులే రూ.45 లక్షల్లోపు ధరల ఇళ్ల కొనుగోలుదారుల్లో ఎక్కువగా ఉన్నట్లు గుర్తు చేసింది.**



**జనంసాక్షి:**'యూఎస్‌కు వస్తు ఎగుమతుల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈలు) అధిక వాటా కలిగి ఉన్నాయి. అధిక టారిఫ్‌లతో వీటి ఉత్పత్తులకు ఉన్న పోటీ తగ్గిపోతుంది. దీంతో వాటికి ఆర్డర్లు తగ్గుతాయి. ఆయా సంస్థల ఉద్యోగులపై ప్రభావం పడుతుంది'అని అనరాక్ వివరించింది. అందుబాటు ధరల ఇళ్ల అమ్మకాలు, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం ఇప్పటికే కనిష్ఠ స్థాయికి పడిపోయినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లో 2025 మొదటి ఆరు నెలల్లో 1.9 లక్షల యూనిట్ల ఇళ్లు అమ్ముడవగా.. ఇందులో అందుబాటు ధరల విభాగంలో విక్రయాలు 34,565 యూనిట్లుగానే ఉన్నట్లు పేర్కొంది.'రూ.45 లక్షలు లేదా అంతకంటే తక్కువ ధరల్లోని ఇళ్లు ఈ విభాగం కిందకు వస్తాయి. ఈ విభాగంపై కరోనా విపత్తు పెద్ద ప్రభావాన్నే చూపించింది. కోలుకునేందుకు ఇప్పటికీ సమస్యలు ఎదుర్కొంటోంది. ఈ విభాగం పట్ల ఉన్న కొద్దో గొప్ప ఆశలను ట్రంప్ అధిక టారిఫ్‌లు ఆవిరి చేస్తున్నాయి' అని అనరాక్ రీసెర్చ్ ఈడీ ప్రశాంత్ ఠాకూర్ వివరించారు.భారత జీడీపీలో ఎంఎస్ఎంఈలు 30 శాతం వాటా కలిగి ఉన్నాయన్న ప్రభుత్వ గణాంకాలను అనరాక్ ప్రస్తావించింది. అలాగే ఎగుమతుల్లో 45 శాతం వాటా ఆక్రమిస్తున్నట్లు తెలిపింది. అమెరికా 50 శాతం టారిఫ్‌లతో ఎంఎస్ఎంఈలు, వాటి సిబ్బందిపై గణనీయమైన ప్రభావం పడుతుందని అంచనా వేసింది. ఎంఎస్ఎంఈలు, ఎస్ఎంఈల్లో పనిచేసే సిబ్బంది అందుబాటు ధరల ఇళ్ల విభాగంలో ప్రధాన వినియోగదారులుగా ఉన్నట్లు తెలిపింది. దీంతో ఈ విభాగంలో డిమాండ్‌పై ప్రభావం పడుతుందని పేర్కొంది. ఇది కొత్త ప్రాజెక్టుల ఆవిష్కరణపైనా ప్రభావం చూపిస్తుందని వివరించింది.

# ఆఫీస్‌కు ఎలా రావాలో చెప్పిన ఇన్ఫోసిస్..

**జనంసాక్షి:**బెంగళూరులో కొత్తగా ప్రారంభించిన నమ్మ మెట్రో ఎల్లో లైన్ సర్వీసులకు భారతదేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థల్లో ఒకటైన ఇన్ఫోసిస్ మద్దతుగా నిలుస్తుంది.సుస్థిర ప్రయాణానికి మద్దతు ఇవ్వడానికి కంపెనీ ఉద్యోగులను రోడ్డు రవాణాకు బదులుగా మెట్రోలో ప్రయాణించాలని కోరింది. జయనగర్‌లోని ఆర్‌వీ రోడ్డు నుంచి ఎలక్ట్రానిక్ సిటీ ద్వారా బొమ్మసంద్రను కనెక్ట్ చేసేలా 19.14 కిలోమీటర్ల ఎలివేటెడ్ మెట్రో మార్గాన్ని ఇటీవల ప్రారంభించారు. రోడ్డు ప్రయాణానికి సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా ఈ మెట్రో మార్గాన్ని ప్రమోట్ చేస్తూ ఇన్ఫోసిస్ ఉద్యోగులకు అంతర్గత ఈమెయిల్ పంపించింది.భారీ ట్రాఫిక్ జామ్‌లతో సతమతమవుతున్న బెంగళూరులో పలు ప్రాంతాలకు సులువుగా ప్రయాణించేలా మెట్రో సర్వీసులు అందుబాటులో వచ్చిన నేపథ్యంలో ఇన్ఫోసిస్ ఈమేరకు ప్రకటన విడుదల చేసింది. కోనప్పన అగ్రహార స్టేషన్ తన ఎలక్ట్రానిక్ సిటీ క్యాంపస్‌కు కీలక నోడ్‌గా ఉంటుందని కంపెనీ తెలిపింది. స్టేషన్ నుంచి ఇన్ఫోసిస్ మెట్రో ప్లాజా వరకు ప్రత్యేకమైన స్కైవాక్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పింది. ఇది క్యాంపస్‌కు ప్రత్యక్ష, సురక్షితమైన ప్రవేశాన్ని అందిస్తుందని పేర్కొంది. ఉద్యోగుల కోసం మెట్రో ప్లాజా వద్ద ఐడీ ఆధారిత ఎంట్రీ ప్రోటోకాల్స్ పాటించనున్నట్లు స్పష్టం చేసింది.




# బంగారంపై సుంకం లేదు: ట్రంప్

**జనంసాక్షి:**బంగారం దిగుమతులపై అదనపు సుంకాలు ఉండవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల ఆయన విధించిన సుంకాల పెంపు బంగారు కడ్డీలకు వర్తిస్తుందా?, లేదా?..అనే దానిపై గందరగోళం నెలకొనగా కొన్ని రోజుల తర్వాత ఈ ప్రకటన చేశారు. ఈ విషయాన్ని ట్రంప్ సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్ట్ చేశారు.బంగారం మీద సుంకాలు విధించడం వల్ల.. వీటి ధరలు మరింత ఎక్కువవుతాయి. ఇది ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టి బంగారంపై సుంకాల విషయంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. కాగా ట్రంప్ చేసిన సోషల్ మీడియా పోస్ట్ తరువాత బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి.ట్రంప్ పోస్ట్ తర్వాత.. యూఎస్ గోల్డ్ ఫ్యూచర్స్ రేటు ఔన్సుకు 2.4 శాతం తగ్గి 3,407 డాలర్లకు చేరుకుంది. దీంతో బులియన్ మార్కెట్‌లో బంగారం ధర 1.2 శాతం మేర తగ్గి 3,357 డాలర్ల వద్ద నిలిచింది. గోల్డ్ మైనింగ్ కంపెనీల షేర్స్ కూడా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది.బంగారం ధరల పెరుగుదలకు బ్రేక్ పడింది. ప్రస్తుతం గోల్డ్ రేటు తగ్గుముఖం పడుతోంది. ఈ రోజు కూడా పసిడి ధరలు గరిష్ఠంగా రూ. 880 తగ్గింది. దీంతో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 101400 వద్దకు చేరింది. 22 క్యారెట్ల ధర రూ. 800 తగ్గి.. రూ. 92950 (10 గ్రామ్స్) వద్ద నిలిచింది.




# టెలికాం టారిఫ్‌లు పెంపు?

**జనంసాక్షి:**ఈ ఏడాది చివరికల్లా టెలికాం ఆపరేటర్లు కొత్త టారిఫ్ పెంపును ప్రకటిస్తారని పరిశ్రమ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. దాంతో మళ్లీ అధిక రీఛార్జ్ బిల్లులు చెల్లించాల్సి వస్తుందని భారతీయ మొబైల్ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అక్టోబర్ 2025 నుంచి జనవరి 2026 మధ్య ఈ పెరుగుదల ఉండొచ్చని ఇక్రా ప్రతినిధి అంకిత్ జైన్ తెలిపారు. అయితే ఈ పెంపు టెలికాం కంపెనీని అనుసరించి మొత్తం టారిఫ్‌లో 15-20% కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని, ఇది 2024లోని పెంపు కంటే తక్కువేనని ఆయన అభిప్రాయపడ్డారు.'టెలికాం కంపెనీల టారిఫ్ పెంపు తప్పదు. మొత్తం టారిఫ్‌లో ఇది 15-20 శాతం కంటే తక్కువగా ఉండొచ్చని అంచనా వేస్తున్నాం. 2025 ఆర్థిక సంవత్సరంలో ఒక వినియోగదారుడి నుంచి కంపెనీలకు సమకూరే సగటు ఆదాయం(ఆర్పు) రూ.200గా ఉంది. ఇది 2026 ఆర్థిక సంవత్సరంలో రూ.220కు పెరుగుతుంది' అని అంకిత్ అన్నారు.గతంలో ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియాలు టారిఫ్‌లను 19-21 శాతం పెంచాయని, దీంతో కొంతమంది వినియోగదారులు ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపారని నిపుణులు చెబుతున్నారు. ఈసారి ప్లాన్ వ్యాలిడిటీ పీరియడ్స్ మార్పుకుంటూ ధరల పెంపుపై ఆపరేటర్లు దృష్టి సారిస్తారని భావిస్తున్నారు.భారతీ ఎయిర్‌టెల్ ఇప్పటికే డేటా టారిఫ్‌లను పెంచే సూచనలు చేసింది. 'భారత్‌లో మొబైల్ టారిఫ్ డిజైన్ తారుమారుగా ఉంది. సంపన్నులు తక్కువ చెల్లిస్తున్నారు. పేదలు కూడా వారితో సమానంగా పే చేస్తున్నారు. ఇది మారాల్సి ఉంది' అని భారతీ ఎయిర్‌టెల్ వైస్ ఛైర్మన్, ఎండీ గోపాల్ విట్టల్ కంపెనీ ఇటీవల తెలిపారు.



# ఆగస్టు 15 నుంచే..

## ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్





**జనంసాక్షి:**నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆగస్టు 15 నుంచి 'ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్'ను ప్రారంభించనుంది. ఒక్కసారి రీఛార్జ్ చేసుకోవడం ద్వారా పదేపదే టోల్ చెల్లింపులు చేయాల్సిన అవసరం లేకుండా..వాహనదారులు జాతీయ రహదారులపై సజావుగా ప్రయాణించడానికి ఈ పాస్ తీసుకొచ్చారు.ఫాస్ట్‌ట్యాగ్ వార్షిక పాస్ అనేది భారత ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన చొరవ. ఇది తరచుగా ప్రయాణించేవారికి హైవే ప్రయాణాన్ని మరింత సరసమైనదిగా.. ఇబ్బంది లేకుండా చేస్తుంది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించిన ఈ పాస్.. కార్లు, జీపులు, వ్యాన్లు వంటి ప్రైవేట్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. ఈ పాస్ కోసం ఒకేసారి రూ. 3000 చెల్లిస్తే.. వాహనాలు ఒక సంవత్సరం లేదా 200 టోల్ క్రాసింగ్‌లు (ఏది ముందు అయితే అది) చేయడానికి అనుమతి పొందుతాయి.ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్ టోల్ బూత్‌ల వద్ద వేచి ఉండే సమయాన్ని తగ్గిస్తుంది. దీని ఫలితంగా లక్షలాది మందికి వాహనదారులు వేగవంతమైన ప్రయాణ అనుభూతిని పొందవచ్చు. అయితే ఇప్పటికే ఫాస్ట్‌ట్యాగ్ ఉన్నవారు కొత్త ఫాస్ట్‌ట్యాగ్ కొనుగోలు చేయవలసిన అవసరం లేదని రోడ్డు రవాణా శాఖ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్ అనేది.. నిర్దేశించే జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలు ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వే, ముంబై-నాసిక్, ముంబై-సూరత్, ముంబై-రత్నగిరి మార్గాల వంటి టోల్ ప్లాజాలలో మాత్రమే చెల్లుతుంది.రాష్ట్ర రహదారులు లేదా మున్సిపల్ టోల్ రోడ్లపై, మీ సాధారణంగా పనిచేస్తుంది. టోల్ ఛార్జీలు యథావిధిగా వర్తిస్తాయి. ఉదాహరణకు, ముంబై - పూణే ఎక్స్‌ప్రెస్‌వే, ముంబై - నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌వే (సమృద్ధి మహామార్గ్), అటల్ సేతు, ఆగ్రా - లక్నో ఎక్స్‌ప్రెస్‌వే, బెంగళూరు - మైసూర్ ఎక్స్‌ప్రెస్‌వే, అహ్మదాబాద్ - వడోదర ఎక్స్‌ప్రెస్‌వే వంటి వాటిని రాష్ట్ర అధికారులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ యాన్యువల్ పాస్ చెల్లుబాటు కాదని సమాచారం.ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వే వంటి క్లోజ్ టోలింగ్ హైవేలలో.. టోల్ వసూలు ప్రత్యేకంగా ఎగ్జిట్ పాయింట్ల వద్ద జరుగుతుంది. ఒకే ట్రిప్‌లో ఎంట్రీ అండ్ ఎగ్జిట్ పాయింట్లు రెండూ ఉంటాయి. మరోవైపు.. ఢిల్లీ-చండీగఢ్ వంటి ఓపెన్ టోలింగ్ మార్గాలలో, ప్రతి టోల్ ప్లాజా క్రాసింగ్ ప్రత్యేక ట్రిప్‌గా ఉంటుంది. పాస్ చెల్లుబాటు ముగిసే వరకు వినియోగదారులు ఏదైనా జాతీయ రహదారి లేదా ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణించవచ్చు. చెల్లుబాటు గడువు ముగిసిన తర్వాత, సాధారణ ఫాస్ట్‌ట్యాగ్ మాదిరిగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది.ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్ అనేది.. ఒక సాధారణ డిజిటల్ ప్రక్రియ. దీని కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి లేదా ఎన్‌హెచ్ఏఐ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి. మీ వెహికల్ రిజిస్ట్రేషన్ వివరాలను ఎంటర్ చేయండి. మీ ప్రస్తుత ఫాస్ట్‌ట్యాగ్ యాక్టివ్‌గా, చెల్లుబాటు అయ్యేదిగా ఉందాలి. బ్లాక్‌లిస్ట్‌లో లేదని ముందుగానే చెక్ చేసుకోవాలి.యాన్యువల్ పాస్ కోసం రూ. 3,000 ఆన్‌లైన్‌లో చెల్లించండి. చెల్లింపులు పూర్తయిన తరువాత.. మీ యాన్యువల్ పాస్ మీ ప్రస్తుత లింక్ అవుతుంది.

# ఐసీఐసీఐ ఇక పేదల బ్యాంకు కాదా?




**జనంసాక్షి:**ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చే కొత్త పొదుపు ఖాతాలకు కనీస సగటు బ్యాలెన్స్ (ఎంఏబీ) నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చింది.అందులో భాగంగా ఎంఏబీ పెంచడంతో ఖాతాదారులు, ఫైనాన్స్ నిపుణుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్యాంక్ సవరించిన పాలసీ ప్రకారం.. మెట్రో, అర్బన్ కస్టమర్లకు ఎంఏబీ ఐదు రెట్లు పెరిగి రూ.50,000కు చేరింది. సెమీ అర్బన్ ప్రాంతాలకు రూ.25 వేలకు పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడు రూ.10,000గా ఉంది. ఇది మునుపటి కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఈ మార్పులు కొత్త ఖాతాదారులకు మాత్రమే వర్తిస్తాయని బ్యాంకు తెలిపింది. ఇప్పటికే ఉన్న ఖాతాదారులపై ఈ విధానం ప్రభావం చూపదని చెప్పింది.ఈ నిర్ణయం వ్యూహాత్మకమైన బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. తక్కువ బ్యాలెన్స్ ఉన్న వాలా మంది పొదుపు ఖాతాదారులు ఐసీఐసీఐ బ్యాంకును ద్వితీయ ఖాతాగా భావిస్తున్నారు. అదే సమయంలో ప్రీమియం కస్టమర్లతో సమానంగా బ్యాంకు సేవలను ఉపయోగిస్తున్నారు. దీనివల్ల రాబడులు లేకుండానే నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నట్లు బ్యాంకు భావిస్తోంది. తక్కువ బ్యాలెన్స్ ఉన్న ఖాతాలను 'మ్యూల్ ఖాతాలు'(అనైతిక కార్యకలాపాలు, మనీలాండరింగ్ కోసం ఉపయోగించేవి)గా వాడే అవకాశం ఉంది. ఖాతాల్లో అధిక బ్యాలెన్స్ మెయింటెన్ చేసే కస్టమర్లపై దృష్టి పెట్టడం ద్వారా బ్యాంక్ ఈ మ్యూల్ ఖాతాలను లక్ష్యం చేసుకోనుంది. ఈ కొత్త విధానం ద్వారా స్థిర ఖర్చులను తగ్గించుకోవాలని భావిస్తున్నారు. ప్రీమియం కస్టమర్లకు మెరుగైన సేవలను అందించడం, టెక్నాలజీ అప్‌గ్రేడ్‌లు, కొత్త ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ కోసం మూలధనాన్ని ఉపయోగించాలని చూస్తుంది.ఈ పెంపు వల్ల ఐసీఐసీఐ బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ (ఎస్ఏ) నిష్పత్తి లేదా ప్రాఫిట్ మార్జిన్‌పై ఎలాంటి ప్రభావం ఉండదని బ్యాంకు పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కస్టమర్లు తమ అవసరాలను తీర్చడంలో బ్యాంకు విఫలమైతే పెనాల్టీ ఛార్జీలు నుంచి ప్రయోజనం పొందవచ్చని చెబుతున్నారు. బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (బీఎస్‌బీడీ-జీరో బ్యాలెన్స్ ఖాతాలు) ఖాతాలకు ఈ నిబంధన వర్తించదు. పెన్షనర్లు, శాలరీ అకౌంట్లు, రూ.2 లక్షల పొదుపు, ఫిక్స్‌డ్ డిపాజిట్ బ్యాలెన్స్ మెయింటెయిన్ చేసే కస్టమర్లకు మినహాయింపులు ఇచ్చారు. ముఖ్యంగా అధిక శాతం మంది ఖాతాదారులు నెలకు రూ.25,000 కంటే తక్కువే సంపాదిస్తున్నారు. అలాంటిది బ్యాంకు 'సేవింగ్స్ ఖాతాలో స్థిరంగా నగదు మెయింటెన్ చేయాలంటే వారి నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. 'పొదుపు ఖాతాలో రూ.50,000 ఎంఏబీ చాలామంది భారతీయులకు ఆచరణీయం కాదు. 90 శాతం మంది భారతీయులు నెలకు రూ.25,000 కంటే తక్కువ సంపాదిస్తున్నారు. ఈ మార్పు వారికి శాపంగా మారుతుంది' అని ప్రముఖ బ్యాంకర్ జే కోటక్ తన ఎక్స్ ఖాతాలో చెప్పారు.బ్యాంకు చర్యల ద్వారా ప్రీమియం క్లయింట్లకు ప్రాధాన్యత ఇస్తూ, మాస్ మార్కెట్ విభాగాన్ని దూరం చేసుకుంటుందని కొందరు చెబుతున్నారు. ఆర్థిక సమ్మిళితం(ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్) అనే విస్తృత జాతీయ లక్ష్యాన్ని ఇది బలహీనపరుస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు ఎంఏబీలను తక్కువగా లేదా జీరోగా ఉంచుతున్న తరుణంలో ఐసీఐసీఐ బ్యాంక్ బహుళ సేవా ఛార్జీలను (ఏటీఎం, విత్‌డ్రా, ఐఎంపీఎస్, ఆర్టీజీఎస్ మొదలైన వాటిపై) వసూలు చేస్తుంది.ఐసీఐసీఐ బ్యాంకు విధానానికి విరుద్ధంగా మిడ్ సైజ్ బ్యాంకులు ఎన్నో సర్వీసులు అందిస్తున్నాయి. పొదుపు ఖాతాలపై 7 శాతం వరకు వడ్డీ ఇస్తున్న బ్యాంకులున్నాయి. ప్రాథమిక లావాదేవీలపై ఎలాంటి రుసుములు వసూలు చేయడం లేదు. రూ.25,000 ఎంఏబీతో కస్టమర్లకు ఎయిర్ పోర్ట్ లాంజ్ యాక్సెస్ కూడా ఇస్తున్నాయి.బ్యాంకింగ్ సేవలను అందరికీ అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు మార్గదర్శ కాలకు కట్టుబడి ఉంటాయి. హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌తో విలీనం తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డిపాజిట్లను పెంచడంపై దృష్టి పెట్టింది. పెరుగుతున్న డిపాజిట్ల పోటీ నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్, పలు మిడ్ టైర్ ప్రైవేట్ బ్యాంకులు ఐసీఐసీఐ చర్యను అనుకరించే అవకాశం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# దిగొస్తున్న కనకం ధరలు!

ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఊగిసలాడుతున్నాయి. కొద్దికాలంగా పెరిగిన పసిడి ధరలు.. వరలక్ష్మీవ్రతం, రాఖీ పండుగ అనంతరం క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. సోమవారంతో పోలిస్తే మంగళవారం బంగారం ధరలు తగ్గాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం ధరలు ఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.

# సోదరుడికి పంపిన లీగల్ నోటీసు విత్‌డ్రా

సన్ టీవీ నెట్‌వర్క్ లిమిటెడ్ ఛైర్మన్ కళానిధి మారన్ ఆయన సోదరుడు, డీఎంకే ఎంపీ దయానిధి మారన్ మధ్య తలెత్తిన న్యాయ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకున్నట్లు కంపెనీ తెలిపింది.కళానిధి మారన్‌కు వ్యతిరేకంగా దయానిధి జారీ చేసిన అన్ని లీగల్ నోటీసులను ఉపసంహరించుకున్నట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది.సన్‌టీవీ ఛైర్మన్ కళానిధి మారన్‌తోపాటు మరో ఏడుగురిపై గతంలో ఆయన సోదరుడు దయానిధి మారన్ లీగల్ నోటీసులు పంపించడంతో పరిస్థితులు తీవ్రంగా పరిణమించాయి. కళానిధి మారన్ తన వ్యాపార కార్యకలాపాల్లో మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు అందులో పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కళానిధిపై చర్యలు తీసుకోవాలని దయానిధి కోరారు. కళానిధి మారన్ భార్య కావేరి మారన్‌కు కూడా నోటీసులు అందాయి. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య ఉన్న వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకున్నట్లు కంపెనీ తెలిపింది. దాంతో దయానిధి మారన్ లీగల్ నోటీసులను ఉపసంహరించుకున్నట్లు స్పష్టం చేసింది.కళానిధి మారన్ సారథ్యం వహిస్తున్న సన్ గ్రూప్ ఆధ్వర్యంలో టెలివిజన్, రేడియో, ప్రింట్, సినిమా, క్రీడా విభాగాల్లో వ్యాపారాలున్నాయి.

# జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం కీలక మలుపు

లోక్‌సభ సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని స్పీకర్ ఓం బిర్లా స్వీకరించారు. ఈ అంశంపై విచారణ కోసం ముగ్గురు సభ్యులతో కూడిన ఓ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్యానెల్‌లో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు జస్టిస్ ఎమ్ఎమ్ శ్రీవాత్సవ, సీనియర్ న్యాయవాది బీవీ ఆచార్యులు సభ్యులుగా ఉన్నారు. అభిశంసన తీర్మానంపై ప్రతిపక్ష, పాలక పక్షానికి చెందిన 146 మంది సంతకం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ అభిశంసన ప్రక్రియ ప్రారంభం కావాల్సిందేనని అన్నారు. అవినీతికి పార్లమెంటు పూర్తిగా వ్యతిరేకమని చెప్పారు. ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని అన్నారు. ఇక స్పీకర్ ఏర్పాటు- చేసిన కమిటీ ఈ ఉదంతానికి సంబంధించిన సాక్ష్యాలు ప్రశ్నించి, ఆధారాలను పరిశీలిస్తుంది. విచారణ అనంతరం, తుది నివేదికను స్పీకర్‌కు సమర్పిస్తుంది. అనంతరం నివేదికను సభ ముందు ఉంచుతారు. ఈ ఉదంతంలో న్యాయమూర్తి దోషిగా తేలిన పక్షంలో ఆయన అభిశంసన తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు. రాజ్యసభలో కూడా ఇదే ప్రక్రియను అమలు చేస్తారు. ఉభయ సభలు ఆమోదించిన తీర్మానానికి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిస్తారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఆవరణలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మంటలను ఆర్పేందుకు వచ్చిన సిబ్బంది వాటిని గుర్తించారు. ఈ ఘటనపై అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా.. అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో ఒక కమిటీ-ని వేశారు.

# సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నా..

- గట్టు వామన్ రావు కేసులో అసలు దోషులకు శిక్ష పడాలి
- సీబీఐ విచారణలో అప్పటి ప్రభుత్వ పెద్దల పాత్ర బయటపడాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** మంథని ప్రాంతానికి చెందిన గట్టు వామన్ రావు నాగమణి న్యాయవాద దంపతుల హత్య కేసు విచారణను సీబీఐకి అప్పగించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్వాగతించారు. ఇది న్యాయ వ్యవస్థపై ప్రతి ఒక్కరికీ నమ్మకం కలిగించిందని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో అసలు దోషులు, వారికి సహకరించిన అప్పటి ప్రభుత్వ పెద్దలకు శిక్ష పడితేనే ఆ కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. మంథనిలో నడిరోడ్డుపై అడ్వకేట్ వామన్ రావు దంపతులు హత్యకు గురైతే అప్పటీ బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. నిష్పక్షపాతంగా విచారణ చేయకుండా అసలు దోషులను కాపాడిందన్నారు. కుమారుడు, కోడలిని కోల్పోయిన ఆ వృద్ధ తల్లిదండ్రులకు న్యాయం చేయాల్సిన అప్పటి ప్రభుత్వ పెద్దలు.. విచారణను తప్పుదోవ పట్టించి అసలు హంతకులను కాపాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని ప్రజా సంఘాలు, కాంగ్రెస్ పార్టీ కోరినా పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన న్యాయ వ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. చివరకూ... న్యాయమే గెలుస్తుందన్నారు.

# యస్‌బిఐటి. విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక, ఇన్సురెన్స్ రంగాలపై అవగాహనా సదస్సు



**ఖమ్మం(జనం సాక్షి) :** విద్యతో పాటు ఆర్థిక క్రమశిక్షణ అవసరమని యస్‌బిఐటి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక యస్‌బిఐటి కళాశాల ప్రాంగణంలో బియఫ్‌యస్ఐ కన్సార్షియం మరియు టెక్నోజెన్ సంయుక్తంగా నిర్వహించిన అవగాహనా సదస్సులో బి.టెక్. చివరి సంవత్సరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కేవలం సాఫ్ట్వేర్ రంగం మాత్రమే ఉద్యోగం కాదని, బ్యాంకింగ్, ఆర్థిక మరియు ఇన్సురెన్స్ రంగాల లో కూడా ఎన్నో అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు వ్యక్తిగత జీవితంలో కూడా ఆర్థిక వ్యవహారాలపై నిర్దిష్ట ప్రణాళికలను కలిగి ఉండాలని దిశానిర్దేశ్యం చేసారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా అభివృద్ధి చెందుతూ మూడవ స్థానంలో నిలిచిన భారతదేశంకు నైపుణ్యం కలిగిన విద్యార్థుల అవసరం ఉందని, అటువంటి విద్యార్థులకు తగిన శిక్షణను తాము అందిస్తామని బియఫ్ యస్ఐ ఆంధ్ర మరియు తెలంగాణ ప్రోగ్రాం డైరెక్టర్ యన్. గౌతమ్ తెలిపారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), తెలంగాణ ఉన్నత విద్యా మండలి వారి సూచనల మేరకు ఏర్పడిన బియఫ్‌యస్ఐ కన్సార్షియం విద్యార్థులకు ఐటి మరియు ఐటి అనుబంధ సంస్థలను బ్యాంకింగ్ రంగానికి అనుసంధానిస్తూ శిక్షణలను రూపొందించి ఒదని టెక్నోజెన్ డైరెక్టర్ అభయమురళి తెలిపారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన బియఫ్‌యస్ఐ కన్సార్షియం ద్వారా విద్యార్థులకు ఇండస్ట్రీకి తగ్గ రీతిగా బ్యాంకింగ్, ఇన్సురెన్స్ రంగాల పై నైపుణ్యాభివృద్ధిని అందించటం జరుగుతుందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. జి. ధాత్రి తెలిపారు. టెక్నికల్ స్కిల్స్తో పాటు మేనేజ్మెంట్ మరియు ఆర్థిక రంగాలపై అవగాహనా కలిగిఉండటం ఈ రోజులలో కనీస అర్హతలు అని కళాశాల ప్రిన్సిపల్ డా. జి. రాజ్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా. ఎవివి శివ ప్రసాద్, డా. జె. రవీంద్రబాబు, టిపిఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగుడిపై అమానవీయ చర్య

## మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

**జగిత్యాల, ఆగస్టు 12 (జనంసాక్షి):** జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో దివ్యాంగుడు రాజా గంగారం పట్ల సిబ్బంది అమానవీయంగా ప్రవర్తించిన ఘటనపై బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూర్మాచలం ఉమా మహేష్ తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఉమా మహేష్ మాట్లాడుతూ, రాజా గంగారం తన సమస్య పరిష్కారం కోసం కలెక్టర్‌ను కలవడానికి వేచి ఉండగా, అధికారులు, సిబ్బంది అత్యుత్సాహం తో దివ్యాంగుడని పట్టించుకోకుండా అతన్ని బలవంతంగా ఈడ్చుకెళ్లారని, ఈ క్రమంలో వీల్‌చెయిర్ నుంచి జారి పడిన గంగారంను అమానుషంగా బయటకు తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన సమయంలో కలెక్టర్ దృశ్యాన్ని చూసి కూడా గమనించకుండా ప్రజావాణి హాలులోకి వెళ్లడం సభ్య సమాజం నుంచి విమర్శలకు దారితీసిందని తెలిపారు. రాజా గంగారం సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఈ అమానవీయ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి దోషులపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిషన్‌ను కోరినట్లు ఉమా మహేష్ వెల్లడించారు.

# మర్రిగూడ ఎంపీడీవో కార్యాలయంలో డిఎల్పిఓ ఆకస్మిక తనిఖీ

- కార్యాలయం సిబ్బంది సకాలంలో విధులు హాజరై... ప్రజలకు సేవలందించాలి
- వర్షాకాలంలో గ్రామ పంచాయతీలో బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ అందుబాటులో ఉంచాలి
- పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి
- విధులపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు : డిఎల్పిఓ శంకర్ నాయక్



**మర్రిగూడ, ఆగస్ట్ 12 (జనంసాక్షి) :** మర్రిగూడ ఎంపీడీవో కార్యాలయంలో డిఎల్పిఓ శంకర్ నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. నల్లగొండ జిల్లా, మర్రిగూడ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో, మంగళవారం డిఎల్పిఓ శంకర్ నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎల్పిఓ శంకర్ నాయక్ ఎంపీడీవో కార్యాలయం సిబ్బందికి, గ్రామపంచాయతీ కార్యదర్శులకు పలు హెచ్చరికలు చేశారు. కార్యాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరై, ప్రజలకు సేవలందించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు గ్రామపంచాయతీ కార్యదర్శులు ఫేస్ రికగ్నేషన్ యాప్ ను దుర్వినియోగం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, గ్రామపంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేసి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షాకాలంలో గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్యంపై, స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ అందుబాటులో ఉంచాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మర్రిగూడ ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ సిబ్బందిపై, పలు ఆరోపణలు వస్తున్నాయని ప్రజలకు సేవలు అందించడంలో అలసత్వం వహిస్తున్నారని, ఇదే విషయం పునరావృతం అయితే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఉద్యోగ రీత్యా శంకర్ నాయక్ చేస్తున్న చర్యలు, సిబ్బందిని దారిలో పెడుతుందనే చెప్పుకోవాలి. ఇప్పటికే ఎన్నో అవినీతి అక్రమాలను బయటపెట్టిన ఆయన ఎక్కడా తలొగ్గడం లేదనే చెప్పుకోవాలి.

# కోతికి భయపడి భవనం పైనుండి దూకిన విద్యార్థిని



**ఆర్మూర్ ఆగస్టు 12 (జనంసాక్షి):** ఆర్మూర్ పట్టణంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో ఇంటర్ విద్యార్థి గతవారం క్రితం కళాశాల భవనం నుండి దూకిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ పట్టణం దుబ్బ ప్రాంతానికి చెందిన కావేరి అనే విద్యార్థి ఆర్మూర్ కస్తూరిబా పాఠశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతుంది.కాగా మొదటి అంతస్తులో కోతిని తన మీదికి దాడికి రావడంతో భయపడి మొదటి అంతస్తు భవనం నుండి క్రిందకి దూకింది. గాయాల పాలైన విద్యార్థిని సరైన వైద్యం కోసం నిజామాబాద్ జిల్లా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. కళాశాల ప్రాంగణంలో కోతుల బెడద తీవ్రంగా ఉండడమే ప్రధాన కారణంగా తెలిసింది.

# రైతుబీమా రైతులకు కొండంత ధీమా

- నేటితో ముగియనున్న దరఖాస్తుల గడువు
- అర్హులైన రైతుల సంఖ్య ఉమ్మడి మేడిపల్లి మండలంలో 7700
- రైతు బీమాకు ప్రీమియం ప్రభుత్వమే చెల్లింపు




**మేడిపల్లి, ఆగస్టు 12 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం ద్వారా బాధిత రైతు కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల పరిహారం అందించి భరోసా కల్పిస్తోంది. 2018లో ప్రారంభమైన ఈ పథకం కింద 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల పట్టాదార రైతులు అర్హులు. రైతు అకాల మరణం సంభవిస్తే, నామినీకి పరిహారం అందుతుంది. రైతు బీమా కోసం రైతులు తమ వివరాలను పోర్టల్‌లో సరిచూసుకొని, కుటుంబ సభ్యున్ని నామినీగా ఎంచుకోవాలి. ఇతరులను నామినీగా నియమిస్తే బంధుత్వ నిర్ధారణ అవసరం. గతంలో నామినీ మరణిస్తే కొత్త నామినీని నియమించవచ్చు. రైతు మరణం సంభవిస్తే, వ్యవసాయ అధికారులకు సమాచారం అందించి, బీమా పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే, నెల రోజుల్లో పరిహారం అందుతుంది. ఈ పథకం ప్రీమియం పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఉమ్మడి మేడిపల్లి మండలంలో 7,700 మంది రైతులు అర్హులుగా ఉండగా, జూన్ 5 నాటికి 636 మంది డిజిటల్ సంతకం చేసిన పట్టా పాస్‌బుక్‌లు పొందారు. రైతు బీమా రెన్యూవల్ గడువు ఆగస్టు 13తో ముగియనుంది. 2025-26 సంవత్సరానికి ప్రీమియం చెల్లింపుతో ఆగస్టు 14 నుంచి కొత్త పాలసీ అమలులోకి వస్తుంది. జూన్ 5 వరకు పట్టా పొందిన రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షాహిద్ అలీ సూచించారు.



# యూరియా కొరత లేదు: రైతులు ఆందోళన చెందవద్దు : జిల్లా వ్యవసాయ అధికారి

**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 12 (జనంసాక్షి):** జిల్లాలో సాగు అవసరాలకు సమృద్ధిగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం ముస్తాబాద్‌లో కొంతమంది రాజకీయ లబ్ధి కోసం రైతులను రెచ్చగొట్టి ధర్నాలు చేయిస్తున్నారని, జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, ప్రతి రైతుకు అవసరమైన యూరియా అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ సీజన్‌కు 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముండగా, ఇప్పటివరకు 12,500 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరాయని, మిగిలిన 11,500 మెట్రిక్ టన్నులను విడతలవారీగా అందుబాటులోకి తెస్తామని, అందరికీ సీజన్ అంతా యూరియా అందిస్తామని హామీ ఇచ్చారు. రైతులు అవసరానికి మించి యూరియా వాడకుండా, మోతాదుకు మించి వాడితే పంటలకు చీడపీడలు సోకే ప్రమాదం ఉందని, నేల ఆరోగ్యం క్షీణిస్తుందని హెచ్చరించారు. యూరియా గ్రాన్యూల్స్‌కు బదులుగా నానో యూరియా వాడాలని, యూరియా వాడకాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు.

# పేద ప్రజలకు అండగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జనం సాక్షి):** కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన విట్టల్ రెడ్డి భార్య స్వరూప అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్ చేయవలసిందని చెప్పగానే వాళ్ళ ఆర్థిక ఇబ్బందులు ఉన్నందున కాంగ్రెస్ నాయకులను సంప్రదించగ వెంటనే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ కి విషయం చెప్పడంతో షబ్బీర్ అలీ వెంటనే స్పందించి నిమ్స్ హాస్పిటల్ డాక్టర్ తో మాట్లాడి విట్టల్ రెడ్డి భార్య స్వరూపకి ప్రభుత్వ తరపు నుండి చికిత్స నిమిత్తం 3,00,000/- రూపాయలు ఎల్. ఓ. సి ఇవ్వడం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీకి విట్టల్ రెడ్డి కుటుంబసభ్యులు కృత్ఞతలు తెలియజేసారు.

# యూరియా తక్కువ మోతాదులో వాడండి

## నాస్కాప్ చైర్మన్ కొండూరి రవీందర్రావు

**గంభరావుపేట (జనం సాక్షి):** మండల కేంద్రం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో, తక్కువ మోతాదులో యూరియా, పంటకు వాడాలని రైతులకు సూచించారు, ఒకవేళ ఎక్కువ మోతాదులో వాడితే, అనారోగ్యానికి గురవుతారని నాస్కాప్ చైర్మన్ కొండూరు రవీందర్రావు తెలిపారు మరియు, పంట వేసేటప్పుడు భూసార పరీక్షలు చేయించుకొని పంట మార్పిడి చేసినట్లయితే లాభాలు ఉంటాయని తెలిపారు, పెసర, జీలుగు, వేసుకోవడం వల్ల నేల అభివృద్ధి చెందుతుంది, దాని వల్ల అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు,ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు, మరియు వివిధ పార్టీ అధ్యక్షులు రైతులు, సహకార సంఘం సిబ్బంది, పాల్గొన్నారు

# మహిళా, శిశు సంక్షేమ శాఖ సమీక్ష

## రీజనల్ జాయింట్ డైరెక్టర్ సందర్శన



**కామారెడ్డి, ఆగస్టు 12 (జనంసాక్షి):** మహిళా, శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ రాణి మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సందర్శించి, శాఖల పనితీరు, అమలవుతున్న పథకాలను సమీక్షించారు. జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల ఆధ్వర్యంలో ఐదు సిడిపిఓ ప్రాజెక్టుల అధికారులతో సమావేశమై, వారి సమస్యలను తెలుసుకొని తగు సూచనలు చేశారు. కామారెడ్డిలోని డ్రైవర్స్ కాలనీ, రాజీవ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సఖి కేంద్రం (వన్ స్టాప్ సెంటర్)ను సందర్శించి, నిర్వహణపై సిబ్బందితో చర్చించి సూచనలు అందించారు. నూతనంగా నిర్మిస్తున్న సఖి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. చివరగా, ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని సందర్శించి, చిల్డ్రన్ హోమ్‌లోని బాలికలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలికలకు భోజనం, ఆరోగ్య సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పనితీరు సంతృప్తికరంగా ఉందని ప్రశంసించారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

## మద్దతు తెలిపిన బిఆర్ఎస్ బిజెపి నేతలు



**ముస్తాబాద్ ఆగస్టు 12 ( జనం సాక్షి):** ముస్తాబాద్ మండలంలోని రైతులకు సరిపడా సూర్య దొరకక మంగళవారం ముస్తాబాద్ ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేశారు, ఇటీవల కృష్ణ వర్షాలకు రైతులు నాట్లు వేసి సూర్యా కోసం పడిగాపులు కాస్తూ నిత్యం సహకార సంఘాల గోదాముల చుట్టూ తిరుగుతూ, పెట్లైజర్ దుకాణం చుట్టూ తిరుగుతూ, దుకాణాల వద్ద సహకార సంఘాల వద్ద క్యూలైన్లో నిలబడి అలసిపోయి , రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, రైతులకు సరిపడే యూరియా సరఫరా చేసి ఆదుకోవాలని కొత్త బస్టాండు ఐలమ్మ విగ్రహం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు, వారికి మద్దతుగా బిఆర్ ఎస్, బిజెపి నాయకులు రైతులకు మద్దతు తెలుపుతూ ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలో యురియ కొరత కావాలనే సృష్టిస్తున్నారని ఆరోపించారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్న రైతులను పట్టించుకోవడం లేదు, వ్యవసాయ పొలాల్లో నాట్లు వేసి రెండు నెలలు గడుస్తున్న ఇంతవరకు కూడా యురియ రైతులకు సరిపోయే విధంగా సప్లై చేయలేకపోయినా ప్రభుత్వ యంత్రాంగం, గత ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవు అన్నారు, వెంటనే ఆర్ ఐ రఘు వ్యవసాయ అధికారి దుర్గం రాజు సంఘటన స్థలం కు చేరుకొని పూర్తిస్థాయిలో పరిశీలించి, రైతులతో మాట్లాడి ప్రైవేట్ పెట్లైజర్ షాపు ఓపెన్ చేపించి యురియ బస్తాలను రైతులకు అందించారు రైతులు శాంతింప జేసీ యురేనియం తీసుకెళ్లడం జరిగింది రైతులు, ఈ కార్యక్రమంలో కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్ , శీలం స్వామి, ముక్క మల్లయ్య, తాళ్ల రాజు, చిగురు రవి, కుమార్, బీజేపీ నాయకులు చిట్నేని శ్రీనివాసరావు, ముక్క గుణశేఖర్, నందు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు



# పుష్కర ఘాట్ నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలి

**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని ముస్త్యాల గ్రామ శివారులో గల గోదావరి వద్ద పుష్కర ఘాట్ నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలి అని ముస్త్యాల గ్రామ తాజా మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య నాగరాజు లలిత్ కుమార్ ను కోరారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామ సమీపంలో పుష్కర ఘాట్ టెండర్ కోసం ఆర్‌జి 1 జిఎం ను కల వడం రామగిరి లావణ్య నాగరాజు మంగళ వారం కలిశారు. రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఆర్‌జి 1 జిఎం లలిత్ కుమార్‌ను కలవడం తెలిపారు. ముస్త్యాల గ్రామానికి చెందిన పుష్కర ఘాట్ పనులకోసం గత మూడు నెలల క్రితం ముస్త్యాల గ్రామానికి పుష్కర ఘాట్ కోసం కలవగా సివిల్ డిపార్ట్ మెంట్ వాళ్లను పంపి ఎస్టిమేషన్ చేయడం జరిగింది అని లావణ్య పేర్కొన్నారు. పుష్కర ఘా ట్ పనులు మొదలు పెట్టలేదు కావున పుష్కర ఘాట్ పనులు మొదలు పెట్టాలని జిఎం లలిత్ కుమార్ కోరారు. జిఏం సానుకూలంగా స్పందించి ఎస్టిమేషన్ చేసి కొత్తగూడెం టెండర్ కోసం పంపామని కొత్తగూడెం నుండి ఫైలు తిరిగి రాగానే పనులు మొదలు పెట్టడం జరుగుతుందని జీఏం లలిత్ కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు తాజా మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జక్కుల యాదగిరి, అంజయ్య పాల్గొన్నారు.

# ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్ట్‌ను ప్రదర్శించాలి




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (జనం సాక్షి) :** రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్ట్‌ను కచ్చితంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) 2025పై పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారుల (పిఐఓ)కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేసిన చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌తో పాటు కమిషనర్లకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు.

అవగాహన సదస్సులో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్టిఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువగా వచ్చిన మూడు జిల్లాల్లో కామారెడ్డి ఒకటని, దీనికి అధికారులను అభినందించారు. కామారెడ్డి కొత్త జిల్లా కాబట్టి, ఆర్టిఐ చట్టంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పాత కేసులను మంగళవారం ప్రత్యేక విచారణ ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్టిఐ 2025 చట్టం ప్రభుత్వ విధుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు రూపొందించబడిందని, దరఖాస్తుదారు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లో ఖచ్చితంగా, పారదర్శకంగా అందించాలని ఆదేశించారు. సమాచారం ఇవ్వడాన్ని తిరస్కరిస్తే, సరైన కారణం చూపాలని, ఆర్టిఐ చట్టం పట్ల భయం లేకుండా ప్రజలు కోరిన సమాచారాన్ని అందించాలని సూచించారు. చట్టాన్ని నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకొని, గరిష్టంగా 25 వేల రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రతి కార్యాలయంలో సిటిజన్ చార్ట్‌ను ప్రదర్శించి, సేవలు, అధికారులు, సిబ్బంది వివరాలు, సేవల అందించే సమయం వంటి అంశాలను తెలియజేయాలని ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా సమాచారం సులభంగా అందేలా శాఖల వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆర్టిఐ చట్టం ప్రకారం ఎలాంటి కారణం లేకుండా సమాచారం కోరే హక్కు ప్రజలకు ఉందని, అన్ని కార్యాలయాల్లో పిఐఓ, అసిస్టెంట్ పిఐఓలను నియమించాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, అధికారులు ఆర్టిఐ చట్టంపై పూర్తి అవగాహన పెంచుకొని, మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో 220కి పైగా పెండింగ్ ఆర్టిఐ అప్పీల్ కేసులను రాష్ట్ర సమాచార కమిషన్ ప్రత్యేక విచారణ ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అవసరాల కోసం ఉద్యమాల ఫలితంగా ఆర్టిఐ చట్టం ఏర్పడిందని, పిఐఓలు, అసిస్టెంట్ పిఐఓలు చట్టపరమైన బాధ్యతలను తెలుసుకొని, నిర్ణీత సమయంలో స్పష్టమైన సమాచారం అందిస్తే దరఖాస్తుదారులకు చట్టంపై గౌరవం పెరుగుతుందని అన్నారు. కమిషనర్ మోహ్సినా పర్వీన్ మాట్లాడుతూ, నూతన రాష్ట్ర సమాచార కమిషన్ ఏర్పాటు తర్వాత 18 వేల పెండింగ్ కేసుల్లో 2300కి పైగా పరిష్కరించామని, పిఐఓల సందేహాలకు సమాధానాలు ఇచ్చామని తెలిపారు. కమిషనర్ దేశల భూపాల్ మాట్లాడుతూ, ఆర్టిఐ చట్టం అమలై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, అధికారులు కేసులను క్షుణ్ణంగా పరిశీలించి, దరఖాస్తుదారు తృప్తి పొందేలా నిర్ణీత సమయంలో సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అడిషనల్ కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, బాన్స్వాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అడిషనల్ ఎస్పీ చైతన్యరెడ్డి, పిఐఓలు, అసిస్టెంట్ పిఐఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నేషనల్ హైవే 63లో బ్లాక్ స్పాట్ల పర్యవేక్షణ

## జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ చర్యలు



**బోధన్, ఆగస్టు 12 (జనంసాక్షి):** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో, ప్రమాద నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మంగళవారం నేషనల్ హైవే 63లో కమ్మర్ పల్లి నుంచి బోధన్ వరకు 77 కిలోమీటర్ల రోడ్డును పరిశీలించారు. పోలీస్, ఆర్ అండ్ బీ, ఎన్‌హెచ్ఐ, పంచాయతీ రాజ్, మోటార్ వెహికల్, 108 సర్వీస్ శాఖల అధికారులతో కలిసి 26 బ్లాక్ స్పాట్‌లను గుర్తించి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల ప్రాణ రక్షణ కోసం ట్రాఫిక్ నియంత్రణ చర్యలను బలోపేతం చేయాలని, వర్షం వల్ల ఏర్పడిన గుంతలను తక్షణం మరమ్మతు చేయాలని అధికారులకు ఆదేశించారు. హైవే పరిధిలోని దుకాణాలు, బోర్డులు, విగ్రహాలను వెనక్కి జరపాలని, గ్రామాల్లో జీబ్రా క్రాసింగ్‌లు, జంక్షన్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మూలమలుపుల వద్ద రోడ్డు విశాలంగా కనిపించేలా, రిఫ్లెక్షన్ రేడియం స్టిక్కర్లు, స్పీడ్ బ్రేకర్లు, వేగ నియంత్రణ పరికరాలు, బ్లింకర్లు అమర్చాలని ఆదేశించారు. గ్రామ ప్రజల సూచనలను పరిగణనలోకి తీసుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలు రోడ్డు భద్రత నిబంధనలు పాటించి జాగ్రత్తగా ప్రయాణించాలని కలెక్టర్, కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే ఈఈ ఎ. మలారెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్, ఆర్టీఏ అధికారి ఉమా మహేశ్వర్ రావు, ఆర్ అండ్ బీ ఏఈ సతీష్, పంచాయతీ రాజ్ సిబ్బంది రామకృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఐరాడ్ మేనేజర్ వర్మా, 108 ఎమ్రి సర్వీసెస్ రామలింగేశ్వర రెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్ సుజాత

- భూమి ప్రొసీడింగ్ కోసం 20,000 డిమాండ్, ముందుగా 5000 చెల్లింపు
- మరో 15000 లంచం తీసుకుంటుండగా పట్టుబడిన వైనం
- రంగారెడ్డి డివిజన్ ఎసిబి డిఎస్పి అశోక్ కుమార్ వెల్లడి




**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 12 (జనం సాక్షి) :** జిల్లాలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు అవినీతి కార్యాలయాలుగా మారుతున్నాయి. లంచాల కోసం ప్రజలను వేధిస్తున్నారంటూ ఏసీబీ కి కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు వస్తున్నాయి . దీంతో అవినీతి అధికారుల భరతం పడుతుంది అవినీతి శాఖ. చేసిన పనికి జీతం తీసుకుంటున్న లంచం పేరుతో ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్న అవినీతి తిమింగలాలకు వలవేసి కట్టడి చేస్తుంది. జిల్లాలో కొన్ని నెలల్లో కొంతమంది అధికారులకు వలవేసి పట్టుకుంది. ప్రజలకు సేవ అందించవలసిన అధికారులు అవినీతి బాట పట్టారని సమగ్ర సమాచారంతో ఏసీబీ అధికారులు వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. అందులో భాగంగానే జిల్లా రెవిన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న సుజాత 15000 లంచం తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా డివిజన్ ఏసిబి డిఎస్పి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో దాడి నిర్వహించి రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నారు. ఈ విషయమై ఎసిబి డిఎస్పి అశోక్ కుమార్ వివరించారు. ఈ సంఘటన కలెక్టరేట్లో జరగడంతో జిల్లావ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. నిత్యం కలెక్టర్ అందుబాటులో ఉండే కార్యాలయంలో అవినీతి జరగడం ఏమిటి అని సర్వత్ర చర్చ జరుగుతుంది. కలెక్టర్ కార్యాలయంలో పరిస్థితి ఇలా ఉంటే ఇక మండల స్థాయిలో ఉన్న పరిస్థితి ఏ రకంగా ఉంటుందో ఊహించుకోవచ్చునని అనుకుంటున్నారు. నవాబ్ పేట్ మండలం వట్టిమీనపల్లి గ్రామానికి చెందిన ఒక రైతు నుంచి 15వేల రూపాయల లంచం తీసుకుంటుండగా జూనియర్ అసిస్టెంట్ సుజాత పట్టుబడినట్లు తెలియజేశారు. నవాబుల కాలం నాటి రెండు ఎకరాల అసైన్మెంట్ భూమిని కొందరు వ్యక్తులు పట్టగా మార్చుకొని కబ్జా చేసినట్లు ఆ రైతు ముందుగా నవాబ్ పెట్ తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అక్కడి తహసిల్దార్ జిల్లా కలెక్టర్ అనుమతి కోసం లేఖ రాశారు. ఈ ఫైల్ జిల్లా కలెక్టరేట్ లోని రెవెన్యూ సెక్షన్ లో ప్రతిపాదనలో ఉంది. జిల్లా కలెక్టర్ కు ఈ ఫైల్ పంపించడానికి జూనియర్ అసిస్టెంట్ సుజాత ముందుగా 5000 డిమాండ్ చేసింది.

ఆ రైతు 5000 జూనియర్ అసిస్టెంట్ కు చెల్లించినట్లు ఎసిబి డిఎస్పి అశోక్ కుమార్ వివరించారు. ఫైల్ పై జిల్లా కలెక్టర్ సంతకం కాగానే ప్రొసీడింగ్ ఇవ్వడానికి మరో 20000 జూనియర్ అసిస్టెంట్ సుజాత రైతులు డిమాండ్ చేసింది. ముందుగా 5000 చెల్లించానని మరో 15 వేల రూపాయలు ప్రొసిడింగ్ అందజేస్తే ఇస్తానని ఆ రైతు జూనియర్ అసిస్టెంట్ సుజాత తో నమ్మబలికాడు. ఇదే విషయమై ఆ రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారికి ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు 15 వేల రూపాయలు జూనియర్ అసిస్టెంట్ సుజాతకు ఇస్తూ ఉండగా ఏసీ అధికారుల టీం దాడి చేసి రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నట్లు డి.ఎస్.పి అశోక్ కుమార్ తెలియజేశారు. నిందితు రాలిని అరెస్టు చేసి ఎసిబి కోర్టులో హాజరు పరుస్తామని తెలియజేశారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా పని కోసం లంచం అడిగితే ఏసీబీ అధికారులను ఆశ్రయించాలని ఎసిబి డిఎస్పి అశోక్ కుమార్ కోరారు





# ఫోర్జరీ సంతకాలతో మహిళా సంఘం సొమ్ములు స్వాహా



- పోర్జరీ సంతకాలతో సుమారు రూ.1.50 లక్షలు వేరే ఖాతాలలోకి..!
- నిలదీస్తున్న సంఘాల మహిళలు

**యాచారం, ఆగస్టు 12 (జనం సాక్షి) :** మహిళా సంఘం సొమ్మును ఫోర్జరీ సంతకాలతో స్వాహా చేసిన ఘటన యాచారం మండలంలో వెలుగు చూసింది.యాచారం మండలంలోని చౌదర్ పల్లి గ్రామంలో 35 గ్రామ సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల ఆర్థిక వ్యవహారాలను వీబీకే పర్యవేక్షిస్తుంది. స్వయంసహాయక సంఘాల పొదుపు ఖాతాలలోని సొమ్ములను వేరే ఖాతాలకు మళ్లించి సుమారు ఒక కోటి 50 లక్షల వరకు స్వాహా చేసినట్టు స్వయం సహాయక సభ్యులు అనుమానిస్తున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో సభ్యులంతా సంబంధిత ఎస్బిఐ బ్యాంక్ కి వెళ్లి బ్యాంకు మేనేజర్ ను నిలదీసేందుకు బ్యాంకుకు వెళ్లలేదా బ్యాంకు మేనేజర్ లేకపోవడంతో బ్యాంకు ముందు ధర్నాతో ఉద్రేకత నెలకొన్నది.ఈ స్వాహాలో వీబీకే తోపాటు బ్యాంకు మేనేజర్ పాత్ర ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి.సంఘ సభ్యులకు తెలియకుం డా ఫోర్జరీ సంతకా లతో ఈ తంతు పూర్తి చేసినట్టుగా తెలుస్తుంది. దీంతో తమ ఖాతా నుండి తమకు తెలియకుండానే లక్షలు ఎలా డ్రా చేస్తారని నిలదీశారు. విషయం తెలుసుకొని రీజినల్ అధికారి సంతోష్ ఘటన స్థలానికి చేరుకొని సంగం సభ్యులతో మాట్లాడి ఫోర్జరీ సంతకాలతో ఎంత మంది గ్రూప్ సభ్యులతో డబ్బులు విత్ డ్రా చేశారో పూర్తిస్థాయిలో విచారణ చేసి ఆరోపణ నిజమైతే కేసు నమోదు చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండలంలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వస్తుండడంతో మహిళా సంఘం గ్రూపు సభ్యులు ఎమ్మెల్యే కాన్వాయిని ఆపి ఫోర్జరీ సంతకాలతో మాకు అన్యాయం జరిగిందని తెలపడంతో ఎమ్మెల్యే పోలీసులకు, విబికే ,బ్యాంకు వారిపై పూర్తి విచారణ జరపాలన్నారు. వెంటనే వారిపై కేసులు నమోదు చేసి రికవరీ చేసి న్యాయం చేయాలని తెలిపారు.

# మిల్లర్లు సిఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సిఐకి వెంటనే అందజేయాలి

### గ్రామపంచాయతీ అధికారులు వస్తున్నందున క్లస్టర్ ప్రణాళికలు సిద్ధం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 12 (జనం సాక్షి):** రబీ 2024-25 సీజన్‌కు సంబంధించి బకాయిలో ఉన్న కస్టమ్ మిల్లింగ్ బియ్యం సీఎంఆర్ మిల్లర్లు తక్షణమే పూర్తిగా అందజేయాలని, అలాగే ఖరీఫ్ మరియు రబీ 2025-26 సీజన్లకు సంబంధించిన బియ్యం డెలివరీలను వేగవంతం చేయాలని రెవిన్యూ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు.మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించిన రైస్ మిల్లర్ల జిల్లా సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లర్లు తమ మిల్లు సామర్థ్యం మేరకు సిఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సమయానికి అందజేయాలని కోరారు. అలాగే మిల్లర్లు తమకు అప్పగించిన ధాన్యం పరిమాణానికి తగినట్టుగా బియ్యం సరఫరా చేసుకోవాలని, తమ బాధ్యతగా భావించాలని ఆయన మిల్లర్లకు సూచించారు.
ఎఫ్‌సీఐ అధికారులు డెలివరీలకు అనుగుణంగా తగిన సంఖ్యలో గోదాములను ఏర్పాటు చేసి, జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలి అని పేర్కొన్నారు.గోదాముల్లో సరైన తరలింపు కోసం తగినంత మంది హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆయన కోరారు. అలాగే బియ్యం నిల్వ మరియు రవాణా సదుపాయం కలిపించాలని అన్నారు.జిల్లా కు గ్రామ పంచాయతీ అధికారులు రాబోతున్నందున క్లస్టర్ వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలనీ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు.మంగళవారం తన ఛాంబర్‌లో అన్ని మండలాల తహసీల్దార్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిపిఓల నియామకం జరుగబోతున్నందున మండలాలో క్లస్టర్ వారీగా గ్రామాలను గుర్తించి ఒక క్లస్టర్ లో ఎన్ని గ్రామాలు ఉంటాయి, వాటిని గుర్తించి ప్రణాళిక లు సిద్ధం చేయాలనీ ఆదేశించారు. మండలాల తహసీల్దార్ లు అందరు మీ పరిధిలో ఉండే మీ సేవ సెంటర్ లను తనిఖీ చేయాలనీ, సెంటర్ లలో జరిగే పనులపై వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఓ వాసు చంద్ర, డిఎంసిఎస్ కృష్ణమోహన్ డీఎస్ఓ సుదర్శన్ అన్ని మండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



# లోతట్టు ప్రాంతాల ఎమ్మెల్యే పర్యటన

### సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ఆదేశాలు

**అల్వాల్, ఆగస్ట్ 12(జనంసాక్షి):** అల్వాల్ సర్కిల్ వెంకటాపురం డివిజన్ లోని మానస సరోవర్ అపార్టుమెంట్, కమలాలయ ఎన్‌క్లేవ్‌లలో లోతట్టు ప్రాంతాల సమస్యలు, వర్షపు నీటి నిల్వలపై మంగళవారం మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పర్యటించారు. మానస సరోవర్ విల్లాస్, వాసవి గ్రాండ్ విస్టా, ఎలిగెంట్ క్లౌ అపార్ట్మెంట్లలో ఎగువ ప్రాంతాల నుంచి నీరు చేరి భూగర్భ భాగం సహా లోతట్టు ప్రదేశాలు మునిగిపోతున్నాయని స్థానికులు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. నీటిని బయటకు పంపే మార్గాలు, వర్షపు నీటి కాలువ, మిగులు నీటి కోసం నీరు పట్టే గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. కమలాలయ ఎన్‌క్లేవ్‌లో కూడా నీటి నిల్వలు సమస్యగా మారాయని గుర్తించిన ఎమ్మెల్యే, ఈ ప్రదేశం కంటోన్మెంట్, కూకట్పల్లి, మల్కాజ్గిరి సరిహద్దులో ఉండడంతో పరిస్థితి క్లిష్టతరమైందన్నారు. నీటి కాలువను తాత్కాలికంగా పొడిగించి, వర్షపు నీరు సులభంగా పారేలా శాశ్వత వర్షపు నీటి కాలువ నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహానగర పాలక సంస్థ ఇంజినీరింగ్, జలమండలి, హైడ్రాలిక్ శాఖల ఇంజినీర్లు, స్థానిక కార్పొరేటర్, కాలనీవాసులు, నాయకులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# జిల్లాలో భారీ వర్షాలు... అప్రమత్తంగా ఉండండి

- ప్రమాదమున్న చోటు వెంటనే గుర్తించాలి
- సమన్వయంతో పని చేయండి
- సర్ఫ్ సీఈవో స్పెషల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్



**వికారాబాద్, ఆగస్టు 12 (జనంసాక్షి):** జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని సెర్ప్ సీఈవో, జిల్లా స్పెషల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ, నిరంతర వర్షాల కారణంగా అత్యవసర పరిస్థితుల్లో రెవెన్యూ, అడ్మినిస్ట్రేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పొంగి పొర్లుతున్న చెరువులు, వాగుల వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. వంతెనలు, వాగుల వద్ద ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి, నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలు, రెసిడెన్షియల్, గురుకుల వసతి గృహాల్లో పైకప్పు నుంచి నీరు కారితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని, పాత భవనాలను గుర్తించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మురుగు, వర్షపు నీరు నిల్వ లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, అంటు వ్యాధులు, మలేరియా, పాము కాటు వంటి సమస్యల నివారణకు వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచాలని వైద్య అధికారులకు ఆదేశించారు. పట్టణాలు, గ్రామాల్లో శానిటేషన్, బ్లీచింగ్ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు సూచించారు. శాఖల వారీగా వర్షాల కారణంగా జిల్లాలో చేపడుతున్న చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుదీర్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్డీవో సుదీర్, డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి భేటీ

- బైపాస్ రైతులకు పరిహారంపై చర్చ.
- కాగ్నా నది తాగు నీటి పైపులైన్ నిధులకు విజ్ఞప్తి



**తాండూరు అగస్టు 12(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి భేటి అయ్యారు.మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాండూరులో చాలా ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న బైపాస్ రోడ్డు విషయంపై చర్చించారు. బైపాస్ రోడ్డు విషయంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం సక్రమంగా అందక పనులు జరగడం లేదని సీఎం దృష్టికి తీసుకెళ్లా రు. భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించాలంటే రూ.25 కోట్ల అవసరం ఉందని వివరించారు. అదేవిధంగా తాండూరు పట్టణంలో స్వాతంత్రంకు పూర్వం ఉన్న పైపులైన్ వ్యవస్థ వల్ల తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతన్నాయని తెలిపారు. కాగ్నా నది నుంచి కొత్త పైపులైన్ వ్యవస్థ నిర్మాణంకు సుమారు రూ.50 కోట్ల నిధులతో ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. తాండూరు నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. తాండూరు సమస్యలపై స్పందించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

# జాతీయ క్రీడా పాలన బిల్లుతో ఎంతో ప్రోత్సాహం

- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర



క్రీడలు,క్రీడాకారులకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన పదేళ్ల పాలనలో తగు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.కేసీఆర్ ప్రోత్సాహంతో బాడ్మింటన్‌లో గోపీచంద్, టెన్నిస్ లో సానియా మీర్జా,బాక్సింగ్‌లో నిఖత్ జరీనా, క్రికెట్‌లో సిరాజ్, తన సొంత జిల్లా మహబూ బాబాద్‌కు చెందిన సాధుల మేఘన షూటింగ్‌లో, ఆకుల శ్రీజ తదితరులు అంతర్జాతీయ వేదికలపై తమ ప్రతిభాపాటాలు చాటి చెప్పారని, బాగా రాణిస్తున్నారని ఎంపీ రవిచంద్ర వివరించారు. క్రీడల నిర్వహణలో లోపాలు, అంతర్గత అధికార పోరు తగ్గించి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను జాతీయ క్రీడా పాలన బిల్లు -2025, ఉత్ప్రేరకాల నిరోధక బిల్లు -2025లను యువజన,క్రీడల శాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ మంగళ వారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లులపై జరిగిన చర్చ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, క్రీడలను రోజువారీ జీవితంలో భాగం చేయడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాలు, మహిళలు, ఆర్థికంగా బలహీన వర్గాల నుండి భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు దోహదపడే ఈ బిల్లులకు తమ పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం "సేఫ్ స్పోర్ట్స్ పాలసీతో క్రీడాకారులు తమ ప్రదర్శనపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందని, వారి హక్కులు, గౌరవం కాపాడబడతాయన్నారు.

# కాసేపట్లో తీర్పు... నిందితుడు ఎస్కేప్

- నల్గొండ జిల్లా కోర్టు ఆవరణలో ఘటన
- నిందితుడు మైనర్ బాలికపై అత్యాచారం కేసులో ఏ1
- వాష్ రూమ్‌కు వెళ్తానని చెప్పి పరార్

**నల్గొండ బ్యూరో (జనం సాక్షి) :** మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో తీర్పు వెలువడనున్న వేళ కోర్టుకు హాజరైన నిందితుడు పరారయ్యాడు. ఈ ఘటన నల్గొండ జిల్లా కేంద్రంలోని ఫోక్సో కోర్టు ఆవరణలో జరిగింది. వివరాల్లోకి వెళితే... ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న గ్యారాల శివ కుమార్ ఆమె మైనర్ కుమార్తెను బలవంతం గా వివాహం చేసుకుని.. లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించాడు. సదరు బాలిక నిరాకరించగా ఆమె దుస్తులు విప్పి వీడియోలు తీశాడు. అనంతరం ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువులు నల్గొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 2023 మే 8న పోలీసులు ఫోక్సో కేసుతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం సోమవారం తీర్పు ఇచ్చేందుకు సిద్ధం కాగా నిందితుడు శివ కుమార్ వాష్ రూమ్‌కు వెళ్తానని చెప్పి కోర్టు ఆవరణ నుంచి తప్పించుకుని పరారయ్యాడు. కాగా పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. కాగా ఈ కేసులో బాలిక తల్లి కూడా నిందితురాలు కావడం ఇక్కడ గమనార్హం.

**సొంత బిడ్డపై అత్యాచారం చేయించిన కేసులో తల్లికి 22 ఏళ్ల జైలు శిక్ష.**

సొంత మైనర్ కూతురిపై అత్యాచారం చేయించిన ఘోర ఘటనలో నల్లగొండ ఫోక్సో ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రోజా రమణి కీలక తీర్పు వెలువరించారు. ఈ కేసులో రెండో నిందితురాలైన వసంతపురి యాదమ్మ కు 22 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు. బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని కూడా కోర్టు ఆదేశించింది. నల్లగొండ వన్ టౌన్ పరిధి లైన్‌వాడకు చెందిన గ్యారాల శివకుమార్, వసంతపురి యాదమ్మ తో అక్రమ సంబంధం పెట్టుకొని, ఆమె మైనర్ కూతురిపై కన్నేశాడు. తల్లి సహకారంతో బాలికను బలవంతంగా పెళ్లి చేసుకోవడానికి ప్రయత్నించి, నిరాకరించడంతో దుస్తులు విప్పి వీడియో తీశాడు. అనంతరం శారీరక దాడికి పాల్పడ్డాడు.

ఈ ఘటనపై 2023 మే 8 న బాధితురాలు వన్ టౌన్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇద్దరిపై 366 - ఏ, 343, 376, 420, 506, 109 ఐపీసీ సెక్షన్లతో పాటు, ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు (ఎస్ సి నెం. 76/2023). రెండేళ్ల విచారణ అనంతరం కోర్టు ఇద్దరినీ దోషులుగా తేల్చింది. మొదటి నిందితుడు గ్యారాల శివకుమార్, ఉదయం కోర్టుకు హాజరై మధ్యలో పరారయ్యాడు. కోర్టు అతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అతడిని పట్టుకుని కోర్టులో హాజరు పరిచిన రోజు శిక్షను ఖరారు చేయనుంది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ వాదనలు వినిపించారు. అప్పటి దర్యాప్తు అధికారి రౌతు గోపి సాక్ష్యాలు, ఆధారాలు సేకరించారు.

# 24 గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- అధికారులకు సెలవులు రద్దు
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** రాబోయే మూడు రోజులు జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం, పశు నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందస్తు ఏర్పాట్లు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులు ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో అధికారులతో డిజాస్టర్ మేనేజ్మెంట్ పై వెబ్ క్స్ ద్వారా జిల్లా ఎస్పి నరసింహ, అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 13 నుండి 15 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తలపై రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్యమైన అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు,ఎస్పీలతో సమావేశం నిర్వహించారని తెలిపారు.అధికారులందరికీ రాబోయే మూడు రోజులు పాటు సెలవులు రద్దు చేస్తామని,అందరూ కార్యస్థానంలోనే ఉండాలని, ఎలాంటి నష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టరేట్ లో 24 గంటల పాటు అందుబాటులు ఉండేటట్లు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.ఎవరికైనా సహాయం కావాలంటే 628149 2368కి ఫోన్ చేసి సమాచారం అందిస్తే వెంటనే సహాయక చర్యలు చేపడతామని ప్రజలకు సూచించారు.జిల్లా స్థాయిలో మూడు బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు,డివిజన్ స్థాయిలో,మండల స్థాయిలో ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని వర్షం సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు అందించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలలో గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అందులో నివసిస్తున్న ప్రజలను వారి బంధువులు ఇంటికి తరలించాలని, అదేవిధంగా లోతట్టు ప్రాంతాలున్న ప్రజలను వేరే ఇంటికి తరలించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ఇల్లు కట్టేవద్దే రేకులు వేసుకొని ఉండకుండా వేరే ఇంటిలోకి వెళ్లాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వేణుమాధవ్, డిఎఫ్ఓ సతీష్ కుమార్, డిఆర్డిఏ పిడి వివి అప్పారావు, డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ పెంచి ఇస్తావా... రాజీనామా చేస్తావా

- 20 నెలలైన పించన్ పెంచలేని ప్రభుత్వం
- ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతి పక్షం ఫామ్ హౌస్‌కి పరిమితం
- పింఛన్లు పెంచేవరకు పోరాటం : మంద కృష్ణమాదిగ




**పాలకుర్తి, ఆగస్టు 12 ( జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు భాగంగా పింఛన్లు పెంచుతామని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి 20 నెలలు కావస్తున్నప్పటికి ఇంకా చేయూత పింఛన్లు పెంచ లేదని, పింఛన్లు పెంచి ఇస్తావా.. రాజీనామా చేస్తావా.. అని సీఎం రేవంత్ రెడ్డిని పద్మశ్రీ అవార్డు గ్రహిత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని బషారత్ గార్డెన్లో నిర్వహించిన చేయూత పించన్ దారుల నియోజకవర్గ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణమాదిగ హాజరై మాట్లా డారు. ప్రభుత్వం ఆసరా, చేయూత పింఛన్లు పెంచే వరకు పోరాటం కొనసాగి స్తామని హెచ్చరించారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళ లు, నేత, గీత, బీడీ కార్మికులకు పించన్ రూ.2 వేల నుంచి రూ.4 వేలు, దివ్యాంగుల పించన్ రూ. 6 వేలకు పెంచాలన్నారు. పింఛన్లను పెంచుతామ ని సీఎం రేవంత్రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.100 ఉన్న పింఛన్ రూ. 4 వేల వరకు పెచేందుకు ఎమ్మార్పీఎస్ కృషి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలైనా ఇంకా పింఛన్ పెంచలేదని విమర్శించారు. పక్క రాష్ట్రంలో ఆసరా పింఛన్లను రూ.4 వేలు, దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలకు పెంచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని ప్రశ్నించాల్సిన ప్రధాన ప్రతిపక్షం ఫాంహౌజుకు పరిమితం అయిందన్నారు. ఫాంహౌజుకు పరిమితం అయిన ప్రతిపక్షం అవసరమా అని ప్రశ్నించారు. ఆటు ముఖ్యమంత్రి, ఇటు ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇద్దరు బాధ్యతను విస్మరించారని విమర్శించారు. రేవంత్ రెడ్డి, కెసిఆర్ ఇద్దరు కూడా భూస్వాములకే కొమ్ము కాస్తారని, భూస్వామ్య వర్గంలో పుట్టిన ఈ ఇద్దరికీ పేద ప్రజల కష్టాలు తెలవయని విమర్శించారు. ఈ ఇద్దరు పక్క రాష్ట్రంలోని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధాన శిష్యులునని అతన్ని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. ఎందుకంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారం లోకి రాగానే చంద్రబాబు అమలు చేశారని, అక్కడి వృద్ధులు, దివ్యాంగులు సంతోషంతో ఉన్నారని గుర్తు చేశారు. వచ్చే నెల 3న హైదరాబాద్లో పెద్ద ఎత్తున మహగర్జన సభను నిర్వహిస్తున్నట్లు ఈ సభకు వేలాదిగా వృద్ధులు, దివ్యాంగులు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు పునీల్ మాదిగ, యాదగిరిస్వామి, తాళ్లపల్లి కుమార్, గడ్డల కిశోర్, దిండిగారి వెంకన్న, గుండాల రవి, రమేష్, వలపు వెంకన్న, సుధాకర్, జల్లం నరేష్, దండు రాంచంద్రం, శ్రీదర్ ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
13 ఆగస్టు 2025

## పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యం కూనీ

- బీజేపీ, మోదీ ప్రభుత్వంపై ఎంపీ మల్లు రవి ఫైర్..
- రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే రాజ్యాంగానికి రక్ష అని వ్యాఖ్య



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మోదీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని.. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి వ్యాఖ్యానించారు. క్వశ్చన్ అవర్‌లో కనీసం ప్రశ్నలు అడిగే అవకాశం కూడా ఇవ్వడం లేదన్నారు. బీహార్‌లో జరిగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పైన చర్చ కోసం కాంగ్రెస్ పార్టీ పట్టుబడితే.. ఇప్పటివరకు దానిపై స్పందన లేదని చెప్పారు. ముఖ్యంగా ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు అడిగే ఏ ప్రశ్నకూ ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ, కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. లోక్ సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్ పార్టీల ఎంపీలు చర్చకు పట్టుబడితే.. వెంటనే వాయిదా వేస్తున్నారని మల్లు రవి వివరించారు. సాయంత్రం పూట సభ మళ్లీ ప్రారంభించి.. వారికి నచ్చిన బిల్లులను ఆమోదిస్తున్నారని ఆరోపించారు. ప్రజల కోసం తీసుకొచ్చే బిల్లులపై ప్రతిపక్ష ఎంపీలు మాట్లాడకుంటే.. ఇదేం ప్రజాస్వామ్యం అని మల్లు రవి ప్రశ్నించారు. దేశంలో చౌకీదార్.. చోర్ అయ్యారని మల్లు రవి వ్యంగాస్త్రాలు సంధించారు. మోదీ ఓట్ల చోరీ చేస్తున్నారని ఆరోపించారు. ఇంతటి నియంతృత్వ పాలనను రాజుల కాలంలో కూడా చూడలేదని వ్యాఖ్యానించారు. ఇదే బీజేపీ చివరి ప్రభుత్వం అని.. రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా ఇండియా కూటమి విజయం సాధిస్తుందని మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే.. రాజ్యాంగానికి రక్షణ ఉంటుందని మల్లు రవి వ్యాఖ్యానించారు.

## ఆధునిక వైద్య సాంకేతికతతో అత్యుత్తమ చికిత్స

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ఉదయ్ ఓమ్నీలో 'అత్యాధునిక రోబోటిక్ వ్యవస్థ' ప్రారంభం
- ఆర్థోపెడిక్ వైద్యంలో ఇది ఒక విప్లవం



**హైదరాబాద్, ఆగస్టు 12 (జనంసాక్షి) :** ఆధునిక వైద్య సాంకేతికతతో రోగులకు ఉత్తమ చికిత్స అందించవచ్చని, త్వరగా కోలుకోవడానికి ఎక్కువ ఆస్కారం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు తెలిపారు. దక్షిణాదిలో ఆర్థోపెడిక్స్, ట్రామా కేర్‌లో ఉదయ్ ఓమ్ని ఎంతో పేరుగాంచింది. అబిడ్స్ చాపెల్ రోడ్డులో ఉన్న ఉదయ్ ఓమ్ని హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన 'అత్యాధునిక మిస్సో రోబోటిక్ వ్యవస్థ'ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఇది దక్షిణ భారతదేశంలో అత్యంత కచ్చితత్వంతో కూడిన మొదటి ఆర్థోపెడిక్ వ్యవస్థగా చెప్పవచ్చు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉదయ్ ఓమ్ని హాస్పిటల్ తెలంగాణకు ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలను తీసుకురావడంలో ముందంజలో ఉందన్నారు. ఇక్కడ రోబోటిక్ సర్జరీ ప్రారంభించడం వల్ల ఎంతో మంది రోగులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఆర్థోపెడిక్ సంరక్షణ ప్రమాణాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా రోబోటిక్ సర్జరీలు ఏటా 15 శాతం వృద్ధి చెందుతున్నాయని చెప్పారు. 2030 నాటికి మార్కెట్ 18 బిలియన్లకల డాలర్లకు చేరుకుంటుందని అంచనా ఉందన్నారు. భారతదేశంలో ఈ వృద్ధి మరింత వేగంగా ఏటా 20 శాతంతో కొనసాగుతోందన్నారు. ఇది రాబోయే కాలంలో ఉన్న అపారమైన అవకాశాలు, భవిష్యత్తు సామర్థ్యాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. పేదలకు ఉత్తమ వైద్య సేవలు అందించడానికి, ప్రభుత్వ హాస్పిటల్స్ లో ఆధునిక వైద్య సాంకేతికతను ప్రవేశపెట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్ ఓమ్నీ హాస్పిటల్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చీఫ్, డైరెక్టర్, ఎఫ్ఆర్సీస్ (ట్రామా, ఆర్థో) యూకే డాక్టర్ ఉదయ్ ప్రకాశ్ మాట్లాడుతూ దక్షిణాదిలో ఆర్థోపెడిక్స్, ట్రామా కేర్‌లో ఉదయ్ ఓమ్ని యాభై ఏళ్లగా ఎంతో పేరు సంపాదించింది. శస్త్రచికిత్సలు చేయడంలో నాకు ముప్పై ఏళ్ల అనుభవం కలదన్నారు. ఈ మూడు దశాబ్దాలలో వేల మోకాలి, నడుమ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ అత్యాధునిక రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ విభాగంతో కచ్చితమైన సేవలు అందించవచ్చన్నారు.

## పెద్దఎత్తున రహదారుల అభివృద్ధి

- గత ప్రభుత్వం అభివృద్ధి పనుల బకాయిలు 45,000 కోట్లను వారసత్వంగా ఇచ్చి వెళ్లింది
- హామ్ రోడ్డు పనుల్లో చిన్న కాంట్రాక్టర్లకూ అవకాశం కల్పిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- తెలంగాణ రహదారి అభివృద్ధికి నూతన శకం : మంత్రి సీతక్క





**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో పెద్ద ఎత్తున రహదారులను అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హైటెక్స్‌లో నిర్వహించిన హామ్ రోడ్లు సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారులు నాగరికతకు చిహ్నాలు, రహదారులు అభివృద్ధి జరిగితే మారుమూల ప్రాంతాల నుంచి ఎక్కడికైనా ఉత్పత్తి అయిన వస్తువులను సునాయాసంగా తరలించవచ్చని అన్నారు. రహదాల నిర్మాణంతో పరిశ్రమలు పెరిగి తద్వారా మన రాష్ట్ర యువతకు ఉపాధి, ఆదాయం సమకూరుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ కార్యక్రమాలే కాదు తెలంగాణ రైసింగ్ లో భాగంగా ఇన్‌ఫ్రా, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాలను ముందుకు తీసుకు వెళుతుందని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 17 ప్యాకేజీల ద్వారా రాష్ట్రంలో 7,947 కిలోమీటర్ల మేర, రోడ్లు భవనాల శాఖ పరిధిలో 17 ప్యాకేజీల ద్వారా 5,190 మేరకు రోడ్లు అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. క్యాబినెట్ ఆమోదించిన రోడ్డు పనులకు త్వరితగతిన టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని, కాంట్రాక్టర్లకు ఆర్థికంగా ప్రోత్సాహం కల్పించేందుకు బ్యాంకర్ల తోనూ సమావేశం ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. కాంట్రాక్టర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి అవగాహన ఉందని, గత ప్రభుత్వ పెద్దలు 1.75 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ఒప్పందాలు చేసుకొని, 45 వేల కోట్ల విలువైన పనులకు టోకెన్లు జారీ చేసి ఆ బకాయిలు చెల్లించకుండా మాకు వారసత్వంగా ఆర్థిక భారాన్ని మిగిల్చి వెళ్లారని డిప్యూటీ సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ప్రభుత్వ సెక్రటరీలు దృష్టి పెట్టి పనిచేయడంతో క్రమంగా ఆర్థిక పరిస్థితులు చక్కబడుతున్నాయి కాంట్రాక్టర్ల ఇబ్బందులను అధిగమించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు సంపద సృష్టిలో భాగస్వాములుగా ప్రజా ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మానవీయ కోణంలో పనిచేస్తుంది, ట్రాఫిక్ ను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో ఇంకా కొన్ని రోడ్లను ఫోర్ లైన్ రోడ్లుగా మార్చాల్సి ఉంది త్వరగా ఆ జాబితా రూపొందించి క్యాబినెట్లో పెట్టి ఆమోదం పొందాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. హామ్ రోడ్లకు రాష్ట్ర ప్రభుత్వ వాటా 40% నిధుల సమీకరణకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. భవిష్యత్తులో కాంట్రాక్టర్లకు ఇబ్బందులు ఉండవని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ లో కాంట్రాక్టర్లు భాగస్వాములు కావాలన్నారు. హామ్ రోడ్డు పనుల్లో చిన్న కాంట్రాక్టర్లకు అవకాశం కల్పిస్తాం అన్నారు.

హామ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ తెలంగాణలో రహదారి అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు హామ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. వేగంగా, నాణ్యమైన రహదారులు నిర్మించేందుకు హామ్ విధానాన్ని అవలంబిస్తున్నామని, పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాతే ఈ విధానానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు.

## 'బీఆర్‌ఎస్ కదనభేరీ' మళ్లీ వాయిదా

చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో బీఆర్‌ఎస్ పార్టీ కదనభేరి పేరిట నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జన సభను మరోసారి వాయిదా వేసింది. భారీ వర్ష సూచన నేపథ్యంలో ఈ భారీ బహిరంగ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కరీంనగర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ నేత గంగుల కమలాకర్.. తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రకటన చేశారు. భారీ వర్ష సూచన కారణంగానే ఈ సభను వాయిదా వేసినట్లు– ఆయన తెలిపారు.రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని.. అందులో భాగంగా ఆగస్ట్ 14, 15, 16, 17 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే సూచించిందని వివరించారు. ఈ క్రమంలో ఈ కదన భేరి సభను వాయిదా వేసినట్లు తెలిపారు. అయితే వాతావరణం అనుకూలించిన తర్వాత ఈ సభను నిర్వహించాలని పార్టీ అగ్రనాయకత్వం భావిస్తుందని పేర్కొన్నారు. సభను మళ్లీ ఎప్పుడు నిర్వహించనున్నది మరికొద్ది రోజుల్లో నిర్ణయించి.. ప్రకటిస్తామని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు గమనించాలని సూచించారు. తొలుత ఆగస్ట్ 8వ తేదీన కరీంనగర్ వేదికగా ఈ కదన భేరీ సభ నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం నిర్ణయించింది. కానీ ఎందుకో.. ఈ సభను ఆగస్ట్ 14వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించింది. కానీ భారీ వర్షాల నేపథ్యంలో ఈ సభను మరోసారి వాయిదా వేశారు. ఈ సభ ఏర్పాటుపై వాయిదాల పర్వం కొనసాగడానికి వెనుక ఉన్న కారణాలు ఏమై ఉంటాయనే ఒక చర్చ అయితే రాజకీయ వర్గాల్లో బలంగా సాగుతోంది. అయితే వర్షాల కారణంగానే బీసీ కదన భేరి సభను వాయిదా వేస్తున్నట్లు– కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రకటించారు. ప్రస్తుతం సభ నిర్వహణకు అన్నీ ఏర్పాట్లు– జరుగుతున్నాయని, అయితే.. వాతావారణ శాఖ చెప్పిన అంశాలను పరిగనణలోకి తీసుకొని వాయిదా వేస్తున్నట్లుగా పేర్కొన్నారు. భేరి ఎప్పుడు నిర్వహించే విషయాన్ని.. తదుపరి ప్రకటిస్తామని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఈ విషయాన్ని గమనించాలని ఆ ప్రకటనలో కోరారు.

## విద్యార్థుల మధ్య గ్యాంగ్ వార్

- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**హైదరాబాద్, ఆగస్ట్12 (జనంసాక్షి) :** ఎల్బీనగర్‌లో విద్యార్థి గ్రూపుల మధ్య జరిగిన గ్యాంగ్ వార్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లుగా సిసి కెమెరాల్లో నమోదు అయ్యింది. శుక్రవారం ఈ ఘటన జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొట్టుకున్న విద్యార్థులంతా అవినాష్ కాలేజీ వారుగా తెలుస్తోంది. ఒక గ్యాంగ్‌పై మరో గ్యాంగ్ దాడి చేసుకున్న దృశ్యాలు సీసీ ఫుటేజ్‌లో రికార్డ్ అయ్యాయి. గ్యాంగ్ వార్‌పై ఎల్బీనగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మొత్తం 15మందిపై ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. విద్యార్థుల మధ్య వాగ్వాదం జరగడానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై కాలేజీ నిర్వాహకులను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులు ఘర్షణ పడుతుంటే కాలేజీ నిర్వాహకులు ఏం చేస్తున్నారని పోలీసులు ప్రశ్నించారు. అయితే ఘర్షణలో పలువురు విద్యార్థులకు గాయాలైనట్లు సమాచారం. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు పోలీసులు చెప్పారు.

## ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం ఆపాలంటూ హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్, ఆగస్ట్ 12 (జనంసాక్షి) :** గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం సరికాదంటూ ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గోషామహల్ స్టేడియంలో కొత్త భవనం నిర్మించి ఉస్మానియా ఆస్పత్రిని అక్కడికి తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాము అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. స్టేడియానికి చెందిన స్థలాన్ని ఆస్పత్రి కోసం బదలాయిస్తూ తీసుకున్న నిర్ణయం ఏకపక్షమని, పట్టణ ప్రాంతాల అభివృద్ధి చట్టాలకు విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఆ స్టేడియంలో పాఠశాల ఉందని, విద్యార్థులకు చెందిన ఆటస్థలంలో ఆస్పత్రి నిర్మాణం సరికాదన్నారు. ప్రస్తుతం మైదానం కూల్చివేత పనులు జరుగుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేసినట్లు అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. పేదలకు వైద్య సదుపాయం అందించడానికే ఆస్పత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. ఎంత స్థలంలో నిర్మాణం చేపడుతున్నారని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. ఎంత స్థలంలో కడుతున్నాం.. ఎంత ఖాళీ స్థలం ఉంటుంది తదితర పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయడానికి గడువు కావాలని ఏజీ కోరారు. దీనికి అనుమతిస్తూ విచారణను సెప్టెంబర్ 26కు వాయిదా వేసింది. ఆలోగా ఆస్పత్రి తరలింపునకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

## ఫ్రీడమ్ ఫైటర్స్ పెన్షన్ కేసుల పరిష్కారం

- ఎనిమీ ప్రాపర్టీ ఆస్తులు గుర్తించి తగు చర్యలు
- ఉన్నతాధికారులతో సమీక్షించిన కేంద్రమంత్రి బండి సంజయ్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12 (జనంసాక్షి) :** నెలాఖరులోపు స్వాతంత్య్ర సమరయోధుల పింఛను కేసులను పరిష్కరిం చాలని అధికారులను కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన.. దీనిపై తక్షణమే సర్వే చేయాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా 12,800 ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నాయని కేంద్రమంత్రికి అధికారులు తెలిపారు. 600కుపైగా ప్రాపర్టీస్ వేలందశలో ఉన్నాయని వివరించారు. వేలం వేసిన ఆస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.107 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. పెండింగ్ ఫైళ్లను వేగంగా క్లియర్ చేసిన అధికారులను కేంద్రమంత్రి అభినందించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన కార్యాలయంలో పునరావాస విభాగంసీనియర్ అధికారులు, ఇండియాలో శత్రు ఆస్తుల సంరక్ష అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా స్వాతంత్య్ర సమరయోధుల పెన్షన్లు, శత్రు ఆస్తుల ఆర్థీకీకరణ, శరణార్థుల పునరావాసలపై అధికారులు కేంద్ర మంత్రికి సమగ్ర నివేదిక అందజేశారు. స్వాతంత్య్ర సమరయోధుల పెన్షన్ కేసులను ఈ నెలాఖరులోపు పరిష్కరించాలని బండి సంజయ్ అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా 12,800 ఎనిమీ ఆస్తులున్నాయని అధికారులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వివరించారు. 600లకుపైగా ఎనిమీ ప్రాపర్టీస్ వేలం దశలో ఉన్నాయని తెలిపారు. ఫ్రీడం ఫైటర్స్ పెన్షన్ కేసులను పరిష్కరించి, ఎనిమీ ఆస్తులపై తక్షణమే సర్వే చేయించాలని ఆయన అధికారులకు సూచించారు. తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎనిమీ ప్రాపర్టీస్ సమస్యలను పరిష్కరించేందుకు సర్వేను వేగవంతం చేయాలని ఆయన చెప్పుకొచ్చారు.

## తిక్కరేగిందంటే బ్రహ్మోస్‌తో అంతుచూస్తాం

- పాక్ ప్రేలాపనలపై మండిపడ్డ మిథున్
- బిలావల్ భుట్టో వ్యాఖ్యలపై ఆగ్రహం



**కోల్‌కతా, ఆగస్ట్ 12 (జనంసాక్షి) :** భారత్‌తో యుద్ధం రావొచ్చంటూ పిచ్చి ప్రేలాపనలు చేసిన పాక్ నేత బిలావల్ భుట్టోపై బీజేపీ నేత మిథున్ చక్రవర్తి మండిపడ్డారు. తిక్కరేగిందంటే మిసైళ్ల వర్షం కురిపిస్తామని హెచ్చరించారు. ఇలాంటి వ్యాఖ్యలకు మాకు తిక్క రేగిందంటే వరుస పెట్టి బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగిస్తామని అంటూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. భారత డ్యాములు కూల్చేస్తామంటూ పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ చేసిన వ్యాఖ్యలపై కూడా మిథున్ చక్రవర్తి తనదైన శైలిలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. '140 కోట్ల మంది మూత్ర విసర్జన కోసం డ్యామ్ కట్టే ఆలోచనలో ఉన్నాము. ఆ తరువాత డ్యామ్ గేట్లు– తెరిస్తే భారీ సునామీ వస్తుంది. ఇదంతా బిలావల్‌ను ఉద్దేశించి అన్నాను. పాక్ ప్రజలపై నాకు ఎలాంటి కోపం లేదు' అని మిథున్ చెప్పారు. అమెరికా మద్దతు లభించడమో మరొకటో తెలీదు కానీ గత కొద్ది రోజులుగా పాక్ నేతలు మళ్లీ పిచ్చి ప్రేలాపనలు మొదలెట్టారు. అమెరికా వేదికగా పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ అణు హెచ్చరికలు చేశారు. తమ దేశ ఉనికికి ముప్పు వచ్చిన పక్షంలో తమతో పాటు– సగం ప్రపంచం అంతమైపోతుందంటూ ఉన్మాదంతో ఊగిపోయారు. ఈ క్రమంలో పీపీపీ పార్టీ నేత బిలావల్ భుట్టో కూడా రెచ్చిపోయారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా పాక్ ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. యుద్ధం మినహా మరో ప్రత్యామ్నాయం లేని పరిస్థితి భారత్ కల్పిస్తోందంటూ అన్యాయంగా బెదిరింపులకు దిగారు. పాక్‌తో ఘర్షణల్లో ఓటమి కారణంగానే భారత్ సింధు నదులపై డ్యామ్‌ల నిర్మాణానికి నడుం కట్టిందని అన్నారు. పహల్గాం దాడి తరువాత భారత్ పాక్‌కు బుద్ధి చెప్పేందుకు బహుళ అంచెల వ్యూహం ప్రయోగించింది. అటు– ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకలను మట్టి కరిపించడంతో పాటు సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందాన్ని కూడా నిలుపుదల చేసింది. ఇరు దేశాల మధ్య స్నేహసంబంధాల ఆధారంగా ఒప్పందం కుదుర్చుకున్న విషయాన్ని అప్పట్లో భారత్ పేర్కొంది. తమపై పాక్ అకారణంగా విషం చిమ్ముతున్న నేపథ్యంలో ఒప్పందాన్ని కొనసాగించలేమని స్పష్టం చేసింది. ఈ క్రమంలో పాక్ నేతల తీరుపై మిథున్ చక్రవర్తి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## సిబిఐకి న్యాయవాద దంపతుల హత్య కేసు

### స్వాగతించిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఆగస్ట్ 12 (జనంసాక్షి) :** న్యాయవాదులు గట్టు వామనరావు దంపతుల హత్యకేసును సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రి.. ఈ విషయంపై మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో వామనరావు దంపతులను దారుణంగా హత్య చేస్తే విచారణ కూడా సరిగ్గా చేపట్టలేదని మంత్రి విమర్శించారు. దీంతో వామనరావు తండ్రి వెంకటరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలిపారు. సుప్రీంకోర్టు తాజాగా ఈ కేసును సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వారి హత్యలో గత ప్రభుత్వంలోని కొంత మంది పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని, దోషులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

## అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని ఆత్మహత్య

**రాజేంద్రనగర్, ఆగస్టు12(జనంసాక్షి) :** విద్యని అభ్యసిస్తున్న వివాహిత మహిళ అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి తెలిపిన ప్రకారం గండిపేట మండలం నార్సింగ్ మున్సిపాలిటీ కి చెందిన ముల్లపాటి సాయి కిరణ్ ఫిర్యాదుతో ఖమ్మం పట్టణం, జిల్లా, అబ్దుల్ కలాం నగర్ కు చెందిన వివాహిత బి. సుష్మిత,(18) తండ్రి. మల్కయ్య, ఆమె విద్యార్థినిగా, ఇబ్రహీంబాగ్ లోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నప్పుడు మూడు-భాగాల వసతి గృహంలోని హాస్టల్‌లోని గది నంబర్ 204లో ఉంటుంది. ఈనెల 11న ఆమె రూమ్‌మేట్ అర్చన గది ప్రధాన తలుపు తెరవడానికి ప్రయత్నించింది కానీ, అది లోపలి నుండి లాక్ చేసి ఉండడంతో ఆమె వెంటనే హాస్టల్ వార్డెన్ నవీన బెజ్జారామ్‌కు సమాచారం అందించింది. వారిద్దరూ తలుపు తెరిచి చూడగా బి. సుష్మిత వస్త్రంతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. వారు వెంటనే ఫిర్యాదుదారునికి, ఆమె మామకు సమాచారం అందించారు. వైద్య సహాయం కోసం 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, సుష్మిత ఆత్మహత్యకు ప్రధాన కారణలపై ఏమై ఉంటుందని పోలీసులు పలు కోణాల్లో విచారిస్తున్నారు. ఈ ఘటనతో నార్సింగ్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370